

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆



fb/prajasakti | Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam and ongole | www.prajasakti.com

సంపుటి : 37 సంచిక : 214 | విజయవాడ, శుక్రవారం 4 ఆగస్టు 2017 | 12 + 12 పేజీలు వెల : 4.00

'జన్మభూమి' ప్రక్షాళన

- టిడిపి సమన్వయ కమిటీ సమావేశంలో చంద్రబాబు
- పార్టీ నష్టపోతే ఇన్‌ఛార్జి మంత్రులదే బాధ్యత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని జన్మభూమి కమిటీలను ప్రక్షాళన చేస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ఎన్ చంద్రబాబునాయుడు తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రస్తుత కమిటీలు పూర్తిగా విఫలమయ్యాయని, ఈ నెలాఖరులోపు కొత్త కమిటీలను ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. సచివాలయంలో గురువారం ఉదయం జరిగిన టిడిపి సమన్వయ కమిటీ సమావేశానికి చంద్రబాబునాయుడు అధ్యక్షత వహించారు. జన్మభూమి కొత్త కమిటీల నియామకంలో ఇన్‌ఛార్జి మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షులు, స్థానిక ఎమ్మెల్యేలకు ప్రాధాన్యత కల్పించాలని తెలిపారు. ఇప్పటికే ఆయా కమిటీలపై ఐవిఆర్‌ఎస్ పద్ధతిలో నిర్వహించిన అభిప్రాయ సేకరణలో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని స్పష్టం చేశారు. కమిటీలను మార్చకపోతే పార్టీకి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆయన అభిప్రాయపడినట్లు తెలిసింది. ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయడంలో పార్టీ జిల్లా నాయకత్వాలూ వైఫల్యం చెందాయని, మంత్రులూ పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

బెల్టు దుకాణాలు, ఇసుక విధానంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి

బెల్టు దుకాణాల రద్దుపై ప్రజల్లో 95 శాతం సంతృప్తి ఉందని, కానీ ఈ నిర్ణయం అమలులోనూ వైఫల్యం కనిపిస్తోందని, ఇందుకు అక్కడక్కడా స్థానిక నాయకత్వం అడ్డుపడుతో ందని తన దృష్టికి వచ్చినట్లు చంద్రబాబు తెలిపారని తెలిసింది. ప్రభుత్వ నిర్ణయం అమలు కాకుంటే చివరికి పార్టీకే నష్టమంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక విధానంపైనా ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని, మార్పులు చేయాల్సి ఉందని అన్నారు. ఇప్పటికే జిల్లాల్లో నలుగురు చొప్పున కమిటీలు వేశామని, వాటి నివేదిక ఆధారంగా మార్పులు చేర్పులు చేస్తామని తెలిపారు.

నెలాఖరులోగా కొత్త కమిటీలు




గర్భిణులకు ఇంటికే సరకులు

అన్న అమృతహస్తం పథకంలోనూ మార్పులు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రం వద్దకు వచ్చి తిని వెళ్లలేరని, వారికి సరుకులు ఇంటికిస్తే తీసుకెళ్లి వండుకుంటారని, ఆ విధంగా మార్పులు చేయాల్సి ఉందని తెలిపారు. 67 శాతం మంది ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారని పేర్కొన్నారు.

నంద్యాల్లో గెలుపు ఖాయం

నంద్యాల ఉప ఎన్నికల్లో గెలుపు ఖాయమని, మెజార్టీ కోసం మంత్రులు పనిచేయాలని సూచించారు. స్థానిక పార్టీ నాయకత్వాన్ని కూడా కలుపుకొని పోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఉద్దానం ప్రాంత కిడ్నీ బాధితుల కోసం పవన్ కళ్యాణ కృషి చేస్తున్నారని ప్రశంసించారు. కిడ్నీ మిగతా9లో

మంత్రులపై ఆగ్రహం



జిల్లాల్లో పార్టీ నష్టపోతే దానికి మంత్రులే కారణమని, సంక్షేమ పథకాలను ఎందుకు ప్రచారం చేయలేకపోతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రివర్గ సమావేశం లోనూ నలుగురు మంత్రులను తీవ్రస్థాయిలో మందలించినట్లు తెలిసింది. కర్నూలు జిల్లా విషయంలో మంత్రులెవరూ క్షేత్రస్థాయిలో ప్రజల నాడిని పట్టుకోలేకపోయారని అన్నట్లు తెలిసింది. ఇలా వ్యవహరిస్తే ఇబ్బందులు ఎదురవుతాయ న్నారు. నెలరోజుల నుండి నంద్యాలలోనే ఉంటున్నా అక్కడి పరిస్థితులను పూర్తిస్థాయిలో అదుపులోకి తీసుకోలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల అమలు విషయంలో మంత్రులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని, శాఖల పేరుతో జిల్లాల్లో ఎవరికితోచిన విధంగా వారు వ్యవహరిస్తున్నారన్నారు. విశాఖ, విజయనగరం, గుంటూరు, ప్రకాశం, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో పార్టీలో గ్రూపులు తీవ్రస్థాయిలో ఏర్పడినా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించినట్లు సమాచారం. ఇన్‌ఛార్జి మంత్రులు దృష్టిసారిస్తే సమస్యలు తేలిగ్గా పరిష్కారం అవుతాయని సూచించారు. విశాఖ విషయంలో మంత్రుల తీరుపై తొలిసారి చంద్రబాబు తీవ్రస్థాయిలో స్పందించారు. భూ కుంభకోణాల్లో మంత్రుల ప్రమేయం ఉందని వార్తలు రావడమే తీవ్రస్థాయిలో మిగతా9లో



కుదేలైన సేవలు

జిఎస్‌టి ప్రభావం — తాజాసర్వేలో వెల్లడి

బెంగళూరు: గత నెల ఒకటో తేదీ నుండి అమలులోకి వచ్చిన వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి) విధానంతో సేవల రంగం కుదేలయినట్లు తాజా సర్వేలో వెల్లడయింది. జిఎస్‌టి అమలులోకి వచ్చిన కొత్తలో కొంత అయోమయ పరిస్థితి నెలకొన్నప్పటికీ గత జూన్ చివరి నాటికి ఎనిమిది నెలల అత్యధికంగా 52.7 శాతం ప్రగతిని నమోదు చేసిన సేవల రంగం జిఎస్‌టి ప్రభావంతో జులై చివరి నాటికి 46 శాతానికి పడిపోయింది. ఇది 2009 మార్చి తరువాత నమోదయిన అత్యంత కనిష్ట స్థాయి కావటం విశేషం. వస్తు, సేవల రంగాల ప్రగతిని అంచనా వేసే పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పిఎంఐ) జులై చివరి నాటికి 53.1 శాతం నుండి 45.9 శాతానికి పడిపోయింది. ఇది నాలుగేళ్ల కనిష్ట స్థాయి. ప్రధాని నరేంద్రమోడీ గత నవంబర్‌లో పెద్ద నోట్లను రద్దు చేసిన తరువాత సేవల రంగం జూన్ నెలలో అత్యధిక స్థాయి ప్రగతిని నమోదు చేసింది. జిఎస్‌టి అమలు అనంతరం జరిపిన తాజా సర్వేలో సేవల రంగం 50 శాతానికి తక్కువకు పడిపోయిందని, ఇంత తక్కువ స్థాయిలో సేవల రంగం ప్రగతి నమోదుకావటం ఆర్నెల్ల వ్యవధిలో ఇదే తొలిసారి అని నిపుణులు చెబుతున్నారు. సేవల రంగ పతనం ఎక్కువగా జిఎస్‌టి అమలులో ఏర్పడిన అయోమయం వల్లే జరిగిందని వారు అభిప్రాయపడుతున్నారు. జిఎస్‌టి అమలు అనంతరం తమ ఉత్పత్తుల ధరల నిర్ణయంపై ఉత్పత్తిదారుల్లో కొనసాగిన అయోమయ పరిస్థితి వస్తు తయారీ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీసిందని మరో అనుబంధ సర్వేలో వెల్లడయింది. జిఎస్‌టి అమలుతో ఏర్పడిన అయోమయ పరిస్థితితో వస్తు తయారీ రంగం తొమ్మిదేళ్ల కనిష్ట స్థాయికి పడిపోయిందని ఈ సర్వే వెల్లడించింది.

కిరోసిన్‌కూ కోత

- వరుసగా సబ్సిడీల ఎత్తివేత
- ప్రతి 15 రోజులకు పావలా కట్
- కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే దూకుడు
- పెట్రో రంగ నిపుణుల విశ్లేషణ



న్యూఢిల్లీ : వరుస కోతల చర్యలతో సామాన్యులపై పెను భారాలేస్తున్న కేంద్ర ప్రభుత్వం మరో దుందుడుకు నిర్ణయం తీసుకుంది. పేద ప్రజలకు, ముఖ్యంగా కొండ ప్రాంతాల నివాసితులకు, గిరిజనులకు ఎంతో అవసరమైన కిరోసిన్‌పై ప్రభుత్వం అందిస్తున్న రాయితీని ఎత్తేసేందుకు సిద్ధపడుతోంది. ప్రతి 15 రోజులకు (పక్షం) ఒకసారి లీటరు కిరోసిన్‌పై రూ.0.25 పైసలు చొప్పున రాయితీ తగ్గించాలని చమురు సంస్థలకు ఇటీవల జారీ చేసిన ఆదేశాలలో ప్రభుత్వం పేర్కొన్నట్లు సంబంధిత వర్గాలు గురువారం తెలిపాయి. కేంద్ర ప్రభుత్వం గతంలోనూ ఇలాంటి ప్రతిపాదనతోనే ఈ ఏడాది జులై వరకు ధర పెంచుకోవాలని చమురు కంపెనీలను ఆదేశించింది. ఒకేసారి తగ్గిస్తే ప్రజల్లో వ్యతిరేకత వస్తుందని భావించిన సర్కార్ క్రమబద్ధంగా తగ్గించే వ్యూహాలను రచించింది. ఆ క్రమంలోనే ఇప్పటికే వంట గ్యాసు సిలెండర్ ధరను నెలనెలా నాలుగు రూపాయలు పెంచుతూ సబ్సిడీని పూర్తిగా ఎత్తేస్తామని ప్రకటించిన ప్రభుత్వం కిరోసిన్‌పై అందిస్తున్న రాయితీని కూడా భారీగా తగ్గించాలని నిర్ణయించింది. ప్రభుత్వ రంగంలోని మిగతా9లో

వెన్నం జ్యోతికి అర్జున

- ప్రతిపాదించిన అవార్డుల కమిటీ
- ఆంధ్రప్రదేశ్ నుంచి నామినేషన్



12

ప్రవాస భారతీయులకు ఓటు హక్కు



- ప్రజా ప్రాతినిధ్య చట్ట సవరణకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం
- అందుబాటులోకి పరోక్ష ఓటింగ్

8

6,7 తేదీల్లో గ్రూప్-3 మెయిన్స్

- రాష్ట్రవ్యాప్తంగా 203 పరీక్షా కేంద్రాలు
- జిల్లాల వారీగా వేర్వేరుగా పరీక్షల నిర్వహణ

2

కేరళపై దుష్ప్రచారం మానండి

- లోక్‌సభలో సిపిఎం డిమాండ్
- స్పీకర్ పోడియంవద్ద నిరసన
- బిజెపివి అవాస్తవ ఆరోపణలు



8







వెలగపూడిలో గురువారం చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం

ఆక్రమణల క్రమబద్ధీకరణ

- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు డిఎ
- పత్తికి ప్రత్యామ్నాయాలకు ప్రోత్సాహం
- ఎపిఐఐసికి భూ బదలాయింపులు
- రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అభ్యంతరాలు లేని ఆక్రమణలను క్రమబద్ధీక రించాలని వెలగపూడి సచివాలయంలో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశం నిర్ణయించింది. ఈ వివరాలను మంత్రులు కిమిడి కళావెంకట్రావు, ప్రత్తిపాటి పుల్లారావు విలేకరుల సమావేశంలో వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులకు జనవరి 2016 నుంచి 2017 ఆగస్టు 31 వరకూ బకాయి ఉన్న డిఎను జిపిఎఫ్ ఖాతాలో జమ చేయాలని, సెప్టెంబర్ నుంచి డిఎను ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. వంద చదరపు అడుగుల లోపు భూమిని ఆక్రమించుకున్న దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ఉచితంగా క్రమబద్ధీకరించాలని, దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న కుటుంబాలకు 1-100 అడుగుల వరకు 2013 నాటి బేసిక్ రేటులో 7.5 శాతం, 101-250 అడుగుల వరకు 15 శాతం, 251-500 అడుగుల వరకు 30 శాతం వసూలు చేయాలని తీర్మానించింది. 500 అడుగులు మించితే ఆక్రమణలను తొలగించాలని నిర్ణయించింది. పత్తికి బదులు ప్రత్యామ్నాయ పంటలు వేసే రైతాంగానికి రూ.53.5 కోట్లతో ప్రత్యేక ప్యాకేజీకి మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ప్రత్యామ్నాయ పంటల విత్తనాలకు 75 శాతం రాయితీ, కలుపు తీసేందుకు రూ.500 రాయితీ, పురుగుల మందుకు రూ.500 చొప్పున రెండు సార్లు రాయితీ ఇవ్వాలని నిర్ణయించింది. ప్రత్యామ్నాయ పంటలకు కనీస మద్దతు ధరగా క్వింటాకు రూ.200 అదనంగా అందించాలని తీర్మానించింది. శాస్త్రీయ విధానంలో విక్రయ ధరను నిర్ణయించేలా ఎపిఎండిసి రూపొందిం చిన బైరెటీస్ నూతన సమగ్ర విక్రయ విధానాన్ని మంత్రి మండలి ఆమోదించింది. 2014లో పతంజలి సంస్థ వేలం ద్వారా కొనుగోలు చేసిన ఎర్రచందనం తీసుకెళ్లేందుకు క్యాల వ్యవధిని పొడిగించడంతో పాటు పెనాల్టీని మినహాయిస్తూ తీర్మానించింది. తిరుపతిలోని ఎపిహెచ్‌ఆర్‌డిఐ రీజినల్ సెంటర్ కోసం కొత్తగా ఆరు పోస్టులను మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, పశ్చిమగోదా వరి, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో మత్స్యకారుల చిన్నారుల కోసం మిగతా9లో

నంద్యాలతో నాంది

- 2019లో టిడిపి ఓటమి ఖాయం
- మేం పోటీ చేయబట్టే నంద్యాలలో అభివృద్ధి పనులు
- ప్రతి పార్లమెంట్ స్థానాన్నీ జిల్లాగా చేస్తాం
- వైసిపి అధినేత వైఎస్.జగన్మోహన్ రెడ్డి



నంద్యాల ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా వైసిపి నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతున్న వైఎస్ జగన్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

అవినీతి కుంభకోణాల్లో మునిగిపోయిన చంద్రబాబు ప్రభుత్వాన్ని ఓడించేలా 2019లో జరిగే ఎన్నికల కురుక్షేత్ర సంగ్రామానికి నంద్యాల ఉప ఎన్నికలు నాంది కావాలని వైసిపి అధినేత వైఎస్. జగన్మోహన్‌రెడ్డి అన్నారు. కర్నూలు జిల్లా నంద్యాల ఉప ఎన్నికలలో భాగంగా వైసిపి అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ గురువారం నంద్యాల ఎస్‌పిజి మైదానంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగించారు. ఒక పార్టీ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేలను సంతలో పశువుల్లా కొనుగోలు చేసి రాజకీయం చేస్తున్నాడని చంద్రబాబుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి నీతిలేని రాజకీయానికి భిన్నంగా.. శిల్పా చక్రపాణి రెడ్డి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారని, దానిని స్పీకర్ ఫార్మాట్‌లో పంపుతున్నామని ప్రకటించారు. చంద్రబాబుకు చేతనైతే (గత ఎన్నికల్లో వైసిపి నుంచి గెలుపొంది, ఆ తరువాత టిడిపిలో చేరిన ఎమ్మెల్యేలందరితో రాజీనామా చేయించాలని సవాల్ విసిరారు. ఉప ఎన్నికలు రావడంతోనే చంద్రబాబుకు నంద్యాల అభివృద్ధి గుర్తుకొచ్చిందన్నారు. చంద్రబాబు ఆయన కుమారుడు లోకేష్‌తోపాటు క్యాబినెట్, ఆ పార్టీకి చెందిన పెద్ద నాయకులంతా నంద్యాల నడిరోడ్లపై తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. వారిని రోడ్లపైనే నిలేయాలని అన్నారు. ఉప ఎన్నికల్లో వైసిపి పోటీ పెట్టింది కాబట్టే ఇక్కడ అభివృద్ధి జరుగుతోంద న్నారు. ఇది ఎవ్వరో ప్రతిపక్షాలు అన్న మాట కాదని, భూమా నాగిరెడ్డి భావమర్ది, టిడిపిలో చేరిన ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి చెప్పిన మాట అన్నారు. చంద్రబాబు మూడున్నరేళ్ల కాలంలో మూడున్నర లక్షల కోట్ల అవినీతి చేశారని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వచ్చాక రైతులను, డ్వాక్రా మహిళలను, కాపులను, ముస్లింలను, ఉద్యోగులను మోసం చేస్తున్న చంద్రబాబును నడిరోడ్డుపై కాల్చినా తప్పులేదని అన్నారు. కుప్పంను ఏ మాత్రం పట్టించుకోని చంద్రబాబు నంద్యాలను అభివృద్ధి చేస్తానని ఎలా అంటాడో ఆయన విజ్ఞతకే వదిలివేస్తు న్నానన్నారు. 2014 ఆగస్టు 15న జాతీయ జెండా సాక్షిగా కర్నూలుకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. తాము అధికారంలోకి రాగానే కేశవరెడ్డి, అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకుంటా మని చెప్పారు. ఇప్పుడున్న 13 జిల్లాల్లో ప్రతి పార్లమెంట్ స్థానాన్నీ ఒక జిల్లాగా మారుస్తామని, అప్పుడు నంద్యాల కూడా జిల్లా కేంద్రంగా మారుతు ందని అన్నారు. రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చేలా నవరత్నాల పథకాన్ని రూపొందించామ న్నారు. నవరత్నాల అమలుకు నంద్యాల నాంది కావాలని కోరారు. మంచి రాజకీయం కోసం శిల్పా చక్రపాణి రెడ్డి ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని తృణప్రాయంగా తెంచేశారన్నారు. 2019లో ఆయనను ఎమ్మెల్యే చేసే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. ఈ నెల 9 నుంచి 21 వరకు మిగతా9లో

ప్రజ్ఞ

1. అహ్మద్ పటేల్ ఏ రాష్ట్రం నుంచి రాజ్యసభకు పోటీ చేస్తున్నాడు?
2. మద్యం అమ్మకాల కోసం రాష్ట్రీయ రహదారుల ప్రవేశం పట్టణాల్లోకి లేకుండా చూస్తున్న రాష్ట్రం ఏది?
3. ఐరాస నివేదికల ప్రకారం తల్లిపాల కొరతతో ఏటా దేశంపై ఎంత భారం పడుతోంది?
4. అమెరికా ఇటీవల పరీక్షించిన క్షిపణి ఏది?
5. ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్స్ ఎక్కడ జరుగుతున్నాయి?

సమాధానాలు 7లో

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

సిట్ నిండా పోలీసు బలగం

- 8 కమిటీలు పలు ప్రాంతాల్లో పర్యటన
- డ్రోన్ల సాయంతో కబ్జా భూముల ఫోటోలు
- భూలావాదేవీలపై రికార్డులు చూపని తహశీల్దార్లు
- మెడ్‌టెక్ భూములపై సిట్ కమిటీకి రికార్డులివ్వని వైనం



ప్రజాశక్తి - విశాఖపట్నం ప్రతినిధి

విశాఖ భూకుంభకోణాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు వేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) పూర్తిగా విశాఖ, విజయనగరం జిల్లాలకు చెందిన పోలీస్ అధికారులతో నిండిపోయింది. సిట్ కన్వీనర్‌గా డిఐజి వినీత్‌బ్రిజ్‌లాల్, కీలక సభ్యులుగా విజయసారథి (టిటిడి సిఇఒ), విశాఖ జాయింట్ కలెక్టర్ సృజనతో ప్రభుత్వం సిట్ వేసింది. తాజాగా డిసిపి నవీన్ గుల్హాఠీ దీంట్లో సభ్యులుగా చేరారు. ప్రభుత్వం వేసిన కమిటీ ఇది కాగా.. జిల్లాలో భూ లావాదేవీలను పర్యవేక్షించేందుకు, రికార్డులు తనిఖీల అనంతరం పర్యటన చేపట్టి నిజాలు నిగ్గు తేల్చేందుకు మాత్రం క్షేత్రస్థాయిలో ఎనిమిది కమిటీలు సిట్‌లో ప్రస్తుతం పనిచేస్తున్నాయి. వీరిలో అత్యధికమంది విజయనగరం, విశాఖ జిల్లాలో పనిచేస్తున్న పోలీస్ ఉద్యోగులే ఉండడం గమనార్హం.

8 కమిటీల్లోనూ పోలీసులే..

సిట్ 8 కమిటీలు.. ఒక్కో కమిటీలోనూ ఒక డిఎస్పీ స్థాయి అధికారి, తహశీల్దార్, సిఐ, ఎస్ఐ విధిగా ఉన్నారు. అత్యధిక చోట్ల ముఖ్యంగా మధురవాడ, భీమిలి, పోతిన మల్లయ్యపాలెం, అనకాపల్లి తదితర చోట్ల పోలీసులపైనా ఆరోపణలున్నాయి. భూ కబ్జాదార్లకు పోలీసుల సహకారం కూడా బాగానే అందిందన్నది తెలుస్తోంది. విశాఖ జిల్లాలో ల్యాండ్, శాండ్ (భూమి, ఇసుక) మాఫియాలో పోలీసుల పాత్ర ఉన్న తరుణంలో భూలావాదేవీల తనిఖీల్లో వీరే ప్రముఖంగా ఉన్నారు. జ్యూడిషియల్ విభాగానికి సంబంధించిన సిబ్బంది ఎవ్వరూ లేరు. విశాఖ జిల్లాలో తహశీల్దార్లను ఒక చోట నుంచి మరొక చోటకి ఇప్పటికే సర్దుబాటు చేశారు. భూలావాదేవీల్లో ఆరోపణలెదుర్కొంటున్న తహశీల్దార్లు సుమారు 10 మంది (పెందుర్తి, గాజువాక, చినగదిలి, విశాఖ సిటీ, పరవాడ, సబ్బవరం, భీమునిపట్నం, ఆనందపురం, అనకాపల్లి, పెదగంట్యాడ) వరకూ ఉండగా ఇద్దరిపైనే (భీమునిపట్నం, చినగదిలి మండలాలకు చెందిన) చర్యలు తీసుకున్నారు.

విజయసారథి వద్ద పలు పంచాయతీలు

సిట్ బృందం క్షేత్రస్థాయి పర్యవేక్షణకెళ్లినప్పుడు భూములకు సంబంధించిన వివరాలను, రికార్డులను స్థానిక తహశీల్దార్లు సక్రమంగా చూపడం లేదని, తప్పించుకు తిరుగుతున్నారంటూ టీం సభ్యుల నుంచి వినిపిస్తున్న మాట. సిట్ పరిశీలనలో మెడ్ టెక్ భూములు 250 ఎకరాలకు సంబంధించి ఉన్నాయి. ఒక్కో ఎకరా రూ.12 లక్షలకు ప్రభుత్వ భూమిని ధారాదత్తం చేసిన అక్రమాలు ఇవి. మెడ్‌టెక్ భూముల పరిశీలన, రికార్డుల ట్యాంపరింగ్, బినామీ రైతుల పేర ఎలా ప్రభుత్వ భూమిని కొట్టేశారన్న అంశాలను తాజాగా సిట్ బృందం నంబర్ 5 అధికారులు వెళ్లగా స్థానిక రెవెన్యూ అధికారులు కనిపించకుండా పోతున్నారన్న అంశం విజయసారథి దృష్టికి వచ్చింది. మెడ్ టెక్ భూముల వ్యవహారంలో రూ.కోట్లు చేతులు మారాయన్న ఆరోపణలు ఉన్నాయి.

డ్రోన్‌ల వినియోగం

ప్రభుత్వ భూముల రికార్డుల ట్యాంపరింగ్ జరిగిన స్థలాల్లో ఫొటోల కోసం సిట్ అధికారులు విశాఖ జిల్లాలో డ్రోన్‌లను వినియోగిస్తున్నారు. డ్రోన్‌ల ద్వారా సరైన ఛాయాచిత్రం నమోదవుతుందని ప్రభుత్వం ఈ టెక్నాలజీని వాడుకోమని సూచించడంతో జిల్లాలో పలుచోట్ల ఫొటోల కోసం డ్రోన్‌లను వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది.

ఎప్పటికప్పుడు నివేదికలు

వినీత్ బ్రిజ్‌లాల్, విజయసారధి, సృజన, నవీన్‌గుల్హాఠీతో కూడిన ప్రభుత్వం నియమించిన కమిటీ భూ వ్యవహారాలను జిల్లా స్థాయిలో 8 కమిటీలు వేసి పర్యవేక్షిస్తోంది. ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలోగల ఏలేరు గెస్ట్‌హౌస్‌లో కమిటీ సిట్టింగ్' వేసింది. రోజువారీ జిల్లాలో ఈ కమిటీలు ఎక్కడ పర్యటించినా వాటికి సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తూ ముఖ్యమంత్రి కార్యాలయానికి సమాచారం పంపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లా స్థాయిలో కమిషనర్ ఆఫ్ పోలీస్ (విశాఖనగర పోలీస్ కమిషనర్) యోగానంద్‌కు మొత్తం రిపోర్టును సమర్పిస్తారు. రికార్డులను మాత్రమే చూస్తోన్న సిట్ బృందానికి రికార్డుల తారుమారు వెనుక రాజకీయ నేతల పాత్రను గురించిన వ్యవహారాలపై దృష్టి సారించడం లేదు. రికార్డులు తారుమారయ్యాయన్న ఆధారాలు లభ్యమైతే తహశీల్దార్లపై యాక్షన్ తీసుకుంటూ సిట్ ముందుకు సాగుతోంది.

విక్రమ్ గౌడ్ అరెస్టు
రిమాండ్ విధించిన నాంపల్లి కోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ కుమారుడు విక్రమ్‌గౌడ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. తూటా గాయాల నుంచి కోలుకున్న విక్రమ్‌ను గురువారం అపోలో నుంచి డిశ్చార్జి చేసిన వెంటనే ఆ ఆస్పత్రి ఆవరణలోనే బంజారాహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి నేరుగా నాంపల్లి కోర్టుకు తీసుకొచ్చి న్యాయమూర్తి ముందు హాజరుపర్చారు. విక్రమ్ ఆరోగ్య పరిస్థితి గురించి ఆయన్నే అడిగి తెలుసుకున్న న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. విక్రమ్ గౌడ్ గాయపడి ఉన్నారని, మరికొన్ని రోజులు చికిత్స అవసరమని ఆయన తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. మెడికల్ రిపోర్టులను కోర్టు ముందుంచారు. దీంతో విక్రమ్‌కు ఉస్మానియా లేదా గాంధీ ఆస్పత్రిలో వైద్యం చేయించాలని జైళ్ల శాఖ అధికారులను న్యాయస్థానం ఆదేశించింది. గోషామహల్ నియోజకవర్గ ప్రజల సానుభూతి కోసం విక్రమ్ గౌడ్ అమలు చేసిన పథకం తెలిసిందే. పోలీసులను తప్పుదోవ పట్టించినందుకు, అక్రమంగా ఆయుధాన్ని కలిగి, దాన్ని ఉపయోగించినందుకు విక్రమ్‌గౌడ్ సహా ఆరుగురు నిందితులు ఎస్.నందకుమార్, షేక్ అహ్మద్, రయీస్‌ఖాన్, కోకంటి బాబూజాన్, ఎ.గోవింద్‌రెడ్డిలపై బంజారాహిల్స్ పోలీసులు ఐపిసి సెక్షన్ 20, 120బి, 420, 404, ఆయుధ చట్టం కింద కేసులు నమోదు చేశారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. తప్పుడు సమాచారం ఇచ్చారని విక్రమ్ గౌడ్ భార్యపై కూడా కేసు నమోదు చేయాలని పోలీసులు భావించినా, ఈ ఎపిసోడ్‌లో ఆమె ప్రమేయం లేదని నిర్ధరించుకుని, ఆమెను నిందితురాలుగా పేర్కొనలేదు.

టిస్‌లో ఎపి సర్కారుకు ఆరు సీట్లు
మంత్రి సమక్షంలో ఒప్పందం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి ప్రభుత్వానికి తాము ఆరు సీట్లు కేటాయిస్తామని టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషియల్ సైన్సెస్ (టిస్) అధికారులు తెలిపారు. ఎపి ప్రభుత్వం స్పాన్సర్ చేసే విద్యార్థుల అర్హత తదితర అంశాలపై విధి విధానాలు త్వరలోనే ఖరారు చేసి ఈ ఏడాది నుంచే ప్రవేశాలు కల్పిస్తామని టిస్ అధికారులు వెల్లడించారు. వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖమంత్రి గంటా శ్రీనివాసరావు సమక్షంలో గురువారం ఈ ఒప్పందం జరిగింది. సాంకేతిక, కళాశాల విద్య కమిషనర్ జిఎస్ పాండదాస్, టిస్ డైరెక్టర్ పరశురామ్ ఒప్పందంపై సంతకాలు చేశారు. రాష్ట్రంలో టిస్ నిర్వహిస్తున్న ఫౌండేషన్ కోర్సులు, సూపర్ న్యూమరీ సీట్ల అంశంపై మంత్రి గంటా సమీక్షించారు. 500 మంది ఉపాధ్యాయులు, 12 వేలమంది విద్యార్థులకు తాము శిక్షణ అందిస్తున్నామని టిస్ అధికారులు చెప్పారు. ఈ కోర్సుల అమలుకు విజయవాడ కేంద్రంగా సమన్వయకర్తను నియమించాలని, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. జార్ఖండ్‌లో రూ.100 కోట్ల వ్యయంతో ఫౌండేషన్ కోర్సులు నిర్వహిస్తున్నామని టిస్ అధికారులు తెలపగా, వాటిని అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని కళాశాల విద్యాశాఖ కమిషనర్‌ను మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో ఉన్నత విద్యా మండలి సలహాదారు ఈదర వెంకట్, టిస్ డిప్యూటీ డైరెక్టర్ శివరాజు, ప్రొఫెసర్ లక్ష్మీ లింగం తదితరులు పాల్గొన్నారు.

6,7 తేదీల్లో గ్రూప్-3 మెయిన్స్
రాష్ట్రవ్యాప్తంగా 203 పరీక్షా కేంద్రాలు
జిల్లాల వారీగా వేర్వేరుగా పరీక్షల నిర్వహణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పంచాయతీ సెక్రటరీ (గ్రూప్-3) మెయిన్స్ పరీక్షల నిర్వహణకు సంబంధించి ఏపీపీఎస్సీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 6,7 తేదీల్లో జరగనున్న మెయిన్స్ పరీక్షలకుగాను రాష్ట్ర వ్యాప్తంగా 203 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేసింది. అయితే గతంలో ప్రకటించినట్లు అభ్యర్థులందరికీ ఒకే రోజు పరీక్ష నిర్వహించడానికి బదులు జిల్లాల వారీగా ఈనెల 6, 7 తేదీల్లో నిర్వహించాలని నిర్ణయించింది. అభ్యర్థుల సౌలభ్యం కోసం ఈనెల 6న అనంతపురం, చిత్తూరు, కడప, పశ్చిమ గోదావరి, గుంటూరు, కృష్ణా , ప్రకాశం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల అభ్యర్థులకు పరీక్ష నిర్వహించనుంది. ఇందుకోసం ఆయా జిల్లాల్లో 135 పరీక్షా కేంద్రాల్ని సిద్ధం చేసింది. అలాగే కర్నూలు, నెల్లూరు, విజయనగరం, తూర్పు గోదావరి జిల్లాల అభ్యర్థులకు ఈనెల 7న పరీక్షలను నిర్వహించనుండగా, ఆయా జిల్లాల్లో 68 పరీక్షా కేంద్రాల్ని ఏర్పాటు చేసింది. కాగా పరీక్షా కేంద్రాల్లోకి ఎలాంటి వస్తువుల్నీ అనుమతించకుండా స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు ఏపీపీఎస్సీ కార్యదర్శి వైవీఎస్‌టీ సాయి తెలిపారు. ఎలక్ట్రానిక్ పరికరాలు సహా పెన్నులు, బ్యాగులు వంటివి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించమని, అభ్యర్థులందరికీ పరీక్షా కేంద్రాల్లోనే పెన్ను,పేపర్‌లను సరఫరా చేస్తామని తెలిపారు.

17 నుంచి గ్రూప్-1 మెయిన్స్

అలాగే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల్ని ఈనెల 17 నుంచి 28 వరకు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. త్వరలోనే ఈ పరీక్షలకు సంబంధించి షెడ్యూల్‌ను విడుదల చేస్తామన్నారు.

మెడ్‌టెక్ జోన్ నిర్మాణంలో అక్రమాలు వాస్తవం కాదు
పూనం మాలకొండయ్య

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న మెడ్ టెక్ జోన్ నిర్మాణంలో అక్రమాలు జరుగుతున్నాయని వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని వైద్యఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి పూనం మాలకొండయ్య స్పష్టం చేశారు. మెడ్‌టెక్ జోన్ ఏర్పాటుపై ఆ సంస్థ మాజీ ఉద్యోగి జుడిష్‌రాజ్ చేసిన ఆరోపణలను గురువారం ఆమె ప్రకటనలో ఖండించారు. ఆ సంస్థ ప్రతిష్టను దెబ్బతీసేందుకు నిరాధార ఆరోపణలు చేసిన జుడిష్‌రాజ్‌పై సైబర్ నేరం కింద కేసు నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మెడ్‌టెక్ పార్కుకు అన్ని అనుమతులున్నాయని పేర్కొన్నారు. దానికి ఆర్థిక సహాయానికి సంబంధించిన, పెట్టుబడులు, కాంట్రాక్ట్ ప్రతిపాదనలన్నీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆమోదం తీసుకున్న తర్వాతే పనులు ప్రారంభించామని పేర్కొన్నారు. మెడికల్ టెక్నాలజీ రంగంలో అనుభవమున్న జితేంద్రశర్మను బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల పర్యవేక్షణలోనే నియమించామని ఆమె తెలిపారు.

వాతావరణం



బంగాళాఖాతంలో ఆవర్తనం

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

ఉత్తర బంగాళాఖాతంలో 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. మరోవైపు ఒడిశా నుంచి కోస్తాంధ్ర మీదుగా దక్షిణ తమిళనాడు వరకు ద్రోణి స్థిరంగా కొనసాగుతోందని హైదరాబాద్ వాతావరణశాఖ పేర్కొంది. వీటి ప్రభావంతో కోస్తా, రాయలసీమలోని అక్కడక్కడా ఉరుములతో కూడిన ఓ మోస్తరు నుంచి చెదురుమదురు జల్లులు కురుస్తాయని తెలిపింది. ముఖ్యంగా ఉత్తరాంధ్రలోని విజయనగరంలో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. గురువారం ఉదయానికి విజయనగరం జిల్లా నెల్లిమర్లలో 11.6, పూసపాటిరేగలో 5.9, తిరువూరులో 5.3, పెద్దాపురంలో 4.8, దవళేశ్వరంలో 4.5, సాలూరులో 4.4 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

రాజధాని చెంతనే దుస్థితిలో అంగన్‌వాడీలు

- 40 శాతం కేంద్రాల్లో టాయిలెట్లు, విద్యుత్ సదుపాయాల లేమి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించి, ఆరేళ్లలోపు చిన్నారులకు ప్రాథమిక విద్యను అందించే అంగన్‌వాడీ కేంద్రాల్లో సరైన సౌకర్యాలు ఉండటంలేదు. రాజధాని విజయవాడ నగరంలోనే దాదాపు 40 శాతం అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీసం టాయిలెట్లు లేవు. విద్యుత్ సదుపాయమూ లేదు. ఆయా సెంటర్లలో పనిచేసేవారు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్న అమృత హస్తం పథకం అమలులో ఉంది. ఈ పథకం కింద భోజనానికి వచ్చే లబ్ధిదారులూ కేంద్రాల్లో కనీస వసతుల్లేక ఇబ్బందిపడుతున్నారు. గర్భిణులు, బాలింతలు కూర్చునేందుకు కనీసం కుర్చీలు, బల్లలు వంటి ఫర్నిచర్ లేదు. ఈ ఇబ్బందులతో అంగన్‌వాడీ కేంద్రాలకు ఒక్కపూట భోజనానికి రావడానికి లబ్ధిదారులు ఇష్టపడటం లేదు. ఒక్కో సెంటర్‌లో దాదాపు 30 మంది లబ్ధిదారులుంటే కనీసం పది మంది కూడా భోజనానికి రావడంలేదని అంగన్‌వాడీ వర్కర్లు చెబుతున్నారు.

విలీనం ఐసిడిఎస్ లక్ష్యాలకు విరుద్ధం

మరోవైపు అంగన్‌వాడీ కేంద్రాల విలీన నిర్ణయం, అసలు ఐసిడిఎస్ లక్ష్యాలకే విరుద్ధమంటున్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించడంతోపాటు ఆరేళ్లలోపు చిన్నారులకు ఆటపాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్యను అందించడం ఐసిడిఎస్ ప్రధాన ఉద్దేశం. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మున్సిపాలిటీల్లోని 3,128 అంగన్‌వాడీ సెంటర్లను కేంద్రీకృతం చేసి,1026 ప్రీ స్కూల్ సెంటర్లుగా మార్చాలని నిర్ణయించింది. దీంతో ఐసిడిఎస్ లబ్ధిదారులు పథకానికి దూరం కాగలరని పలువురు అంగన్‌వాడీ వర్కర్లు చెబుతున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రతి 400 మంది జనాభాకు మినీ అంగన్‌వాడీ కేంద్రం, 800 మంది జనాభాకు మెయిన్ అంగన్‌వాడీ కేంద్రం ఉండాలి.

కానీ అంగన్‌వాడి కేంద్రాల విలీనంతో 3 వేల నుంచి 3,500 జనాభాకు ఒక అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ప్రీ స్కూల్‌గా అన్ని హంగులు, చిన్నారులకు ఆకర్షణగా తీర్చిదిద్దడం పైనే ప్రభుత్వం దృష్టి పెడుతోంది తప్ప, సెంటర్ దూరమవడంతో లబ్ధిదారులు పడే ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని పలువురు అంగన్‌వాడీ టీచర్లు అభిప్రాయపడుతున్నారు. ఓ వైపు చిన్నారులకు ప్రాథమిక విద్య మాతృభాషలోనే చెప్పాలని నిబంధన ఉన్నా, కార్పొరేట్ పాఠశాలల తరహాలో తీర్చిదిద్దేలా ప్రభుత్వ చర్యలున్నాయని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నేతలు అభిప్రాయపడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో సెంటర్ల విలీనం కోసం పెద్ద ఇళ్లను అద్దెకు తీసుకోమని ప్రభుత్వం బలవంతం చేస్తోందని, అడ్వాన్సులివ్వకుండా తమకు ఈ బాధ్యతను అప్పగిస్తున్నారని అంగన్‌వాడీ వర్కర్లు వాపోతున్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను యథావిధిగా ఉంచి, మౌలిక సదుపాయాలు కల్పించాలని, కేంద్రాల విలీనం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

డీఎస్సీ98 అక్రమాలపై సిబిఐ విచారణకు ఆదేశించండి

- హైకోర్టులో వ్యాజ్యం
- ప్రతివాదులకు నోటీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్

డీఎస్సీ-98 అక్రమాలపై హైలెవెల్ కమిటీ నివేదిక సమర్పించినా తెలంగాణా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని, ఈ వ్యవహారంపై సిబిఐ విచారణకు ఆదేశించాలని హైకోర్టులో వ్యాజ్యం దాఖలైంది. వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండకు చెందిన కె.వేణు, ఎన్.రమేశ్ మరికొందరు వేసిన రిట్ పిటిషన్‌ను గురువారం హైకోర్టు న్యాయమూర్తి ఎ.రాజశేఖర్‌రెడ్డి విచారించి ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు. తెలంగాణ విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి, పాఠశాల విద్యా శాఖ కమిషనర్, వరంగల్ అర్బన్ జిల్లా డీఎస్సీ చైర్మన్ అయిన జిల్లా కలెక్టర్, డీఈవోలకు నోటీసులిచ్చి విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు. డీఎస్సీలో సున్నా మార్కులొచ్చిన అభ్యర్థినికి ఇంటర్వ్యూలో కేవలం నాలుగే మార్కులొస్తే ఆమెను అర్హురాలిగా ప్రకటించి ఉద్యోగం ఇచ్చారని పిటిషనర్ తరపు న్యాయవాది అర్జున్‌కుమార్ వాదించారు. మరో అభ్యర్థినికి నోటిఫికేషన్‌లో నిర్ణయించిన మార్కుల కంటే ఎక్కువొచ్చినా అమెను ఎంపిక చేయలేదన్నారు. డీఎస్సీ ఎంపికకు ఇచ్చిన నోటిఫికేషన్‌లో మార్కులు రాని వారిని అర్హులు చేయాలనే ప్రయత్నంలో భాగంగానే కటాఫ్ మార్కుల్ని తగ్గించేశారని చెప్పారు. కోర్టు ఆదేశాలున్నాయని చెప్పి జీరో మార్కులొచ్చిన అభ్యర్థినిని ఎంపిక చేశారని, నిజానికి కోర్టు ఆర్డరేమీ లేదని చెప్పారు. ఐఎఎస్ అధికారి ఐవీ సుబ్బారావు అధ్యక్షతన హైలెవల్ కమిటీ 2004లో అక్రమాలు జరిగాయని నివేదిక ఇస్తే నేటికీ దానిపై చర్యల్లేవని, అనర్హుల్ని సెకండ్ గ్రేడ్ టీచర్లుగా ఎంపిక చేశారని, ఇదే తరహాలో జరిగిన వ్యాపం వ్యవహారంపై సుప్రీంకోర్టు సిబిఐ విచారణకు ఆదేశించిందని న్యాయవాది చెప్పారు.

గిద్దలూరు ఎమ్మెల్యేపై కేసును ఉపసంహరించుకోం
హైకోర్టుకు తెలిపిన ఎపి ప్రభుత్వం

ప్రజాశక్తి - హైదరాబాద్

గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిపై నమోదైన క్రిమినల్ కేసును ఉపసంహరించుకోవడం లేదని హైకోర్టుకు ఏపీ ప్రభుత్వం హామీ ఇచ్చింది. గిద్దలూరు పీఎస్‌లో ఆయనపై ఉన్న కేసు శుక్రవారం గిద్దలూరు కోర్టులో విచారణకు రానుందని, ఈ దశలో ఆయనపై ఉన్న కేసును ఎత్తివేయబోమని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి జె.ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్‌కు ఏపీ సర్కార్ గురువారం హామీ ఇచ్చింది. దీనిపై బెంచ్ స్పందిస్తూ.. "ప్రజా ప్రతినిధులపై కేసుల ఉపసంహరణపై సుప్రీంకోర్టు కచ్చితమైన ఆదేశాలిచ్చింది. ఒకవేళ ప్రభుత్వం ఎమ్మెల్యేపై కేసు రద్దు చేస్తే ఈ కేసును విచారణ జరుపుతాం. అశోక్‌రెడ్డిపై శుక్రవారం గిద్దలూరు కోర్టులో విచారణ జరుగనుంది. ఈలోగా ప్రభుత్వం కేసును ఉపహసంహరిస్తుందనే అనుమానం మాకుంది. ఒకవేళ కేసును ప్రభుత్వం రద్దు చేస్తే ఏంచేయాలో మాకు బాగా తెలుసు.." అని వ్యాఖ్యానించింది. పోలీసు జీపు దహనం, పోలీసుల విధులకు ఆటంకం ఆరోపణలపై ఆయనపై 2014లో గిద్దలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. దీన్ని ఉప సంహరించుకోవాలని గిద్దలూరు కోర్టు పీపీని ఆదేశిస్తూ ప్రభుత్వం 379 జీవోను జారీ చేసింది. ఈ జీవోను కొట్టేయాలని కోరుతూ రిటైర్డు సైనిక ఉద్యోగి షేక్ మస్తాన్ వలీ ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేసిన విషయం విదితమే.

ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి రేపటి నుంచి మూడో విడత కౌన్సెలింగ్

- మిగిలిపోయిన సీట్లు 31, 457
- 5, 6 తేదీల్లో వెబ్ ఆప్షన్లు
- 8న సీట్ల కేటాయింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ ఏడాది కూడా రెండు విడతల కౌన్సెలింగ్‌లో ఇంజినీరింగ్ సీట్లు భర్తీకాని నేపథ్యంలో మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించాలని అడ్మిషన్ల కమిటీ నిర్ణయించింది. ఈ నెల 5, 6 తేదీల్లో వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. కౌన్సెలింగ్‌కు హాజరై, కళాశాలల్లో రిపోర్టు చేయని విద్యార్థులు సహా కౌన్సెలింగ్‌కు హాజరు కాని విద్యార్థులూ ఈ కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నారు. అనంతరం 8వ తేదీన తుది విడతగా సీట్ల కేటాయింపులు చేస్తారు. ఇంజనీరింగ్ విద్యపై మోజు తగ్గిపోతున్నా ప్రభుత్వాలు అనాలోచితంగా విచ్చల విడిగా కళాశాలలకు అనుమతులు ఇవ్వడం, విపరీతంగా సీట్లు పెంచుకుంటూ పోవడం ఈ పరిస్థితి కారణమని పలువురు విశ్లేషిస్తున్నారు. ఈ ఏడాది రెండు విడతల్లో కౌన్సెలింగ్ నిర్వహించినా ఎపిలో 31,457 సీట్లు మిగిలిపోయాయి. వర్సిటీ కళాశాలల్లోనే దాదాపు 483 సీట్ల వరకు మిగిలిపోయాయి. రాష్ట్రంలో 2014-15 విద్యా సంవత్సరంలో దాదాపు 55 వేల సీట్లు, 2015-16లో దాదాపు 37 వేల సీట్లు మిగిలిపోయాయి. వీటిలో కన్వీనర్ కోటా సీట్లే పూర్తి స్థాయిలో భర్తీ కాలేదు. సింగిల్ డిజిట్ సీట్లు భర్తీ అయ్యే కళాశాలలు కొన్నయితే, ఒక్క సీటూ భర్తీకాని కళాశాలలు కూడా ఉన్నాయి. 2016 -17కి వచ్చే సరికి రాష్ట్రవ్యాప్తంగా 17 ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీల్లో 3,924 సీట్లు, 305 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో కన్వీనర్, యాజమాన్య కోటా కలుపుకొని 1,34,172 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో కన్వీనర్ కోటాలో 93,921 సీట్లున్నాయి. మొదటి విడత కౌన్సెలింగ్ 68,810 భర్తీ కాగా, 25,111 సీట్లు మిగిలిపోయాయి. ఇక రెండో విడత సీట్ల కేటాయింపు నాటికి ఖాళీల సంఖ్య పెరిగింది. మొదటి విడత కౌన్సెలింగ్‌లో పాల్గొని సీటు పొందిన వారు కళాశాలలో రిపోర్టు చేయకపోవడంతో ఖాళీల సంఖ్య పెరుగుతూ వచ్చింది. రెండో విడత సీట్ల కేటాయింపు నాటికి మొత్తం సీట్లలో 31,457 సీట్లు మిగిలిపోయినట్లు లెక్కతేలింది. దీంతో మరోసారి కౌన్సెలింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. రెండు విడతల కౌన్సెలింగ్‌లో ఒక్క సీటు కూడా భర్తీ కాని కళాశాలలు 8 వరకు ఉండగా, 20 శాతం నుంచి 50 శాతం వరకు సీట్లు భర్తీ అయిన కళాశాలలు సగానికిపైగానే ఉన్నాయి.

ఆందోళనలో కళాశాలలు

సీట్లు మిగిలిపోవడంతో కళాశాలల యాజమాన్యాలు ఆందోళన చెందుతున్నాయి. సరైన సమయంలో ఫీజు రియంబర్స్‌మెంటు విడుదలైనా కొంత ఉపశమనం ఉండేదని, గత ఏడాది రియింబర్స్‌మెంటు ఇంతవరకు విడుదల కాలేదని, ఇలాగైతే కళాశాలలు నడవడం కష్టమేనని యాజమాన్యాలు చెబుతున్నాయి. ఇతర రాష్ట్రాల విద్యార్థులను చేర్చుకుందామనుకున్నా, అందుకు నిబంధనలు అడ్డువస్తున్నాయని, ముందుగా అడ్మిషన్స్ కమిటీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందంటున్నారు.

మళ్లీ ఆగిన పాదయాత్ర

- అడ్డుకున్న పోలీసులు
- ఇంటికే పరిమితమైన ముద్రగడ
- అనుమతిచ్చే వరకూ రోజు చేస్తూనే ఉంటా
- కొనసాగుతున్న ఆందోళనలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కాపు ఉద్యమనేత, మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం పాదయాత్రను గురువారం మరోసారి పోలీసులు అడ్డుకున్నారు. కాపులకు రిజర్వేషన్లు కల్పిస్తామంటూ చంద్రబాబు ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ముద్రగడ గతనెల 26న 'చలో అమరావతి' పాదయాత్రకు పిలుపునిచ్చారు. అప్పటినుంచీ ముద్రగడను పోలీసులు నిర్బంధించి ఇంటికే పరిమితం చేశారు. పోలీసులు ఆంక్షలు విధిస్తూ ఇచ్చిన వారం రోజుల గడువు ముగియడంతో ముద్రగడ గురువారం ఉదయం తొమ్మిది గంటలకు తిరిగి తన పాదయాత్రను ప్రారంభించారు. ఇంటి నుంచి బయలుదేరి గేటు వద్దకు రాగానే ఓఎస్‌డి రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యాన పోలీసులు అడ్డుకున్నారు. 2009 సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం పాదయాత్రకు అనుమతిలేదని తెలిపారు. ఎట్టిపరిస్థితుల్లోనూ కదలనిచ్చేదిలేదని ముద్రగడకు వివరించారు. ముద్రగడ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ 2013లో చంద్రబాబు పాదయాత్ర ఎలా చేశారని ప్రశ్నించారు. చంద్రబాబు అనుమతి తీసుకున్నట్లు నిరూపిస్తే తామూ తీసుకుంటామన్నారు. తాను పాదయాత్ర చేసేది చంద్రబాబులా కోట్ల విలువైన ఇళ్లు, ఆస్తులను దోచుకునేందుకు కాదన్నారు. కాపులకు ఇచ్చిన హామీ అమలు కోసమే పాదయాత్ర చేస్తున్నామని తెలిపారు.



పాదయాత్రను అడ్డుకున్న పోలీసులతో మాట్లాడుతున్న ముద్రగడ

'దమ్ముంటే నా ఒక్కడికే పాదయాత్ర చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలి. నా పాదయాత్రపై ఆరోపణలు చేసిన మంత్రితో రాజీనామా చేయించాలి' అని డిమాండ్ చేశారు. అనుమతి ఇచ్చే వరకూ ప్రతిరోజూ పాదయాత్ర ప్రారంభిస్తానన్నారు. తన అనుచరులతో కలిసి వెనుదిరిగి ఇంటికే పరిమితమయ్యారు.

కిర్లంపూడిని చుట్టుముట్టిన పోలీసులు

కిర్లంపూడిలో పోలీసు పహారా కొనసాగుతోంది. నాలుగైదు రోజులుగా పోలీసు బలగాలను ఉపసంహరించిన పోలీసులు బుధవారం రాత్రి నుంచి తిరిగి కిర్లంపూడిని చుట్టుముట్టారు. ముద్రగడ నివాసం వద్ద గేటు నుంచి ఎవరూ బయటకు రాకుండా బారికేడ్లు అడ్డుపెట్టారు. ఆయన ఇంటి నుంచి సుమారు కిలోమీటరు దూరం పోలీసు పహారా కాస్తున్నారు. ముద్రగడ నివాసానికి అందరినీ కాకుండా అప్పుడప్పుడూ కొంతమంది చొప్పున లోనికి పంపుతున్నారు.

ముద్రగడకు మద్దతుగా ఆందోళనలు

పాదయాత్రకు మద్దతుగా కిర్లంపూడి మెయిన్ రోడ్‌పై కాపు కార్యకర్తలు ధర్నా చేశారు. ప్రత్తిపాడు శివారు సింహాద్రిపురంలో మహిళలను పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వివాదం చోటుచేసుకుంది. ప్రత్తిపాడు,ఏలేశ్వరంలో, కత్తిపూడిలో కాపు నేతలు కంచాలు, గరిటెలతో ధర్నా చేశారు.

పాదయాత్రకు అనుమతి లేదు : ఎస్‌పి విశాల్ గున్నీ

గతంలో సుప్రీంకోర్టు వెలువరించిన నిబంధనల ప్రకారం ముద్రగడ పాదయాత్రకు అనుమతి లేదని జిల్లా ఎస్‌పి విశాల్ గున్నీ తెలిపారు. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులతో చర్చించి కొన్ని నిర్ణయాలు తీసుకుంటూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నామన్నారు.

కమ్ముకుంటున్న కరువు



గజపతినగరం జిన్నాంలో ట్యాంకర్‌తో వరినారు తడుపుతున్న రైతులు

- వర్షాభావంతో విజయనగరంలో తగ్గిన సాగు
- వరి నారును బతికించుకునేందుకు రైతుల అవస్థలు
- ప్రాజెక్టులు పూర్తి కాకపోవడంతో వృథాగా ఒడిశా వరద నీరు

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

విజయనగరం జిల్లాలో కరువు ఛాయలు కమ్ముకుంటున్నాయి. ఓ వైపు వర్షాభావం.. మరో వైపు సాగునీటి ప్రాజెక్టులపై పాలకుల నిర్లక్ష్యం.. వెరసి విజయనగరం జిల్లా ప్రజలకు శాపంగా మారింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా నాట్లు అరకొరగానే పడ్డాయి. ఎండిపోతున్న వరి నారుమళ్లను బతికించుకోవడానికి రైతులు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. అవకాశం ఉన్న చోట్ల ఆయిల్ ఇంజిన్లు, ట్యాంకర్ల ద్వారా నారుమళ్లను బతికించుకుంటున్నారు. నాట్లు వేసేందుకు వర్షాలు అనుకూలించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వరి నారు, ఇతర మెట్ట పంటలు వేయడానికి వర్షాలు అనుకూలించినా, ఆ తర్వాత లోటు వర్షంతో వ్యవసాయం ముందుకు సాగడం లేదు.

తగ్గిన వర్షపాతం

నిరుటికంటే ఈయేటి సాధారణ వర్షపాతం తగ్గింది. గత ఖరీఫ్ సీజన్‌లోని జూన్, జూలై నెలల్లో కలిపి 26.7 మిల్లీలీటర్లు అధికంగా వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది అదే సమయానికి 22.5 మిల్లీమీటర్లు తక్కువగా వర్షపాతం నమోదైనట్లు రికార్డులు తెలియజేస్తున్నాయి. ఈ ఏడాది జూలై చివర అర్ధ భాగంలో ఒడిశాలో భారీ వర్షాలు కురిసినా ఆ రాష్ట్రానికి దిగువన ఉన్న విజయనగరం జిల్లాలో వ్యవసాయానికి ఈ నీటిని వినియోగించుకోలేని దుస్థితి నెలకొంది. ఒడిశాలోని వర్షాలకు జిల్లాలోని రిజర్వా యర్లలోకి వరద నీరు భారీగా వచ్చి చేరడంతో ఎప్పటి కప్పుడు దిగువకు విడుదల చేయాల్సి వచ్చింది. దీనివల్ల అప్పట్లో రిజర్వాయర్ల పరిధిలోని లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలు నీటి ముంపునకు గురయ్యాయి. జంఝావతి, రామతీర్థ సాగర్ వంటి భారీ ప్రాజెక్టులు పూర్తి కాకపోవడం, నాగావళి, వేగావతి, సువర్ణ ముఖి, గోముఖి, చంపావతితోపాటు అనేక జీవగెడ్డలపై తలపెట్టిన మినీ రిజర్వాయర్లు ప్రతిపాదనలకే పరిమితం కావడంతో వేలాది క్యూసెక్కుల నీరు వృథాగా బంగాళాఖాతంలో కలిసిపోయింది. తోట పల్లి, తాటిపూడి, ఆంధ్ర, పెద్దగెడ్డ తదితర జలా శయాల కింద మాత్ర మే అరకొరగా నాట్లు పడ్డాయి. కొన్ని రిజర్వాయర్లలో మునుపటి కన్నా నీటిమట్టాలు తగ్గాయి.



ఆయిల్ ఇంజిన్‌తో నీటిని తోడుతున్న గజపతినగరం మండలం లింగాలవలస రైతులు

రిజర్వాయర్ల కిందే వరి సాగు

జిల్లాలో రిజర్వాయర్ల కింద మినహా మిగిలిన చోట్ల వరి నాట్లు ఇంకా ప్రారంభం కాలేదు. జిల్లాలో ఖరీఫ్ సీజన్లో వరి, వేరుశనగ, మొక్కజొన్న, చెరుకు, పత్తి, రాగులు పండిస్తున్నారు. ఈ ఏడాది అన్ని పంటలూ కలిపి 4.80 లక్షల ఎకరాల్లో సాగవుతాయని అధికారులు అంచనా వేశారు. ఇందులో అత్యధికంగా వరి విస్తీర్ణం 3.12 లక్షల ఎకరాలుంది. వర్షాభావ పరిస్థితుల వల్ల జులై 31 నాటికి 22,385 ఎకరాల్లో మాత్రమే వరి నాట్లు పడ్డాయి. నిరుడు ఇదే సమయానికి 55 వేల ఎకరాల్లో నాట్లు వేశారు.

అంతంతమాత్రంగా మెట్ట పంటల సాగు

మెట్ట పంటలు కూడా అంతంతమాత్రంగా సాగవుతున్నాయి. వేరుశనగ, మొక్కజొన్న, చెరుకు, పత్తి, రాగులు తదితర పంటల సాధారణ సాగు విస్తీర్ణం సుమారు 1.68 లక్షల ఎకరాలు. గతేడాది జులై 31 నాటికి 1.30 లక్షల ఎకరాల్లో ఈ పంటలు సాగయ్యాయి. ఈ ఏడాది 1.13 లక్షల ఎకరాల్లో మాత్రమే ఆయా పంటలు సాగవుతున్నాయి.

ఎండిపోతున్న నారుమళ్లు

ఏటా నైరుతి రుతుపవనాలపై ఆధారపడి జూన్ రెండో వారం నుంచి జిల్లాలో ఖరీఫ్ పనులు ప్రారంభమవుతాయి. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు పడటంతో జూన్‌లోనే రైతులు వరి నారుమళ్లను దున్నినారు వేసేందుకు సిద్ధం చేశారు. ఆ తర్వాత వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో గజపతినగరం, దత్తిరాజేరు, మెరకముడిదాం సహా సుమారు 20 మండలాల్లో వరి నారుమళ్లు ఎండిపోతున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం 5,600 ఎకరాల్లో వరి నారు, 500 ఎకరాల్లో వరి నాట్లు, 6,810 ఎకరాల్లో మొక్కజొన్న, 450 ఎకరాల్లో వేరుశనగ, 12 ఎకరాల్లో రాగి పంటలు తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నాయి. గడిచిన పదిహేను రోజులుగా వరి నారును కాపాడుకోవడానికి రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అవకాశం ఉన్నచోట ట్యాంకర్లు, ఆయిల్ ఇంజిన్ల సాయంతో వరి నారుమళ్లను తడుపుతున్నారు. కొన్ని చోట్ల వరి నారు పోసి నెల రోజులు దాటుతోంది. నాట్లు వేసేందుకు పరిస్థితులు అనుకూలించకపోవడంతో నారు ముదిరిపోతోంది.

వృథాగా వర్షపు నీరు

మరోవైపు గత నెల 17, 18 తేదీల్లో ఒడిశాలో కురిసిన భారీ వర్షాలకు జిల్లాకు వరద ముప్పు వాటిల్లింది. అప్పట్లో నాగావళి నది ఉగ్రరూపం దాల్చింది. తోటపల్లి జలాశయం నీటిమట్టం ప్రమాద స్థాయికి చేరుకోవడంతో ఇరిగేషన్ అధికారులు వేల క్యూసెక్కుల నీటిని నాగావళి నదిలోకి విడిచిపెట్టారు. ఈ నది ద్వారా నీరు వృథాగా సముద్రంలో కలిసిపోయింది. జంఝావతి రిజర్వాయర్ రబ్బరు డ్యాం మీదుగా నీరు వృథాగా పోయింది. జంఝావతి ప్రాజెక్టును పూర్తి చేయడానికి అడ్డంకిగా ఉన్న అంతర్రాష్ట్ర వివాదం పరిష్కరిస్తే ఈ ప్రాజెక్టు కింద ఈ ఏడాది వర్షాలు తక్కువైనా పంటల సాగుకు లోటు లేకుండా ఉండేదని రైతులతోపాటు నీటిపారుదల శాఖ నిపుణులు సైతం అభిప్రాయపడుతున్నారు.

ఎప్పుడూ ఇదే సమస్య



గతంలో సీజన్‌లో ప్రారంభం నుంచి ముగిసే వరకూ వర్షాలు అనుకూలించేవి. పదేళ్లగా అటువంటి పరిస్థితి లేదు. ఏటా ఖరీఫ్‌లో నీటి కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. సాగునీటి వనరులను పాలకులు నిర్లక్ష్యం చేస్తుండటంతో వర్షాధారంగానే పండించాల్సి వస్తోంది. గతేడాది సీజన్ చివరిలో వర్షాభావం వల్ల నష్టపోయాం. ఈ ఏడాది నాట్లు కూడా వేయలేకపోతున్నాం.

-జి.రామరాజు, దత్తిరాజేరు, విజయనగరం జిల్లా

వర్షపాతం వివరాలు (మిల్లీమీటర్లలో)

నెల	సాధారణ వర్షపాతం	2016	2017	గతేడాది పరిస్థితి	ప్రస్తుత లోటు
జూన్	128.4	182.7	121.3	+42	-5.6
జులై	170.7	176.8	110.5	+13.3	-35.3
మొత్తం	299.1	359.4	231.9	+26.7	-22.5

రిజర్వాయర్ల నీటిమట్టాల పరిస్థితి

రిజర్వాయర్ పేరు	సాధారణ నీటమట్టం	2016 ఆగస్టు 3	2017 ఆగస్టు 3
తాటిపూడి (అడుగుల్లో)	297	281.60	280
ఆంధ్ర (అడుగుల్లో)	146	140	142
వెంగళరాయసాగర్ (అడుగుల్లో)	187	180	161
పెద్దగెడ్డ(అడుగుల్లో)	213	120	207.98
తోటపల్లి (మీటర్లలో)	105	99	103.77

నాలుగు లైన్ల హైవే కలేనా?

విస్తరణకు నోచుకోని గుంటూరు-హైదరాబాద్ మార్గం

పెరుగుతున్న వాహనాల రద్దీ

పిపిపి పద్ధతిలో నిర్మాణానికి సర్కారు యోచన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు-పిడుగురాళ్ల-దాచేపల్లి వరకూ రహదారి విస్తరణ పనులు కాగితాలకే పరిమితమయ్యాయి. నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు ఈ మార్గంలో నిత్యం వేలాది వాహనాలు వెళుతుంటాయి. గుంటూరు-పిడుగురాళ్ల మధ్య ప్రస్తుతం కొన్ని చోట్ల ఏడు మీటర్ల రహదారి, కొన్ని చోట్ల పది మీటర్ల రహదారి మాత్రమే ఉంది. ఈ మార్గంలో నిత్యం ఆరు నుంచి పదివేల వాహనాల వరకూ వెళ్తున్నాయని అంచనా. పెరిగిన రద్దీ దృష్ట్యా గుంటూరు నుంచి దాచేపల్లి వరకూ నాలుగు లైన్ల రహదారిని నిర్మిస్తే హైదరాబాద్‌కు వెళ్లేందుకు ఇప్పటికే నిర్మించిన అద్దంకి-నార్కెట్‌పల్లి నాలుగు లైన్ల రహదారికి అనుసంధానం చేసేలా గతంలో అధికారులు ప్రణాళిక తయారు చేశారు. అయితే తొలి దశలో గుంటూరు నుంచి పిడుగురాళ్ల వరకూ 64 కిలో మీటర్ల రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకోసం రూ.600 కోట్ల అంచనాలతో డిపిఆర్ సిద్ధం చేశారు. రాష్ట్ర రహదారిగా ఉన్న ఈ రహదారి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో పిపిపి పద్ధతిలో నాలుగులైన్ల రహదారి నిర్మాణం చేపట్టాలని పలువురు ప్రజా ప్రతినిధులు సూచించారు. పిడుగురాళ్ల -రాజుపాలెం మధ్య టోల్‌గేట్ ఏర్పాటు చేసుకునే విధంగా ప్రణాళిక తయారు చేశారు. అయితే ఇప్పటి వరకూ రహదారి నిర్మాణంపై ప్రభుత్వం ఇంకా ఎటువంటి నిర్ణయమూ తీసుకోలేదు. విజయవాడ మీదుగా హైదరాబాద్ వెళ్లడం కన్నా పిడుగురాళ్ల, దాచేపల్లి, పొందుగల, మిర్యాలగూడ, నార్కెట్‌పల్లి మీదుగా వెళ్లేందుకు వాహనదారులు ఆసక్తి కనబరుస్తున్నారు. విజయవాడ నగరం దాటేందుకు ఎక్కువ సమయం పడుతున్నందున గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలోని కొన్ని ప్రాంతాల వారు ఈ మార్గంలో వెళ్లేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రైవేటు, ఆర్‌టిసి బస్సులు, లారీలు, కార్లు పెద్ద సంఖ్యలో వెళ్లడం వల్ల ఈ మార్గంలో తరచూ రహదారుల మరమ్మతులకు గురవుతున్నాయి. అలాగే గుంటూరు-పిడుగురాళ్ల మార్గంలో లో లెవల్ చప్టాలు కూడా పది వరకూ ఉండటం వల్ల భారీ వర్షాలకు చప్టాలపై నీరు ప్రవహిస్తుండటంతో తరచూ రాకపోకలకు అంతరాయం కల్గుతోంది. వాహన రద్దీ పెరిగిన నేపథ్యంలో ఈ మార్గంలో భారీ ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. గుంటూరు-హైదరాబాద్ మార్గంలో ఏడాదికి వంద మంది వరకూ రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మార్గంలో అనేక చోట్ల రహదారి చాలా ఇరుకుగా ఉండటంతో మరీ ఇబ్బందిగా మారింది.

విశాఖలో ఫలించిన మద్యం వ్యతిరేక పోరాటం



విశాఖపట్నం సంతోష్‌నగర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

ప్రజాశక్తి-యంత్రాంగం

విశాఖపట్నంలోని సంతోష్ నగర్‌లో జనావాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దంటూ 32 రోజులుగా స్థానిక మహిళలు చేస్తున్న పోరాటం ఫలించింది. దీంతో గురువారం సాయంత్రం మహిళలు సంతోష్‌నగర్‌లో కొవ్వొత్తులతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. వైన్‌షాపు తమ ప్రాంతానికి రాకుండా అడ్డుకున్న ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా నగర కార్యదర్శి ఆర్‌ఎన్.మాధవి, కాలనీ అధ్యక్షులు అర్జునరావు, నాయకులు ధర్మారావు, పద్మ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు. గుంటూరు జిల్లా వినుకొండలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన మద్యం దుకాణం వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు, స్థానికులు ఆందోళన చేపట్టారు. జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద సువిశాలమైన ప్రదేశంలో డిగ్రీ కాలేజీ ఉందని, ఇక్కడ మద్యం దుకాణానికి అనుమతిస్తే కాలేజీ మొత్తం మందుబాబులకు అడ్డాగా మారుతుందని ఆవేదన వెలిబుచ్చారు. ఈ మేరకు స్థానిక రహదారిపై రాస్తారోకోకు దిగారు. విద్యార్థుల ఆందోళనకు స్థానికులు మద్దతుగా నిలిచారు. గుంటూరులోని సుద్ధపల్లి డొంక వద్ద చేపట్టిన మద్యం వ్యతిరేక దీక్షలు 31వ రోజుకు చేరాయి. శిబిరాన్ని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు గద్దె ఉమశ్రీ సందర్శించి మాట్లాడారు. పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలు పట్టణంలో జనంతో కిటకిటలాడే మార్కెట్‌లో మద్యం దుకాణం ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ, ఆ దుకాణం ఎదుట సిపిఎం ఆధ్వర్యాన చిరువ్యాపారులు, ప్రజలు గురువారం ధర్నా చేశారు.

వాల్మీకి నేత దారుణ హత్య

ప్రజాశక్తి- కళ్యాణదుర్గం టౌన్

అనంతపురం జిల్లా వాల్మీకి ఫెడరేషన్ కార్పొరేషన్ డైరెక్టర్, కళ్యాణదుర్గం మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గొల్ల బోయబాదన్న (66) ప్రత్యర్థుల చేతిలో గురువారం దారుణహత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. కళ్యాణదుర్గం మండలం గొల్ల గ్రామానికి చెందిన బాదన్న ఎప్పటిలాగే గురువారం వేకువ జామునే వాకింగ్‌కు వెళ్లారు. అప్పటికే కాపుకాసిన దుండగులు స్థానిక ఆంజనేయ స్వామి దేవాలయం వద్దకు రాగానే వేటకొడవళ్లు, కత్తుల తో దాడి చేసి పరారయ్యారు. కొన ఊపిరితో ఉన్న బాదన్నను కుటుంబసభ్యులు కళ్యాణ దుర్గం ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించాలని వైద్యులు సూచించారు. నగరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలిస్తున్న సమయంలో మృతి చెందాడు. ఈ కేసులో నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారం రోజుల క్రితం జరిగిన ఓ స్థల వివాదమే ఈ హత్యకు దారి తీసి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు.

యువతి అదృశ్యం వెనుక నా భర్త ప్రమేయం లేదు

విద్యాసాగర్ భార్య సుష్మ

ప్రజాశక్తి- మొగల్రాజపురం (విజయవాడ)

తన భర్తను పోలీసులు అన్యాయంగా చిత్ర హింసలు పెడుతున్నారని ఓ భార్య వాపోయింది. కృష్ణాజిల్లా విస్సన్నపేట వైద్యురాలు, కర్నాటక ఐఎఎస్ అధికారి సోదరి అయిన సూర్యకుమారి అదృశ్యం వెనక విజయవాడ తూర్పు మాజీ ఎమ్మెల్యే జయరాజు కుమారుడు విద్యాసాగర్ ఉన్నారని వార్తలొచ్చిన నేపథ్యంలో విద్యాసాగర్ భార్య సుష్మ గురువారం విలేకరులతో మాట్లాడారు. ఈ కేసులో తన భర్తను పోలీసులు అన్యాయంగా అరెస్టు చేశారని చెప్పారు. యువతి అదృశ్యం వెనుక తన భర్త ప్రమేయం లేదన్నారు. యువతి తమ నివాసానికి వచ్చిన మాట వాస్తవ మేనని, భర్తను రెండు రోజుల క్రితం పోలీసులు విచారణ నిమిత్తం పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లా రని తెలిపారు. బుధవారం రాత్రి ప్రసార మాధ్యమాల్లో తన భర్తపై కిడ్నాప్ కేసు నమోదై నట్లు చూసి షాక్‌కు గురయ్యానని చెప్పారు.

చెట్టును ఢీకొన్న కారు నలుగురు మృతి

ప్రజాశక్తి- కణేకల్లు

అనంతపురం జిల్లా కణేకల్లు మండలంలో గురువారం కారు చెట్టును ఢీకొన్న ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. బెళుగుప్ప మండలం తగ్గుపర్తి గ్రామానికి చెందిన రంగమ్మ(55) బళ్లారిలో స్థిరపడింది. చనిపోయిన తండ్రి జ్ఞాపకార్థం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనేందుకు రంగమ్మ తన మరిది ఆదినారాయణ (54), కుమారుడు సత్యనారాయణ (30), కోడలు మమత (22)లు బళ్లారి నుంచి కారులో బెళుగుప్ప మండలం తగ్గుపర్తి గ్రామానికి వచ్చారు. బళ్లారికి తిరుగు ప్రయాణంలో కణేకల్లు మండలం యర్ర గుంట వద్ద కారు టైర్ పంచరై అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ప్రమాదంలో రంగమ్మ, ఆదినారాయణ, మమతలు అక్కడికక్కడే మృతి చెందారు.గాయపడిన సత్యనారాయణను రాయదుర్గం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.

నీటి ఎద్దడిపై రైతుల విలవిల

ముందస్తు ఖరీఫ్‌కు గుంటూరు రైతుల వెనుకంజ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో కరువు ఛాయలు ఏర్పడుతున్నాయి. గత రెండు నెలల్లో జిల్లాలోని పలు మండలాల్లో కనీస వర్షపాతం నమోదు కాలేదు. పల్నాడులో ఖరీఫ్ సాగుపై రైతులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. జూన్ నెలలో 86.3 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా 148.1 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. దీంతో రైతులు కొంత ఊరట చెందారు. అయితే జూలైలో మొదటి పక్షంలో 10 రోజులు వర్షాల్లేక వేడిగాలులతో వేసిన పంటల వడబారాయి. తిరిగి అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురిసి పంటలకు ఊపిరి పోశాయి. జులైలో 142.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 126.6 మిల్లీ మీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది.. అంతేగాక నెల మొత్తం మీద సాధారణ, అంతకన్నా తక్కువ వర్షం కురిసిన మండలాల్లో నర్సరావుపేట, దుగ్గిరాల, ఫిరంగిపురం, పెదకూరపాడు, గుంటూరు, పత్తిపాడు, నాదెండ్ల, భట్టిప్రోలు, యడ్లపాడు, బాపట్ల, చిలకలూరిపేట, కారంపూడి, నూజెండ్ల, మాచవరం, కారంపూడి తదితర కనీస వర్షపాతం నమోదు కాలేదని అధికారులు తెలిపారు. ఈ మండలాల్లో ఇప్పటికే సాగు పక్రియలో ఉన్న, పంటలు వేయాల్సిన రైతులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. వేసవిని తలపించే విధంగా పగటి ఉష్ణోగ్రతలు పెరగడంతో వేసిన పైర్ల ఎదుగుదల నిలుస్తోంది. అలాగే జిల్లాలో ముందస్తు ఖరీఫ్ సాగు ఆశించినంతగా విజయం సాధించలేదు. పట్టి సీమ నుంచి గోదావరి జలాలు జూన్ చివరి వారంలోనే డెల్టాకు విడుదల చేసి వెంటనే వరి నాట్లు వేయాలని రైతులపై వత్తిడి తెచ్చినా వారు స్పందించలేదు. మొత్తం ఐదు లక్షల ఎకరాల్లో వరి సాగు అవుతుందని అంచనా వేయగా ఇప్పటి వరకూ రెండు లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేసేందుకు రైతులు నారుమళ్లు పోసుకున్నారు. ఇందులో 50 వేల ఎకరాల్లో వెద పద్ధతిలో సాగు జరిగింది. వర్షాలు విస్తారంగా కురిసి కాల్వల్లో పుష్కలంగా నీరు ఉంటే ఆగస్టు చివరిలోగా వరినాట్లు వేస్తామని రైతులు చెబుతున్నారు. గుంటూరు జిల్లాలో 90 శాతం వరి సాగు బిపిటి రకం ఉంటుందని దీని కాలపరిమితి 145 రోజులని అందువల్ల ఆగస్టు చివరన వరినాట్లు వేస్తే తుపానుల బారి నుంచి పంటకు ఇబ్బంది కలగకుండా ఉంటుందని రైతులు చెబుతున్నారు. అలాగే ముందస్తు ఖరీఫ్‌లో భాగంగా లక్ష ఎకరాల్లో అపరాలు సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా కేవలం 35 వేల ఎకరాల్లోనే సాగుచేశారు. కంది, పెసర, మినుము, శనగ పంటలను పూర్తి సాగు చేయలేకపోయారు. జిల్లాలో ఈ ఏడాది పత్తి సాగు వేగంగా జరుగుతోంది. ఇప్పటి వరకూ 3.08 లక్షల ఎకరాల్లో పత్తిసాగు జరిగింది. మిర్చి 7 వేల ఎకరాల్లో వేశారు. ఉద్యాన పంటలు 90 వేల ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా 75 వేల ఎకరాల్లో సాగు చేశారు. జిల్లా మొత్తం మీద 13.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కావాల్సి ఉండగా ఇప్పటి వరకూ కేవలం ఐదు లక్షల ఎకరాల్లోనే పంటలు సాగు చేశారు. సాగర్ ఆయకట్టు వర్షాభావంతో గత మూడేళ్లుగా వరి సాగుకు అవకాశం ఇవ్వలేదు. సాగర్ డ్యామ్‌లో గరిష్ట నీటి మట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం నీటి మట్టం 500 అడుగుల్లో ఉంది. పులిచింతలలో గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 45.7 టిఎంసీలు కాగా ప్రస్తుతం 3.2 టిఎంసీల మట్టంలోనే నీరు ఉంది. పులిచింతల నుంచి నీరు రాకపోతే మొత్తం పట్టిసీమపైనే ఆధారపడి వరిసాగు చేయ గలమా అన్న సందేహం కూడా రైతుల్లో లేకపోలేదు. పులిచింతలకు భారీగా వరద నీరు వస్తే వరి సాగుకు ఇబ్బంది ఉండదని రైతులు చెబుతున్నారు.

115 మంది క్రికెట్ బుకీల అరెస్టు

- రూ.44.24 లక్షలు, 27 సవర్ల బంగారం, మూడు కార్లు, 96 సెల్‌ఫోన్లు, 10 ల్యాప్‌ట్యాప్‌లు, 3 కమ్యూనికేటర్లు స్వాధీనం
- కొందరి వద్ద గంజాయి స్వాధీనం
- నెల్లూరు ఎస్‌పి రామకృష్ణ వెల్లడి



అరెస్టు చేసిన నిందుతులను చూపుతున్న ఎస్‌పి రామకృష్ణ

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు జిల్లాలో 115 మంది క్రికెట్ బుకీలను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.44.24 లక్షల నగదు, 27 సవర్ల బంగారం, మూడు కార్లు, 96 సెల్‌ఫోన్లు, 10 ల్యాప్‌ట్యాప్‌లు, 3 కమ్యూనికేటర్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్‌పి పిహెచ్‌డి రామకృష్ణ నెల్లూరులోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లోని ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. జిల్లా వ్యాపితంగా 21 చోట్ల దాడులు నిర్వహించి వారిని పట్టుకున్నామన్నారు. క్రికెట్ బుకీలతో సంబంధం ఉన్న ఎవరినీ వదలబోమన్నారు. ఇంకా పలువురిని అరెస్టు చేయాల్సి ఉందని, కొందరు నిందితులు పరారీలో ఉన్నారని తెలిపారు. పోలీసు శాఖకు సంబంధించిన అధికారులతో విచారణ జరుగుతుందని, రుజువైతే చర్యలు తప్పవని అన్నారు. అరెస్టయిన వారిలో ప్రధాన బుకీ కృష్ణసింగ్‌తోపాటు మరో 15 మంది అత్యంత కీలకమైన బుకీలు, మరో 9 మంది జూనియర్లు ఉన్నారన్నారు. వీరిలో కొంత మంది వద్ద గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. కొందరు ఫైనాన్షియర్లూ ఉన్నారని, వారినీ విచారిస్తామని అన్నారు. క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో పోలీసులూ ఒక్కో వికెట్‌లా పడిపోతున్నారు. రెండ్రోజుల క్రితం గూడూరు, నెల్లూరు నగర డిఎస్‌పిలు విఆర్‌కు పిలిచిన విషయం తెలిసిందే. తాజాగా గురువారం నెల్లూరులో ఇద్దరు సిఐలను విఆర్‌కు పిలిచారు. దీంతోపాటు కానిస్టేబుళ్లపైనా వేటు పడనున్నట్లు సమాచారం.

బెట్టింగ్‌లకు పాల్పడే ఏ స్థాయి వారినైనా కఠినంగా శిక్షించాలి : సిపిఎం

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడే వారు ఏ స్థాయి నాయకులనైనా కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్ డిమాండ్ చేశారు. బాలాజి నగర్లోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్లో ఆ పార్టీ ఆధ్వర్యాన గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రికెట్ బెట్టింగ్ భూతం జిల్లాలో మారుమూల పల్లెలకు సైతం పాకిందన్నారు. దాంతో పలు ఎగువ, దిగువ మధ్య తరగతి కుటుంబాలు వీధుల పాలయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. బెట్టింగ్‌లపై కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సమావేశంలో ఆపార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పొట్టేపాళెం చంద్రమౌళి, మూలం రమేష్ పాల్గొన్నారు.

ఇళ్ల తొలగింపును నిరసిస్తూ టిడిపి కార్పొరేటర్ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

అనంతపురం నగరంలోని విజయనగర కాలనీలో నాలుగేళ్లుగా నివాసముంటున్న పేదల ఇళ్లను ఉన్న పళంగా తొలగించడాన్ని నిరసిస్తూ స్థానిక తెలుగుదేశం పార్టీకి చెందిన కార్పొరేటర్ ఉమామహేశ్వరరావు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. అనంతపురం నగరంలోని విజయనగర కాలనీలో నాలుగేళ్లుగా నివాసముంటున్న పేదల ఇళ్లను తొలడించడానికి అధికారులు సిద్ధపడ్డారు. గురువారం జెసిబిలతో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు వెళ్లి తొలగింపునకు సిద్ధపడ్డారు. నోటీసులు ఇవ్వకుండా తొలగింపు ఏమిటంటూ స్థానికులు అడ్డుపడే ప్రయత్నం చేశారు. వినకుండా ఇళ్ల తొలగింపు మొదలుపెట్టారు. బాధితులకు మద్దతుగా కార్పొరేటర్ ఉమామహేశ్వరరావు నిలిచారు. అయిన ఇళ్లను తొలగిస్తుడటంతో ఆయన వాస్మాల్-33 ద్రావణం తాగారు. వెంటనే స్థానికులు ఆయన్ని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

సమకాలీనం

వెనకటికొకడు నేను లేస్తే మనిషిని కానంటే వాడట. కానీ ఎప్పుడూ లేచేవాడు కాదట. రాష్ట్రంలో మద్యం బెల్టు షాపులు, ఇసుక అక్రమ రవాణాపై కొరడా ఝుళిపిస్తానంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఘీంకారాలు అచ్చం అలాగే ఉంటున్నాయి. జులై 18న హడావిడిగా మంత్రి మండలి సమావేశం ఏర్పాటు చేసి ఇకమీదట ఈ క్షణం నుంచి రాష్ట్రంలో ఎక్కడా బెల్టు షాపు అన్నది ఉండటానికి వీల్లేదని నిర్ణయం తీసుకున్నారు. బెల్టు షాపులను పూర్తిగా రద్దు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ అధికారంలోకొచ్చాక కనీసం మూడేళ్లకైనా చంద్రబాబుకు గుర్తుకొచ్చినందుకు మహిళలు సంతోషించారు. కేబినెట్‌లో తీర్మానం చేసి రెండు వారాలు గడిచినా బెల్టు షాపులు యథావిధిగా నడుస్తూనే ఉన్నాయి. ఏదో తూతూ మంత్రంలా ఆబ్కారీ అధికారులు ఒకటీ అరా దాడులు చేసి కేసులు పెడుతున్నారు తప్ప పూర్తిగా బెల్టు షాపులను నిరోధించింది లేదు. అయినా బెల్టు తీస్తున్నామని ప్రజలను, మహిళలను మభ్యపుచ్చడం దారుణం. మద్యంపై ఆదాయం తెచ్చుకోవాలన్న ఉద్దేశం లేదని తరచు వల్లించే చంద్రబాబు జమానాలో మద్యం ఆదాయం 'వృద్ధి' చెందుతోందనడానికి ఉదాహరణ 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ.15 వేల కోట్లు రాబట్టాలని టార్గెట్ విధించడం. ఈ లక్ష్యాన్ని ఛేదించేందుకు లెక్కకు మించి మార్గాలు వెతికి పట్టుకుంటున్నారు. బార్లు పెంచేశారు. పది శాతం వైన్ షాపులను ప్రభుత్వం నిర్వహించాలనుకోగా వాటిని ప్రైవేటీకరిస్తున్నారు. లిక్కర్ అమ్మకాలపై అధికారులకు నెలవారీ టార్గెట్లు విధిస్తున్నారు. మద్యం ధరలు పెంచుతున్నారు. ఈ లక్ష్యాలు సాధించాలంటే కేవలం అనుమతించిన దుకాణాల సామర్థ్యం చాలదు. అందుకే అనుబంధంగా కొన్ని రెట్ల బెల్టు దుకాణాలు నడుస్తున్నాయి. రాష్ట్రంలో 4 వేలకు పైన లిక్కర్ షాపులుండగా వాటికి ఐదు నుంచి పదిరెట్ల బెల్టు షాపులు ఉన్నాయి. మద్యం దుకాణాలను ప్రత్యక్షంగా, పరోక్షంగా నిర్వహిస్తున్నది అధికారపార్టీ వారే. ప్రభుత్వ ఖజానాకు కాసులు రావాలన్నా, అధికారపార్టీ నాయకులు 'ఐతకు' సాగించాలన్నా బెల్టు షాపులను తప్పనిసరి చేశారు.

పైకే ఘీంకారాలు!

ఇసుక మాఫియా రాష్ట్రాన్ని రుగ్మతగా పట్టి పీడిస్తోంది. ప్రజలకు, ప్రభుత్వ పనులకు ఉచిత ఇసుక అని పేర్కొన్నప్పటికీ ఎక్కడా జనానికి ఉచితంగా ఇసుక దొరకట్లేదు. సరికదా గతం కంటే ధర పెరిగింది. నిర్దేశించిన రీచ్‌ల్లో అదీ నిబంధనల మేరకే ఇసుక తవ్వకాలు సాగించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ యంత్రాలను వాడవద్దని విధానం రూపొందించారు. బహిరంగానే యంత్రాలతో నదీ గర్భాలను తొలుస్తున్నా, లారీలకు లారీలు రహదారులపై లైను కడుతున్నా అడిగే నాథుడు లేడు. డ్వాక్రా మహిళలకు ఇసుక రీచ్‌ల బాధ్యత అప్పగించినా పెత్తనం మాత్రం అధికారపార్టీ ఎమ్మెల్యేలు, నాయకులదే. దీంతో అక్రమాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ఇసుక మాఫియా పెట్రేగిపోయిందనడానికి పక్కా సాక్ష్యం సిఎం స్వంత జిల్లా ఏర్పేడు ఘటనే. స్వర్ణముఖి నదిలో అక్రమ ఇసుక తవ్వకాలను అడ్డుకోవాలని అధికారులకు విన్నవించేందుకు వెళ్లిన బాధితులపై లారీ ఎక్కించారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించిన ఈ కేసు దర్యాప్తు ఏమైందో తెలీదు. ఇసుక దందాను అడ్డుకున్నందుకు కృష్ణాజిల్లా ముసునూరు మండల తహసీల్దారు వనజాక్షిని చెరబట్టిన టిడిపి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌పై ఈగ వాలనివ్వలేదు. ప్రభుత్వ దన్నుతోనే ఇసుక అక్రమాలు సాగుతున్నాయనడానికి ఈ రెండు ఉదంతాలూ చాలు.

బెల్టు షాపులు, ఇసుక అక్రమాల్లో నిండా మునిగింది తమ వారైనా చర్యలు చేపడతామని సిఎం హూంకరించేది నిందితులను భయపెట్టడానికి కాదు. తమ ప్రభుత్వం అక్రమార్కుల పట్ల కఠినంగా ఉందని నమ్మించడానికి. టిడిపి నిర్వహించిన అంతర్గత సర్వేల్లో బెల్టు షాపులు, ఇసుక అక్రమాలపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ రెండూ రానున్న ఎన్నికల్లో ఎక్కడ పుట్టి ముంచుతాయోనన్న భయంతోనే సిఎం చర్యలంటున్నారు. పైకి చండశాసనుడనని ప్రచారం చేసుకొని ప్రజల్లో వ్యతిరేకత తగ్గించుకోవాలని చూస్తున్నారు. జాతీయ, రాష్ట్ర రహదారుల పక్కన మద్యం విక్రయాలను సుప్రీంకోర్టు నిషేధించింది. దాంతో ఎక్కడో దూరంగా ఉన్న 'మందు' దుకాణాలు జనావాసాల్లోకి వచ్చాయి. చాలా చోట్ల మహిళలు అడ్డుకున్నారు. తమ భర్తలకు తాగబోయించి సంసారాలు కూల్చొద్దని రోడ్డెక్కారు. మహిళల ఆగ్రహంతోనైనా మద్య నియంత్రణ చేయాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా రహదారుల స్థాయిని మార్చి చేసి యథావిధిగా రోడ్ల పక్క లిక్కర్ అమ్మకాలకు మార్గం సుగమం చేసింది. ఈ విషయాన్ని తప్పుదారి పట్టించేందుకు బెల్టు తీస్తామంటోంది. అప్పటికి ప్రభుత్వం మహిళా పక్షపాతి అయినట్లు మాయ చేస్తోంది. ఇసుక అక్రమాలైనా, అనధికారిక బెల్టు షాపులైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో నిరోధిస్తే ఆగిపోతాయి. నోటితో నవ్వి నొసటితో వెక్కిరించినట్లు పైకి అక్రమాలపై ఉక్కుపాదం అని గావు కేకలు పెట్టి లోపల్లోపల వత్తాసు పలికితే ఆగవు సరికదా ఇంకా పెరుగుతాయి. ఇప్పటికైనా సర్కారు రాజకీయలబ్ధి, స్వప్రయోజనాల దృష్టితో కాకుండా బెల్టు దుకాణాలను, ఇసుక అక్రమాలను చిత్తశుద్ధితో అడ్డుకోవాలి.

మహనీయుల మాట



ఆశావాదం విజయానికి దారితీసే విశ్వాసం. ఆశ, ఆత్మవిశ్వాసం లేకుండా దేన్నీ సాధించజాలం.

- హెలెన్ కెల్లర్

లోకయుక్త అధికారాలు పటిష్టపర్చాలి

జలీల్‌ఖాన్

చర్చ

ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థలు చేపట్టిన చర్యలు, తీసుకున్న నిర్ణయాలకు సంబంధించి వచ్చే ఆరోపణలపై విచారణ జరపడానికి 1983లో ఉమ్మడి రాష్ట్రంలో 'లోకాయుక్త చట్టాన్ని' చేశారు. ఈ చట్టం అమలుకు లోకాయుక్త, ఉపలోకాయుక్తలకు గ్రేడ్ 1 జిల్లా జడ్జి హోదా కలిగివుండాలి. లోకాయుక్త సంస్థలో అధికారులతో కలిపి 130 మంది ఉద్యోగులు వున్నారు. ఈ సంస్థ కార్యకలాపాలకు సాలీనా సుమారు రూ.10 కోట్ల వరకు ఖర్చవుతోంది. దీన్ని స్థాపించి ముప్పై నాలుగేళ్ళయినా సాధించింది ఏమీ లేదు. చట్టంలో లోపమే దీనికి కారణం. ఉదాహరణకు తాము విచారణ జరిపి తీసుకున్న నిర్ణయాన్ని సంబంధిత అధికారులకు తెలపడం వరకే పరిమితమైంది. తర్వాతి చర్యపై నిర్ణయాన్ని ప్రభుత్వానికి వదిలివేయాలి. దీనివల్ల లోకాయుక్త, ఉప లోకాయుక్తలు కేవలం స్వల్ప అధికారాలతోనే మిగిలిపోతున్నాయి. మిగిలిన రాష్ట్రాలతో పోల్చుకుంటే మన రాష్ట్రంలో లోకాయుక్త చట్టం బలహీనంగా వుంది.

కర్ణాటకలో లోకాయుక్త విచారణ సందర్భంగా అప్పటి ముఖ్య మంత్రి యడ్యూరప్ప రాజీనామా చేసే పరిస్థితి వచ్చింది. కాని మన రాష్ట్రంలో ముఖ్యంగా ఆశ్రిత పక్షపాతం, బంధుప్రీతి, లాభాపేక్షలు రాజ్యమేలుతున్నాయి. తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజకీయ నాయకులపై ఎన్ని కేసులు విచారణకు వచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఉమ్మడి రాష్ట్ర లోకాయుక్త చట్టం



ప్రకారం అధీకృత అధికారి (కాంపిటేటివ్ ఆథారిటీ) అయిన రాష్ట్ర ముఖ్యమంత్రి లోకాయుక్త పరిధిలోకి రాడు. మంత్రులు, ఉన్నతాధికారులపై ఆరోపణలు వచ్చినప్పుడు లోకాయక్త వాటిపై విచారణ జరిపి తగుచర్య తీసుకోవాలని ముఖ్యమంత్రికి సిఫారసు చేస్తుంది. అలాగే శాసనసభ సభ్యులపై ఫిర్యాదుల విచారణ ఫలితాలను అసెంబ్లీ స్పీకర్‌కు నివేదిస్తుంది. ఉద్యోగులపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపి తీసుకోవాల్సిన చర్యలను సంబంధిత శాఖాధిపతులకు సిఫారసు చేస్తుంది. అయితే కచ్చితంగా లోకాయుక్త నివేదికను అమలు చేయాలనే నిబంధన లేకపోవడం వల్ల ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు.

ఇక మన రాష్ట్రంలో లోకాయుక్త వద్ద ప్రత్యేక విచారణ విభాగం లేదు. అలాగే అన్ని సాక్ష్యాధారాలు వుండి ఏదైనా వ్యక్తిని విచారణ చేయాలంటే ప్రభుత్వ అనుమతి వంటి షరతు వుంది. దీంతో లోకాయుక్త ఏమీ చేయలేదు.

ఇప్పటివరకు మన రాష్ట్రంలో లోకాయుక్త న్యాయం చేసిన కేసులు అతి సామాన్యమైనవి మాత్రమే. ఉదాహరణకు నెల్లూరు జిల్లా పాపిరెడ్డి పాలెం పంచాయతిలో ఒక వ్యక్తి గ్రామ చెరువు నుంచి అక్రమంగా నీరు వాడుతున్నాడని ఫిర్యాదు అందింది. లోకాయుక్త దానిపై స్పందించి జిల్లా కలెక్టర్‌కు తగిన సూచనలిచ్చి సమస్యకు పరిష్కారం తెలిపింది. గుంటూరు, కృష్ణా, తదితర జిల్లాల్లో కొన్ని కేసులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. కాని ఉన్నత శాఖ అధికారులు ఈ ఆదేశాలను కంటి తుడుపుగా అమలు చేస్తున్నారు. జిల్లాల్లో అతి సామాన్యమైన ఫిర్యాదులపై స్పందించి పరిహారం ఇప్పించింది. చిన్న చిన్న సమస్యలకే పరిమితం కావడంతో లోకాయుక్త ఏర్పాటు ఉద్దేశాలను ప్రభుత్వ పాలకులు నీరుగారుస్తున్నారు. మంత్రులు, శాసనసభ్యులు, ఉన్నతాధికారులపై ఫిర్యాదులను విచారించి కొరడా ఝుళిపించవలసిన లోకాయుక్త సరైన అధికారాలు లేక చతికిలబడింది. గత ప్రభుత్వం(2013 ఏప్రిల్ 30న) జివో ఎంఎస్ నంబర్ 325 ద్వారా అనేక శాఖల్లో సిటిజన్స్ చార్టర్ (ప్రజా హక్కుల పట్టిక) తయారు చేసి, ప్రజల ఫిర్యాదులు నిర్ణీత సమయంలో పరిష్కరించాలని లేకపోతే సంబంధిత అధికారిపై జరిమానా కూడా వేయాలని ఆర్డర్ వేసింది. అయితే ఈ ఆచరణను ప్రభుత్వాధికారులు నిర్వీర్యం చేస్తున్నారు. ఏడాదిన్నర క్రితం అవినీతి నిరోధక చట్టాన్ని సవరణగా అక్రమాస్తుల జప్తు బిల్లును రాష్ట్ర మంత్రివర్గం తీర్మానించింది. అయినా నేటి వరకూ ప్రత్యేక కోర్టును కూడా టిడిపి ప్రభుత్వం ఏర్పర్చ లేదు.

ఉన్నత స్థానాలలో జరుగుతున్న అవినీతి సాధారణంగా బయటకు రాదు. ఇప్పుడున్న అవినీతి నిరోధక శాఖ, విజిలెన్స్ కమిషన్ వంటివి మంత్రులు, శాసనసభ్యులు, ప్రభుత్వ కార్యదర్శుల స్వంత లాభం కోసం తీసుకుంటున్న తప్పుడు నిర్ణయాలపై ఈ సంస్థలు ఏమీ చేయలేక పోతున్నాయి. రాజకీయ నాయకులు, అధికారుల అవినీతి చర్యలు అరికట్టడానికి కర్ణాటక తరహాలో లోకాయుక్త పరిధిలో ఎసిబి విజిలెన్స్ అవసరం వుంది. అంతేకాక అవి

★ స్వతంత్రంగా విచారణ జరిపించడానికి లోకాయుక్తకు ప్రత్యేక సిబ్బంది ఉండాలి. ★ ప్రాథమిక ఆధారాలు ఉన్నప్పుడు ముందస్తు అనుమతి లేకుండా ప్రత్యేక న్యాయస్థానంలో కేసు వేయడానికీ, దానిపై తగిన చర్యలు తీసుకోవడానికీ లోకాయుక్త పరిధిలో తగిన న్యాయ సిబ్బంది వుండాలి. ★ అవసరమను కున్నప్పుడు నేరారోపణలు ఎదుర్కొంటున్న రాజకీయ నాయకులపై విచారణ చేసే అధికారాలు ఉండాలి. ★ అవినీతి ఆరోపణలు రుజువైన పక్షంలో సంబంధిత అధికారిని ఉద్యోగం నుంచి తొలగించేందుకు గాని, క్రింది స్థాయి ఉద్యోగానికి బదిలీ చేసేందుకు గాని ప్రభుత్వాన్ని కోరినప్పుడు ప్రభుత్వం వెంటనే దాన్ని అమలు చేయాలి. ★ లోకాయుక్తకు స్వతంత్రంగా విచారణా విభాగాలు వుండాలి. ★ లోకాయుక్త కేసులు విచారించడానికి ప్రత్యేక కోర్టు వుండాలి. ★ ఆర్థిక సంవత్సరంలో తనకు అవసరమైన నిధుల బడ్జెట్‌ను తయారు చేసి ప్రభుత్వానికి పంపాలి. నిధులు విడుదల చేసిన తరువాత ప్రభుత్వంతో, పాలకులతో, ఆర్థికశాఖతో సంబంధం లేకుండా నిబంధనల ప్రకారం ఖర్చు చేసే అధికారం వుండాలి. 8 అక్రమ కాంట్రాక్టులను రద్దు చేయడానికి, గుత్తేదార్లను బ్లాక్ లిస్టులో పెట్టే అధికారం వుండాలి.

సెల్: 9030518004.

మెయిల్ @ ప్రజాశక్తి

ప్రజాశక్తి సంపాదక పేజీలో వ్యాసాలు మాత్రమే కాదు. వివిధ విషయాలపై మీ అభిప్రాయాలకు కూడా అవకాశం. మీరు అనుకునే ఏ సమస్య పైనైనా సరే- మరీ సుదీర్ఘం కాకుండా సూటిగా క్లుప్తంగా రాసి పంపించండి లేదా ఇ మెయిల్ చేయండి. వెంటనే ప్రచురిస్తాం.

ఇ- మెయిల్ అడ్రస్

editpageps@gmail.com

సత్యాన్ని వెలిగించిన విజ్ఞాని

సందర్భం

ఈ భూమి మీద సత్యాన్ని వెలిగించడం కోసం తమ జీవితాలనే ధారపోసిన మహనీయు లెందరో ఉన్నారు. సత్యం అంటే సైన్సు – సైన్సు అంటే సత్యం. అందుకే ఈ సత్యం కోసం వారెన్నో త్యాగాలు చేయవలసి వచ్చింది. రాజ్యాన్ని ఎదిరించ వలసి వచ్చింది. నిర్భయంగా నిజాన్ని ప్రకటించినందుకే నిండు ప్రాణాలను బలిపెట్టవలసి వచ్చింది. భూమి గుండ్రంగా ఉందన్నందుకు బ్రూనోను మంటల్లో కాల్చి చంపారు. సూర్య కేంద్ర సిద్ధాంతాన్ని ప్రతిపాదించినందుకు కోపర్నికస్‌ను చెరసాలలో నిర్బంధించారు. గెలీలియోను చిత్రహింసలు పెట్టారు. ఇలా ఎందరో శాస్త్రవేత్తలు సైన్సు కోసం సమిధలైనారు... అయితేనేం సత్యాన్ని వెలిగించారు. శాస్త్రీయత పండించారు. శాస్త్రీయ దృక్పథం వ్యవస్థలోని విలువల అసలు స్వరూపాన్నీ, నిజాలనూ దర్శింపజేస్తుంది. 'వర్గపోరాటంలో నిజాలను నిర్భయంగా ప్రకటించడమూ పోరాటమే' అంటాడు లీషావ్‌చీ. అట్లా సత్యం కోసం పోరాడిన త్యాగధనుల వారసుడే పి.ఎం. భార్గవ. ఒక సైన్సు ఎగ్జిబిషన్‌లో కారల్ మార్క్స్ చిత్తరువును ప్రదర్శించినందుకు నాటి మతోన్మాద ప్రభుత్వం దాడిచేసినా వెరవని ధీశాలి ఆయన. దాడి చేసింది ప్రభుత్వమైనా, దాని పరివారమైనా ఎదుర్కొని నిలిచి గెలిచిన వ్యక్తి. అంతే కాదు, కారల్‌మార్క్స్ ఎట్లా సైంటిస్టో, ఆయన ప్రతిపాదనలు ఏవిధంగా శాస్త్రీయమైనవో జీవితకాలం నిరూపిస్తూనే బతికాడు. ఆయన మరణం దేశానికి తీరని లోటు.

భారతదేశం ఆర్థిక స్వావలంబన సాధించాలనీ, శాస్త్ర సాంకేతిక రంగాలలో అగ్రరాజ్యాల సరసన చేరాలనీ కలలు కనడమే కాదు, వాటి సాకారానికి కడవరకూ అలుపెరగక శ్రమించాడాయన. మూఢనమ్మకాల నిర్మూలనకూ, శాస్త్రీయ భావాల వ్యాప్తికీ విశేషంగా కృషి చేశాడు. హైదరాబాద్‌లో 'సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ)' వ్యవస్థాపకులుగా ఆయన శాస్త్ర ప్రపంచానికి సుపరిచితులు. రాజస్థాన్‌లోని ఆజ్మీర్‌లో పుట్టి, వారణాసి, అలహాబాద్, లక్నోల్లో చదివీ, హైదరాబాద్‌లో స్థిరపడి పరిశోధకుడిగా, ప్రగతి శీలుడిగా, గణతికెక్కిన ప్రజ్ఞాశాలి ఆయన. శాస్త్రీయ రంగంలో భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటిన స్రష్ట. అమెరికాలో 'యూని వర్సిటీ ఆఫ్ విన్ కానిసన్, మెడిసన్'లో ప్రముఖ శాస్త్రవేత్త హెడల్ బర్గర్‌తో కలిసి విస్తృతమైన పరిశోధనలు చేశాడు. లండన్‌లోని 'నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మెడికల్ రీసెర్చ్'లో అద్భుత ప్రయోగాలు చేసి అంతర్జాతీయ ప్రసిద్ధినొందాడు. కణజీవి శాస్త్రవేత్తగా ఆయన పరిశోధనలు అజరామరం. అందుకే ఆయనను 1986లో పద్మభూషణ్ వరించింది.

సుదీర్ఘమైన సృజనాత్మక జీవితంలో వెలుగు నీడలు, వైవిధ్యాలు, వైరుధ్యాలు అత్యంత సహజం. ఇందుకు పి.ఎం. భార్గవ జీవితం భిన్నమేమీకాదు. 'నేషనల్ నాలెడ్జ్ కమిషన్' వైస్ ఛైర్మన్‌గా, 'నేషనల్ సెక్యూరిటీ అడ్వైజరీ బోర్డు' సభ్యునిగా, సుప్రీంకోర్టు 'జెనెటిక్ ఇంజనీరింగ్ అప్రైజల్ కమిటీ" నామినీగా ప్రభుత్వంతో కలసి పనిచేసినా, ప్రజా ప్రయోజనాలకు భంగం కలిగినప్పుడు నిర్భయంగా నిలదీశాడు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో జ్ఞానాన్ని వృద్ధి చేయడానికే కాదు, కాపాడడానికీ ఆయన తపించారు. అందుకోసం పెట్టుబడిదారుల కోసం ప్రభుత్వాలు పెంచి పోషించే జ్ఞానాన్నీ, గుత్త పెట్టుబడిదారుల కోశాగారాలను నింపేందుకూ, అగ్ర రాజ్యాల గుత్తాధిపత్యానికీ దోహదం చేసే జ్ఞానాన్నీ నిరసించాడు. వ్యవస్థ చలన సూత్రాలను తెలిపే జ్ఞానాన్ని వ్యాప్తి చేసేందుకు చివరి వరకు పరితపించాడు. శాస్త్రవేత్తగా, పరిశోధ కుడిగా ఆయనెప్పుడూ ప్రజాపక్షమే. శాస్త్ర సాంకేతిక రంగాల్లో రూపొందించిన పలు విధానాల్లో తనదైన ముద్ర వేసిన ఆయనే నేడు దేశంలో పెల్లుబుకు తున్న అసహనానికి నిరసనగా తన



శాస్త్ర సాంకేతిక రంగాల్లో జ్ఞానాన్ని వృద్ధి చేయడానికే కాదు, కాపాడడానికీ ఆయన తపించారు. అందుకోసం పెట్టుబడిదారుల కోసం ప్రభుత్వాలు పెంచి పోషించే జ్ఞానాన్నీ, గుత్త పెట్టుబడిదారుల కోశాగారాలను నింపేందుకూ, అగ్రరాజ్యాల గుత్తాధిపత్యానికీ దోహదం చేసే జ్ఞానాన్నీ నిరసించాడు. వ్యవస్థ చలన సూత్రాలను తెలిపే జ్ఞానాన్ని వ్యాప్తి చేసేందుకు చివరి వరకు పరితపించాడు.

★

పద్మభూషణ్ తిరిగి ఇచ్చేశారు. ఇది ప్రజల పట్ల ఆయన నిబద్ధతకు నిదర్శనం. అందుకే ఆయనను ప్రభుత్వాలు విస్మరించినా ప్రజలు గుండెల్లో నిలుపుకున్నారు.

పి.ఎం. భార్గవగా పిలువబడే ఆయన పూర్తిపేరు పుష్పమిత్ర భార్గవ. విస్తృత అధ్యయనం, సునిశితమైన శాస్త్రీయ దృక్పథం, బలమైన వాదనాపటిమ ఆయనను విశిష్ట వ్యక్తిగా, ప్రజల మనిషిగా తీర్చిదిద్దాయి. నిష్కళంకమైన, నిరాడంబరమైన జీవితం ఆయనకు ఆభరణంగా నిలిచింది. తనను తాను అతి సామాన్యుడిగా చెప్పుకునే అసామాన్యుడతను. అందుకే ఆయనను పద్మభూషణ్ వరించి నప్పుడు అది ఎంత అత్యంత సహజమైన విషయంగా అనిపించిందో, ఆ పద్మభూషణ్ తిరిగిచ్చినప్పుడు కూడా అంతే సహజ విషయంగా అనిపించింది. అది భార్గవ నిరాడంబర జీవనశైలి ప్రభావం. అది ఆయన శాస్త్ర జగత్తుపై వేసిన సమ్మోహన ముద్ర. తాను కోట్లాది మంది ప్రజలలో ఒకడినే తప్ప, తానో ప్రఖ్యాత వ్యక్తిని కాదని నమ్ముతారు. శిఖర సమానమైన వ్యక్తిత్వానికి ప్రతీక ఆయన. పరిశోధనా రంగంలో ప్రజల కోసం నిలబడినవాడు... ప్రజా సైన్సు ఉద్యమాలకు ఆలంబనగా నిలిచిన వాడు... మార్క్సిస్టు భావజాలపు విస్తృతినీ, సృజనాత్మక అన్వయత్వాన్నీ సంపూర్ణంగా అర్థం చేసుకుని తన జీవితానికి అన్వయించుకుని ఆచరించినవాడు. ప్రజల కొరకు ప్రజల తరఫున సాగిన తొంభయ్యేళ్ల శాస్త్రీయ ప్రయాణమతడు. అందుకే ఆయన ధన్యజీవి... చిరంజీవి.

★

'మాంసం - పాలు ఒకటే'

డా॥ చందనా చక్రవర్తి

గోవధను వ్యతిరేకిస్తూ 1966లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ భారీ ఉద్యమాన్ని నిర్వహించింది. గోవధపై దేశవ్యాప్తంగా పూర్తి నిషేధం విధించాలని డిమాండ్ చేస్తూ ప్రారంభించిన ఈ ఉద్యమం... ఢిల్లీలో పార్లమెంట్ భవనం లోకి చొచ్చుకెళ్లేందుకు సాధువులు చేసిన ప్రయత్నంతో ముగిసింది. ఆ సమయంలోనే గోవధ నిషేధం కోరుతూ పూరీ శంకరాచార్య ఆమరణ నిరశనకు పూనుకున్నారు. దీనితో ప్రజల్లో వెల్లువెత్తిన ఆగ్రహావేశాల నేపథ్యంలో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితిని అదుపు చేసేందుకు హైదరాబాద్‌లో 48 గంటల కర్ఫ్యూ విధించారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌కు చెందిన రీజినల్ రీసెర్చ్ లేబరేటరీ ఆధ్వర్యంలో గోవధ నిషేధంపై బహిరంగ చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు.


ఈ కార్యక్రమానికి సిసిఎంబి వ్యవస్థాపకుడు డా॥ పుష్ప భార్గవ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ వైద్యుడు డా॥ పి. రామచందర్ మాట్లాడుతూ 'మనం ఆవుల్ని తినకపోతే అవి మనల్ని తింటా'యంటూ చేసిన వ్యాఖ్యలు మరుసటి రోజు పత్రికల్లో పతాక శీర్షికల్లో దర్శనమిచ్చాయి. దీనిపై గోవధ వ్యతిరేకుల నుండి ఆయనకు తీవ్ర బెదిరింపులు కూడా వచ్చాయి. అసలు ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఒక ప్రయోగశాలలో ఇటువంటి సమావేశం ఎలా నిర్వహిస్తారంటూ అనేకమంది నిలదీశారు. ఆ తరువాత ఈ అంశాన్ని పరిశీలించేందుకు మాజీ ప్రధాన న్యాయమూర్తి సర్కార్ నేతృత్వంలో భారత ప్రభుత్వం ఒక ఉన్నతాధికార కమిటీని నియమించింది. ఆరెస్సెస్ అధినేత గురు గోల్వాల్కర్, పూరీ శంకరాచార్య, శ్వేత విప్లవ పితామహుడు వర్ఘీస్ కురియన్, కేంద్ర ఆహార సాంకేతిక పరిశోధనా సంస్థ డైరెక్టర్ హెచ్ఎబి పార్పియా ఈ కమిటీలో సభ్యులుగా నియమితులయ్యారు. ఈ అంశంపై వివరణ ఇవ్వాలని కోరుతూ డా॥ భార్గవను ఈ కమిటీ ఢిల్లీకి ఆహ్వానించింది.

కమిటీ ముందు హాజరయ్యేందుకు భార్గవ ఢిల్లీ చేరుకున్న సమయంలో అక్కడి నిరీక్షణ గదిలో వున్న ఒక వ్యక్తి ఆయనపై గోవధకు సంబంధించిన ప్రశ్నలు సంధించాడు. 'మీరు బ్రాహ్మణులు కదా? మీరు మాంసం తింటారా? అయితే ఆవు మాంసం ఎందుకు తినలేదు? శరీరం మాంసాన్ని ఎలా తయారు చేస్తుంది?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు. ఈ ప్రశ్నల పరంపరకు తెర దించుతూ డా॥ భార్గవ... ఆ వ్యక్తికి శరీర ప్రాథమిక నిర్మాణ క్రమాన్ని వివరించారు. మనం ప్రోటీన్లున్న ఆహారాన్ని తీసుకుంటామని, అవి మన జీర్ణాశయంలో అమైనో ఆమ్లాలుగా మారి రక్తంలో కలిసిపోతాయని, అవి తిరిగి ప్రోటీన్లుగా మారతాయని చెప్పారు. అయితే పాలు ఎలా తయారవుతాయన్న ఆ వ్యక్తి ప్రశ్నకు డా॥ భార్గవ బదులిస్తూ పాలు కూడా ఇదే విధంగా తయారవుతాయన్నారు. 'అయితే మీరు మాంసం తినటానికి బదులు పాలు ఎందుకు తాగటం లేదు?' అంటూ ప్రశ్నించాడు. దీనికి భార్గవ సమాధానం చెప్తూ 'పాలు, మాంసం ఒకేలా తయారైనప్పుడు మీరు పాలు తాగినట్టుగానే మాంసం ఎందుకు తినరు?' అని ప్రశ్నించారు. ఈ కొద్దిపాటి వాగ్వాదం... కమిటీ ముందు ఆయన వినిపించే వాదనకు ఆధారంగా నిలిచింది.

కమిటీ సభ్యుడైన గురు గోల్వాల్కర్ కూడా భార్గవను ఇదే తరహాలో ప్రశ్నలడిగారు. ఈ ప్రశ్నలకు డా॥ భార్గవ ఇచ్చిన సమాధానాలతో గోల్వాల్కర్ తీవ్ర అసహనానికి లోనయ్యారు. ఆయనను శాంతింపచేసేందుకు కమిటీ అధ్యక్షుడైన ప్రధాన న్యాయమూర్తి సర్కార్, శంకరాచార్య తీవ్రంగా ప్రయత్నించాల్సి వచ్చింది. భార్గవ బయటకు వచ్చిన తరువాత 'వెళ్లే ముందు తనను కలవాలంటూ' సర్కార్ ఆయనకు ఒక చీటీ పంపారు. జస్టిస్ సర్కార్ ఆయనను అభినందిస్తూ అంతకు ముందు ...కమిటీ ముందుకు వచ్చిన ఒక సంస్కృత ప్రొఫెసర్ పురాతన భారతీయ సాహిత్యంలోని అంశాలను ప్రస్తావిస్తూ తమకు మాంసాహార ప్రయోజనాలను వివరించారని చెప్పారు. ఇది జరిగిన కొన్నేళ్ల తరువాత శరీర ధర్మశాస్త్రంపై సమాచారాన్ని సేకరించిన డా॥ భార్గవ, ఆయన మిత్రుడు 'చరక సంహిత'లోని ఒక అంశాన్ని పరిశీలించి నిశ్చేష్టులయ్యారు. మనుషులకు సంబంధించిన అనేక శారీరక రుగ్మతలకు ఆవు మాంసం మంచి ఔషధంగా పనిచేస్తుందని ఆ గ్రంథంలో వుంది! ఈ విధంగా ఆర్ఎస్ఎస్ తన రాజకీయ ప్రయోజనాల కోసం ఆవును ఉపయోగించుకుని భావోద్వేగాలను రెచ్చగొడుతున్నప్పుడు భార్గవ శాస్త్రీయ వివరణలతో వాస్తవాలను ప్రజలకు వెల్లడించారు.

(వ్యాస రచయిత సిసిఎంబిలో బయాలజిస్ట్‌గా పనిచేస్తున్నారు)

ప్రభుత్వానికి పట్టని గిరిజన ఆరోగ్యం



టి.కామేశ్వరరావు

వైద్యరంగం

విశాఖ ఏజెన్సీలో ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాదీ వ్యాధులు చుట్టుముట్టాయి. మలేరియా, డయేరియా, రక్తహీనత, ఆంత్రాక్స్ వంటి ప్రాణాంతక వ్యాధులతో సహ వైరల్ జ్వరాలు గిరిజనులను పట్టి పీడిస్తూ ప్రాణాలు తీస్తున్నాయి. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనుల జీవితాల్లో మాత్రం ఏ మార్పూ లేదు. రహదారి సౌకర్యం లేక 50 కిలోమీటర్ల నుంచి కాలినడకన గిరిజనులు ఆస్పత్రులకు రావాల్సిన దుస్థితి కొనసాగుతోంది. అడవుల్లో రోగిని డోలీ కట్టుకొని తీసుకొస్తున్నారు. తాగడానికి మంచినీటి సదుపాయం లేదు. ఆస్పత్రికి వచ్చే రోగి, వారి సహాయ కులకు భోజనం పెట్టడంలేదు. మలేరియాతో బాధ పడుతున్న రోగి త్వరగా కోలుకోవాలంటే పోషకాహారం అవసరమన్న స్పృహ ప్రభుత్వానికి లేదు. హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు కేటాయించిన మెనూ బడ్జెట్ పిల్లల తిండికి సరిపడా లేదు. గజ్జి, తామరతో విద్యార్థులు బాధపడుతున్నారు. చదవడానికి హాస్టళ్లకొచ్చిన విద్యార్థులకు గజ్జి, తామర పెద్ద సమస్యగా మారింది. గిరిజనుల పట్ల కనీస మానవతను ప్రభుత్వం ప్రదర్శించడం లేదు. ప్రభుత్వం గిరిజనులను మనుషులుగా చూడ్డంలేదు. అలా చూసుంటే రహదారి, తాగునీటి సదుపాయాలు కల్పించేది. ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులను మౌలిక సదుపాయాల కల్పనకు దారి మళ్లించ కుండా సక్రమంగా ఖర్చు చేసేది. వైద్య సదుపాయాలు, మౌలిక సదుపాయాలు అంతంత మాత్రంగానే ఉండడం తో గిరిజనులు రోజువారీ జీవితంలో అనేక అవస్థలు పడుతున్నారు. ఏజెన్సీలో వ్యాధులు, మరణాల తీవ్రతను తక్కువ చేసి చూపడం, పూర్తిగా చూపకపోవడం వంటివి జరుగుతున్నాయి. ఇప్పటి వరకు మలేరియా, టైఫాయిడ్, విష జ్వరాలతో 41 మంది మరణించారు. ప్రభుత్వ యంత్రాంగం వ్యాధులతో గిరిజనులు మరణించినట్లుగా ఎక్కడా నమోదు చేయలేదు. జి.మాడుగుల సర్పంచ్ మత్స్యరాజు కొద్దిరోజులపాటు జ్వరంతో బాధపడి మృతి చెందాడు. ఇటువంటి మరణాలు ముంచంగి పుట్, జికె వీధి, చింతపల్లి, జి.మాడుగుల మండలాల్లో ఎక్కువ చోటుచేసుకున్నాయి.

వ్యాధుల శాశ్వత నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోని ఫలితంగా గిరిజనులకు ఇదొక శాపంగా మారింది. పోలియో నివారణకు తీసుకున్న చర్యలు గిరిజన ప్రాంతంలో మలేరియా నియంత్రణకు ఎందుకు తీసుకోవడం లేదు? వేలాది మంది తాగునీటి సదుపాయం లేక ప్రతి యేటా కలుషిత నీరు తాగి మరణిస్తున్నప్పటికీ తాగునీటి సౌకర్యం ఎందుకు కల్పించడం లేదు? తెలుగుదేశం పార్టీ తన ఎన్నికల వాగ్దానంలో రాష్ట్రం లోని ప్రతి కుటుంబానికి 2 రూపాయలకు 20 లీటర్ల మినరల్ వాటర్ సరఫరా చేస్తామని ప్రకటించింది. ఈ మినరల్ నీళ్లకు గిరిజనులు అర్హులు కారా? మినరల్ నీరివ్వలేకపోతే కనీసం రక్షిత మంచి నీటి సదుపాయమైనా కల్పించకపోవడం విచారకరం. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఉద్దానం బాధితుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన వెంటనే కిడ్నీ వ్యాధుల మూలాలు కనుగొనేందుకు రీసెర్చ్ సెంటర్, అందరికీ ఆక్వా గార్డులు ఉచితంగా అందజేస్తామని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఆరు లక్షల 50 వేల మంది జనాభా కల్గిన విశాఖ ఏజెన్సీలో, తరుచూ వ్యాధుల బారినపడుతూ ప్రాణాలు కోల్పోతున్న ఏజెన్సీలో వ్యాధుల మూలాలు కనుక్కొని, నివారించేందుకు ప్రత్యేక రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎంతో కాలంగా వున్నప్పటికీ చంద్రబాబు ఎందుకు వెనుకడుగు వేస్తున్నారు? రాజకీయంగా తనకు ప్రయోజనం లేదని భావించి ఏజెన్సీ ప్రాంతాన్ని చంద్రబాబు ప్రభుత్వం విస్మరిస్తున్నట్లు కనబడు తోంది. బాక్సైట్ తవ్వకాలను వ్యతిరేకించిన గిరిజనులపై కక్ష సాధింపు చర్యగా ఏ మౌలిక సదుపాయాలూ చంద్రబాబు ప్రభుత్వం కల్పించడంలేదని ప్రజలు భావిస్తున్నారు. ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతంలో ప్రబలిన వివిధ వ్యాధుల నివారణకు తగిన చర్యలు తీసుకోకపోవడంతో ప్రజారోగ్య వేదిక, గిరిజన సంఘం, శారద ట్రస్టు, అల్లూరి సీతారామ రాజు విజ్ఞాన కేంద్రం, జెవివి, ఎపి ఎంఎస్ఆర్‌యు సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించింది. రవాణా, ఆరోగ్య సదుపాయం లేని మారుమూల ఆవాసాలకు వెళ్లి గిరిజనుల కు వైద్యసేవలు అందించాయి. వైద్యులు స్వచ్ఛందంగా తమ సేవలందించారు. జులై 20 నుంచి 30 వరకు నిర్వహించిన 30 వైద్య శిబిరాలను 5 వేల మంది గిరిజనులు ఉపయోగించుకున్నారు. వైద్య శిబిరాలకు వచ్చిన రోగులకు వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా రూ. 8 లక్షల విలువైన మందులు పంపిణీ చేశాయి. ఈ శిబిరాలకు వచ్చే రోగులను పరీక్షిస్తే అత్యధిక భాగం జ్వరాలు, రక్తహీనత, చర్మవ్యాధులు, ఉదరకోశ వ్యాధులు, కంటి జబ్బులు, కీళ్ల-ఒంటినొప్పులతో బాధ పడుతున్న రోగుల సంఖ్య ఎక్కువగా వుంది.



విశాఖ ఏజెన్సీలో 11 మండలాల్లో 3,500 గ్రామాల్లో ఆరు లక్షల 50 వేల జనాభా వుంది. ఈ గ్రామాల్లో 2,500 మలేరియా సోకే హైరిస్క్ గ్రామాలుగా ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఈ ప్రాంతాల్లో మలేరియా నివారణకు మాత్రం తగిన చర్యలు తీసుకోలేదు. తొలి విడతలో మార్చి నుంచి మలాథియన్ స్ప్రే చేయాలి. గిరిజనుల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలి. రెండో విడత స్ప్రేయింగ్ మేలో చేయాలి. దోమ తెరలు సరఫరా చేయాలి. కానీ ఇవేవీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో చేపట్టలేదు. ఏజెన్సీలో రెండు ఏరియా ఆస్పత్రులు, రెండు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 36 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 204 సబ్ సెంటర్లు ఉన్నాయి. ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది నియామకం చేపట్టకపోవడంతో బోసిగా దర్శనమిస్తున్నాయి. దీంతో గిరిజనులకు సరైన వైద్యం అందని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం 24 గంటలు సేవలందించేలా 36 పిహెచ్‌సిలను అప్‌గ్రేడ్‌చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ పది పిహెచ్‌సిల్లో 24 గంటల ఆస్పత్రులుగా గుర్తించారు. కానీ దీనికి తగ్గట్టు వైద్యులు, సిబ్బందిని నియమించలేదు. 30-40 కిలోమీటర్ల నుంచి వచ్చే రోగులు, వారి సహాయ కులకు భోజన సౌకర్యం కల్పించడంలేదు. ప్రస్తుతం మలేరియా మందు క్లోరోక్విన్ అందుబాటులో లేదు. పాడేరు వందల పడకల ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా తీర్చిదిద్దుతామని ప్రకటించింది. కానీ ఈ ఆస్పత్రిలో ఇప్పటికీ 75 పడకలతో నడుస్తోంది. స్పెషలిస్టు వైద్యుల నియామకం చేయలేదు. ఏజెన్సీలో కాంట్రాక్టు పద్ధతిపై పనిచేసే వైద్యులకు నెలకు రెండున్నర లక్షల రూపాయల జీతం చెల్లిస్తామని ప్రకటించిన ప్రభుత్వం, ఆర్నెల్లుగా కాంట్రాక్టు వైద్యులకు జీతాలు చెల్లించలేదు. స్పెషల్ హెచ్ఆర్ఏను కూడా ఇవ్వడం లేదు. దీంతో ప్రభుత్వం పట్ల నమ్మకం పోవడంతో వైద్యులు కూడా పనిచేసేందుకు ముందుకు రావడంలేదు. మలేరియా తీవ్రతను తక్కువ చేసి చూపేందుకు హెల్త్ అసిస్టెంట్లకు ఇవ్వాల్సిన మలేరియా కిట్లు కూడా అవసరం మేరకు సరఫరా చేయడం లేదు. వైద్యుల వాహనాలకు నెలకు ఏడు వేల రూపాయలకు మించి అలవెన్స్ చెల్లించకపోవడంతో వైద్యులు ఆ మేరకు వైద్య సేవలందిస్తున్నారు.

చేపట్టాల్సిన తక్షణ చర్యలు

★ ఏజెన్సీలోని ప్రభుత్వాస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు పెంచాలి. వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్ ఖాళీలను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయాలి. జీతాలు సక్రమంగా చెల్లించాలి. ★ అన్ని గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపర్చాలి. అంబులెన్స్ వ్యవస్థను బలోపేతం చేయాలి. కమ్యూనికేషన్ వ్యవస్థను అభివృద్ధి చేయాలి. ★ పిహెచ్‌సిల సంఖ్యను పెంచాలి. ఆస్పత్రులకు వచ్చే రోగులు, వారి సహాయకులకు భోజనం పెట్టాలి. ★ గిరిజనులకు పోషకాహారం అందించేం దుకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా కందిపప్పు, బెల్లం, మినప పప్పు, గోధుమలు, ఉచితంగా అందించాలి.

వ్యాస రచయిత, ప్రజారోగ్యవేదిక రాష్ట్ర నాయకులు



'పాడుదమా... స్వేచ్ఛా గీతం.. ఎగరేయుదమా... జాతి పతాకం...' ఇప్పటికీ ఈ పాట ఎక్కడో అక్కడ.. డప్పుచప్పుళ్ళ సాక్షిగా మారుమోగుతూనే ఉంటుంది. నిజానికి ఈ పాట పుట్టి దశాబ్దాలు గడిచినా.. ఇప్పుడే పుట్టిన నవచైతన్య గీతంలా ప్రజాకళాకారుల గళాల్లో ఒదిగిపోతూనే ఉంది. అలా తన 'స్వేచ్ఛాగీతం'తో ఉత్తరాంధ్రాలోనే కాదు.. యావత్ భారతావనీ నినదించేలా.. కీర్తిగడించారు ఈ స్కూల్ మాష్టారు. అతడే ప్రజాకవి గంటేడ గౌరునాయుడు మాష్టారు. చిన్నప్పుడు ఓ నాటకంలో వేషం వేయనివ్వలేదని.. తండ్రిమీద కోపం పెంచుకుని.. తానే ఓ నాటకం రాసేసి.. రచయితగా మారిన కుర్రాడు.. ఆ తర్వాత కాలంలో పిల్లలకు పాఠాలు చెప్పే మాష్టారయ్యారు. పాటలతోనే పాఠ్యాంశాలు బోధించారు. ఆనక ప్రగతిశీల భావాలున్న గేయరచయితగా, కవిగా.. ఉత్తరాంధ్ర కళా, సాహిత్య రంగాన తనకంటూ ప్రత్యేకత నిలుపున్నారు. రాసేది కథైనా, కవితైనా, పాటైనా.. సాహిత్య ప్రక్రియ ఏదైనా.. అది ప్రజాపక్షమే అంటూ సాగిపోయే గంటేడ సాహిత్య 'జీవన' గమనం.. ఆయన మాటల్లోనే..

ఓ మాష్టారి స్వేచ్ఛాగీతం

మాది కొమరాడ మండలం దలాయిపేట అనే ఓ చిన్న కుగ్రామం. తల్లిదండ్రులు సత్యనారాయణ, సోములమ్మలకు నేను మొదటి సంతానం. నాకు ఇద్దరు తమ్ముళ్లు, ముగ్గురు చెల్లెళ్లు. నాన్న ఓ కళాకారుడు. నాటకాలు వేయడంతో పాటు గాయకుడిగానూ, చిత్రకారుడిగానూ ఎంతో కృషి చేశారు. చిన్నతనంలో మా ఇల్లంతా హార్మోనియం, వేణు వాయిద్యాలు, నాన్న పాడే పాటలతో కళకళలాడేది. అందుకేనేమో బాల్యం నుంచీ నాకు పాటలు పాడడం, బొమ్మలు వేయడం ఇష్టంగా మారింది.

నాన్నపై కోపంతో

"నా అక్షరాభాస్యం స్వగ్రామమైన దలాయిపేటలోనే జరిగింది. ఐదో తరగతి వరకూ అక్కడే చదువుకున్నాను. ఆరో తరగతిలో కొమరాడ మండలం కోటిపాం హైస్కూల్లో చేరా. ప్రాథమిక విద్య నుంచే బాలల పుస్తకాలు చదివేవాడిని. ఎనిమిదో తరగతిలో గ్రంథాలయానికి వెళ్లి, పుస్తకాలు చదవడం ప్రారంభించాను. ఒకసారి మా నాన్న నేను నాటకంలో వేషం వేస్తానంటే.. నాకు అవకాశం కల్పించలేదు. ఆ కోపంతో నేనే సొంతంగా 'గురు-శిష్యులు' అనే నాటకం రాసి, మా నాన్న నాటకానికి ముందే నా స్నేహితులతో ప్రదర్శించాం. అప్పట్లో అది ఎంతో ఆదరణ పొందింది. అలా నా మొదటి రచన ఎనిమిదో తరగతిలోనే మొదలైంది.

అజ్ఞాత వ్యక్తే .. ప్రేరణ

ఒకరోజు మా బడిలో ఒక అజ్ఞాతవ్యక్తి ఫిరదౌసి ఏకపాత్రాభినయం చేశాడు. అప్పుడే నాలోని కవికి ప్రేరణ కలిగింది. ఆ స్ఫూర్తితో 'పారిపోయిన బఠానీ' అనే ఓ చిన్న నవల రాశాను. అది నాకు ఎంతో గుర్తింపు తీసుకొచ్చింది. చిన్నతనంలో ఓ విద్యార్థి ఇంటి నుంచి పారిపోయి అక్కడ పడుతున్న బాధలే ఆ నవల సారాంశం. అలా అడపాదడపా నా రచనలు సాగిపోయేవి. పదో తరగతికి వచ్చేసరికి తెలుగు ఛందస్సు, వ్యాకరణం, భాష, సాహిత్యం పట్ల కొంత పట్టు సాధించాను. నా సీనియర్‌గా ఉన్న ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు నా తొలి పాఠకుడు.. విమర్శకుడు. ఇలా సాగుతున్న సమయంలో ఇంటర్ పరీక్ష తప్పి, మా ఊరుకు వెళ్లిపోవాల్సి వచ్చింది. దాంతో వ్యవసాయ పనులు చేస్తూ రాత్రిళ్ల భజనలు, పాటలే నా సర్వస్వంగా మారింది.

పాడితే.. ఊరొదిలి పొమ్మన్నారు

అవి కామ్రేడ్ వెంపడాం సత్యం, ఆదిభట్ల కైలాశంను పోలీసులు కాల్చి చంపేసిన రోజులు. అప్పుడే నాకు విప్లవకారుల పట్ల ఆసక్తి కలిగింది. ఊరిలో జరుగుతున్న దోపిడీలను పాటల ద్వారా నిలదీసేవాడిని. పాటల ద్వారానే పాలేరు వ్యవస్థను వ్యతిరేకించాను. రాత్రి బడులపై పాటలు పాడాను. మొదట నాకు నా ఇంటి నుంచే ప్రతిఘటన మొదలైంది. పంచాయితీ ఎన్నికలపై నేను పాడిన పాట నన్ను ఊరు నుంచి తరిమేసేలా చేసింది. దీంతో నాన్న కంగారుపడి, నన్ను ఎలాగైనా మళ్లీ చదువుకు పంపాలని నిర్ణయించుకున్నాడు. మళ్లీ చదువు కోసం కాలేజీలో చేరినా పాటలు, రచనలు మాత్రం వదల్లేదు.

పాటతోనే.. పాఠం

తెలుగు పండిట్‌గా 1978లో ఉద్యోగం వచ్చింది. నా తొలి పోస్టింగ్‌లో భాగంగా రేగిడి ఆశ్రమ పాఠశాలలో చేరాను. రావాడ రామభద్రపురం, గుమ్మలక్ష్మీపురం మండలం టిక్కబాయి, మళ్లీ రామభద్రపురంలో పనిచేసి, రేగిడి తోణాంలో రిటైరయ్యాను. పాటలతోనే తరగతిగదిలో నా విద్యాబోధన సాగేది. అక్షర విజయం కార్యక్రమంపై అనేక పాటలు రాసి, పాడాను. నా స్నేహితుడు అట్టాడ అప్పలనాయుడు, ఐటిడిఎ అధికారి, సాహితీవేత్త చినవీరభద్రుడు నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. నా తొలి కవిత నాగావళి పత్రికలో అచ్చయింది. దానికి నా స్నేహితుడు అప్పలనాయుడు ఎడిటర్‌గా ఉన్నాడు. 'రేపటి ఉదయం కోసం' కథ రేడియోలో ప్రసారమైంది. 'విముక్తి' అనే కథ ఆంధ్రజ్యోతిలో అచ్చయింది. ఆ కథను కాశీపట్నం రామారావు చదివి, నన్ను ప్రశంసించారు. అలా మొదలైన నా రచనలు నేటికీ కొనసాగుతున్నాయి.

ఉత్తరాంధ్ర యాస ప్రత్యేకత

నా రచనల్లో ఉత్తరాంధ్ర యాస ప్రత్యేకంగా కనిపిస్తుంది. గ్రామీణ ప్రాంతంలో జనం పడుతున్న బాధలైనా, వ్యవసాయ నేపథ్యంలో రచనలైనా, పాటలైనా ఏవైనా సొంత యాసలోనే రాశాను. ఏటిపాక (16 కథలు), ఒక రాత్రి రెండు స్వప్నాలు (13 కథలు) అనే కథా సంకలనాలకు తెలుగు విశ్వ విద్యాలయం పురస్కారాలు లభించాయి. 'నదిని దానం చేశాడు, ఎగిరిపోతున్న పిట్టల కోసం' అనే రెండు కవితా సంకలనాలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. నాగేటి శాలుకు నమస్కారం, నాగలి, కళింగోరు పుస్తకాలను రాశా. పాడుదుమా స్వేచ్ఛా గీతం (50 పాటలు), గీతాంజలి పాటలు, ప్రియభారతి జనని పుస్తకం ఇలా.. చైతన్యపూరితమైన రచనలు ఇప్పటికీ నా జీవితంలో ఒక భాగం.

ప్రశంసలు.. పురస్కారాలు

గురజాడ పురస్కారాన్ని 2012లో అప్పటి ముఖ్యమంత్రి నుంచి అందుకున్నాను. అలాగే చాసో పురస్కారం, ఉత్తరాంధ్ర రావిశాస్త్రి రచనా పురస్కారం, పులిపండ అప్పలస్వామి స్మారక అవార్డు, ఆవంత్స సోమసుందరం పురస్కారం... ఇలా పలు పురస్కారాలు నాకు దక్కాయి.





సామాజిక బాధ్యతే ముఖ్యం

రానురానూ.. సాహిత్యంలో అధ్యయనం తగ్గిపోతుంది. సమాజాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, అర్థం చేసుకున్నప్పుడే మంచి సాహిత్యం పుడుతుంది. వ్యక్తిగత లాభం కన్నా, సమాజ శ్రేయస్సే ప్రధానంగా నేటితరం రచయితలు ఎదగాలి.

- గంటేడ గౌరినాయుడు
ఫోన్ నెం : 9441415182

నా పాట.. ప్రజానాట్యమండలి నోట

ప్రతి స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమానికీ ఒక కొత్తపాట పాడేవాడిని. రేగిడిలో పనిచేస్తున్న సమయంలో జెండా పండగకు 'పాడుదమా స్వేచ్ఛాగీతం' పాట రాశాను. అప్పటి జిల్లా కలెక్టర్ విజయకుమార్ ఈ పాటను అక్షర విజయం కార్యక్రమానికి ప్రారంభ గీతంగా ప్రకటించారు. ఆ తర్వాత ప్రజానాట్యమండలి ఈ పాటను పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. జయప్రకాశ్ నారాయణ తన పార్టీ కార్యక్రమానికి ప్రారంభ గీతంగా పాడించి, రికార్డు చేయించారు. ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భావంలో చిరంజీవి ఈ పాటను మార్పు చేసుకుంటామని అడిగారు. కానీ నేను ఒప్పుకోలేదు. మహమ్మద్ మియా, రామనాథం వంటి గొప్ప గాయకులు ఈ పాట తరుచూ పాడేవారు. ప్రస్తుతం కర్ణాటకలో ఈ పాటను అనువదించి, పాడుతున్నట్లు తెలిసింది. ఇలా లక్షలాది మంది ఈ పాటను పాడారు. రికార్డు చేశారు. అందుకే ఈ పాట దేశం నలుమూలల కీర్తిని సంపాదించింది. ఇది నాకు ఎంతో ఆనందాన్నిచ్చింది.





- వి.నాగరాజు,
విజయనగరం

చుండ్రు తగ్గాలంటే...?

తగ్గినట్టే తగ్గి ఎప్పటికప్పుడు వేధించే సమస్యల్లో చుండ్రు ఒకటి. ఇది అనేక కారణాల వల్ల వస్తుంది. దీంతో తలపై ఉన్న చర్మం పొట్టుగా మారి రాలుతుంది. ఒత్తిడి, మానసిక ఆందోళన, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు, పోషణ లోపం వంటి అనేక కారణాలు చుండ్రు రావడానికి కారణమవుతాయి. అయితే కొన్ని సూచనల ద్వారా చుండ్రు సమస్యని నివారించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

✧ కొబ్బరినూనె, వేప నూనెలను ఉపయోగించి తయారు చేసిన హెయిర్ ఆయిల్‌ను వాడితే మంచిది. దీంతో చుండ్రు పోవడమే కాదు, జుట్టుకు పోషణ అందుతుంది. దీంతో శిరోజాలు దృఢంగా, ఒత్తుగా పెరుగుతాయి. వెంట్రుకలు కాంతివంతంగా మారుతాయి.

✧ కొబ్బరినూనె, ఆముదం సమపాళ్లల్లో తీసుకుని, సన్నని మంటపై వేడి చేయాలి. అనంతరం చల్లారాక ఆ నూనెను వెంట్రుకలకు రాయాలి. ఇలా వారంలో మూడు నాలుగు సార్లు చేస్తే ఫలితం ఉంటుంది.

✧ రాత్రంతా మెంతులను నానబెట్టి తెల్లవారుజామున వాటిని మెత్తని పేస్ట్‌లా రుబ్బాలి. తరువాత ఒక అరగంట పాటు జుట్టుకి దీన్ని బాగా పట్టించి కొంతసేపటి తర్వాత తేలికపాటి షాంపూతో తలస్నానం చేయాలి. ఇలా వారంలో రెండు సార్లు చేస్తే చాలు, చుండ్రు బాధ తప్పుతుంది.

✧ వేప ఆకులను నీటిలో వేసి బాగా మరిగించి చల్లారాక ఆ నీటితో తలను కడిగితే చాలు, చుండ్రు పోతుంది.

✧ కప్పు గోరు వెచ్చని నీటిలో టీ ట్రీ ఆయిల్‌ను ఒక టీస్పూన్ కలపాలి. బాగా కలిపాక ఈ నీటితో జుట్టుకి మర్దనా చేయాలి. అరగంట తరువాత తలస్నానం చేయాలి. దీంతో చుండ్రు బాధించదు.

✧ తులసి ఆకులు, ఉసిరి కాయలను కలిపి పేస్ట్‌లా చేయాలి. ఉసిరికాయ లేకపోతే పొడి వాడవచ్చు. ఆ పేస్ట్‌ను జుట్టుకి పట్టించి మృదువుగా మర్దనా చేయాలి. ఒక గంటసేపు అలానే వదిలేసి, ఆ తర్వాత కడిగేయాలి. దీంతో సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది.

✧ వెనిగర్, నిమ్మ రసాలను సమాన పరిమాణంలో తీసుకుని బాగా కలిపి మిశ్రమంగా చేసి దాన్ని జుట్టుకు మర్దనా చేయాలి. అనంతరం 30 నిమిషాలు ఆగాక తలస్నానం చేయాలి. ఇలా చేస్తే చుండ్రు రాదు.

✧ కలబంద గుజ్జుతో జుట్టుకు మర్దనా చేసి 15 నిమిషాలు అలానే ఉంచిన తర్వాత తలస్నానం చేయాలి. దీంతో చుండ్రు తొలగిపోతుంది. ★



జీవన సౌరభం

భయపడటం ఎప్పుడు మానేస్తామో..
అప్పుడే మన జీవితం మొదలైనట్లు..

మీ కోసం



క్యాబేజీలో ఉండే గ్లుటమైన్ రోగనిరోధకశక్తి పుంజుకోవడానికి తోడ్పడుతుంది. దీన్ని కూరగానో, సలాడ్‌గానో తరచూ తీసుకోవడం అలవాటు చేసుకుంటే మంచిది.

రోజుకు ఒక గుడ్డు తిందాం!

కోడిగుడ్డు ఆరోగ్యానికి మంచిదని అందరికీ తెలుసు. అయితే రోజుకు ఎన్ని గుడ్లు తినాలన్నదే చాలా మందికి కలిగే సందేహం. రోజుకు ఒక గుడ్డు తిన్నా మేలేనని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

✧ కోడిగుడ్ల ద్వారా అనేకరకాల పోషకాలు లభిస్తాయి.

✧ వీటిలో శరీరానికి కావల్సిన శాచురేటెడ్ ఫ్యాట్లు, పాలీ అన్‌శాచురేటెడ్ ఫ్యాట్లు, మోనో అన్‌శాచురేటెడ్ ఫ్యాట్లు, పొటాషియం, విటమిన్ ఎ, క్యాల్షియం, ఐరన్, విటమిన్ డి, విటమిన్ బి6, విటమిన్ బి 12, మెగ్నీషియం వంటి కీలక పోషకాలు ఉంటాయి.

✧ వీటి వలన పలు రకాల అనారోగ్య సమస్యలు తలెత్తవు.

✧ ఒక కోడిగుడ్డును ఉకడబెట్టుకుని పచ్చ సొనతోపాటుగా తింటే రోజుకు ఒక గుడ్డు చాలు. ఎందుకంటే పచ్చసొనను కలిపితే మనకు నిత్యం అందే డైటరీ కొలెస్ట్రాల్‌లో 55 శాతం వరకూ అందుతుంది. కనుక అది మన శరీరానికి మంచి చేస్తుంది.



✧ కాబట్టి రోజుకు ఒక ఉడకబెట్టిన గుడ్డు తినవచ్చు. అయితే ఎక్కువ తినాలనుకుంటే మరో రెండు ఉడకబెట్టిన గుడ్లను తినొచ్చు. కానీ వాటిలో పచ్చసొన తినకూడదు. కేవలం తెల్లనిసొన మాత్రమే తినాలి. దీంతో శరీరంలో కొలెస్ట్రాల్ పెరగకుండా ఉంటుంది.

✧ మధుమేహం ఉన్నవారు వారానికి రెండు గుడ్లను తినవచ్చు. అదీ పచ్చసొనతో కలిపి తినకుండా ఉంటే బెటర్. అయితే ఆరోగ్యవంతులెవరైనా రోజుకు ఒక కోడిగుడ్డును పచ్చనిసొనతో కలిపి నిర్భయంగా తినొచ్చు. ★

సెన్సెక్స్ ▼ 239 — 32,237 | నిఫ్టీ ▼ 68 — 10,013 | రూపాయి ▲ 02 పైసలు — ఒక అమెరికా డాలరుకు రూ. 63.69

కాగ్నిజెంట్‌లో తగ్గిన ఉద్యోగాలు

లాభాల్లో భారీ వృద్ధి

బెంగళూరు : ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ కాగ్నిజెంట్ రెవెన్యూలో 3.5 శాతం వృద్ధి చోటు చేసుకుంది. కాగా కంపెనీలోని ఉద్యోగుల సంఖ్యలో మాత్రం 4,400 మంది తగ్గారు. భారత ఐటి కంపెనీల్లో అత్యధిక ఉద్యోగులు తగ్గింది కాగ్నిజెంట్‌లోనే కావడం గమనార్హం. క్రితం జూన్ ముగింపు నాటికి కాగ్నిజెంట్‌లో మొత్తంగా 2,56,800 పని చేస్తున్నారు. ఇంతక్రితం మార్చి త్రైమాసికం ముగింపు నాటికి ఈ సంఖ్య 2,61,200గా ఉంది. ఈ కాలంలో టాప్ దేశీయ ఐటీ అవుట్‌సోర్స్ కంపెనీల్లో కెల్లా, దీనిలోనే అత్యధికంగా ఉద్యోగుల సంఖ్య పడిపోయింది. కాగ్నిజెంట్ పోటీ కంపెనీలు టిసిఎస్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రాల్లోనూ సిబ్బంది సంఖ్య తగ్గింది. అయితే కాగ్నిజెంట్ స్థాయిలో వీటిలో ఉద్యోగాలు పడిపోలేదు. పొదుపు చర్యలో భాగంగానే సిబ్బందికి కోత పెట్టింది. దీంతో జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ రెవెన్యూ పెంచుకుంది. అదే విధంగా రెవెన్యూ అంచనాలను కూడా 8-10 శాతం నుంచి 9-10 శాతానికి పెంచుకున్నట్లు ఆ కంపెనీ ప్రకటించింది. ప్రస్తుత ఏడాది జూన్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో కాగ్నిజెంట్ నికర లాభాలు 87 శాతం పెరిగి 470 మిలియన్ డాలర్లకు చేరింది. గతేడాది ఇదే త్రైమాసికంలో 252 మిలియన్ల లాభాలు నమోదు చేసుకుంది. రెవెన్యూ 8.9 శాతం పెరిగి 3.67 బిలియన్ డాలర్లకు చేరింది.

రిటైల్ పై మోటారోలా దృష్టి



న్యూఢిల్లీ : వినియోగదారులకు మరింత చేరువయ్యేందుకు మోటారోలా భారత్‌లో ప్రయోగాత్మకంగా రిటైయిల్ స్టోర్స్‌ను అందుబాటులోకి తెస్తున్న ట్లు ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. గురువారం వివిధ ప్రాంతాల్లో తొలి ఆరు స్టోర్లను ప్రారంభించింది. దీంతో ప్రత్యేకమైన ఔట్‌లెట్‌తో కూడిన మోటోహబ్‌లో వినియోగదారులు తమ కంపెనీ ఉత్పత్తులన్నీ ఒకే ప్రాంగణంలో చూసి కొనుగోలు చేసుకోవచ్చని మోటారోలా మొబిలిటీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సుధిన్ మాథూర్ పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి అధిక జనాభా కలిగిన ప్రముఖ 50 పట్టణాల్లో మోటో హబ్స్‌ను అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కొత్త స్టోర్లలో ఎంపిక చేసిన ఉత్పత్తులపై 50 శాతం వరకు రాయితీ అందిస్తున్నామన్నారు.

నిరాశపర్చిన ఐఒసి ఫలితాలు

న్యూఢిల్లీ : ప్రముఖ చమురు రంగ సంస్థ ఇండియన్ అయిల్ కార్పొరేషన్ (ఐఒసి) జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో నిరాశజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. క్రితం క్యూ1లో ఐఒసి నికర లాభం 45శాతం క్షీణించి రూ.8,268.98 కోట్ల నుంచి రూ.4,548.51 కోట్లకు పడిపోయింది. ఇదే సమయంలో కంపెనీ మొత్తం ఆదాయం ఏప్రిల్-జూన్ మాసంలో 20శాతం వృద్ధితో రూ.1,07,670.95 కోట్ల నుంచి రూ.1,29,418.11 కోట్లకు పెరిగింది. ఇక సమీక్ష త్రైమాసికంలో సగటు స్థూల శుద్ధి మార్జిన్ (జిఆర్ఎం) బ్యారెల్‌కి 4.32 డాలర్లుగా ఉండగా. అంతకు క్రితం ఏడాది ఒక బ్యారెల్ 9.98డాలర్లుగా నమోదైంది. దేశీయ ఉత్పత్తి అమ్మకాలు 20.736 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో 20.415 మిలియన్ మెట్రిక్ టన్నుగా ఉంది.

మొండి బాకీలకు త్వరలో పరిష్కారం

- అవసరమైతే క్రిమినల్ చర్యలు
- నిరర్ధక ఆస్తులను పరిష్కరిస్తాం
- త్వరలో 'చిట్‌ఫండ్' చట్టం
- లోక్‌సభలో మంత్రి అరుణ్ జైట్లీ



న్యూఢిల్లీ : బ్యాంకింగ్ రంగంలో పేరుకుపోయిన మొండి బాకీల సమస్య పరిష్కారానికి కేంద్రం వేగంగా చర్యలు చేపడుతోందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. బ్యాంకింగ్ నియంత్రణ (సవరణ) బిల్లు-2017పై గురువారం లోక్‌సభలో జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు అంశాలపై వివరణనిచ్చారు. మొండి బాకీల సంస్కరణల అమలు ప్రక్రియ త్వరలోనే ప్రారంభమవుతుందని తెలిపారు. పారు బాకీల సమస్య పరిష్కార చర్యల్లో భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బిఐ) ఇప్పటికే 12 బడా రుణ ఎగవేత సంస్థలను గుర్తించినట్టుగా తెలిపారు. వివరించారు. మొండి బాకీలు, నిరర్ధక ఆస్తుల విషయంలో బ్యాంకులు, ఆర్‌బిఐకి గల అధికారాలను వివరిస్తూ తీసుకువచ్చిన బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్-1949 స్థానంలో సర్కారు బ్యాంకింగ్ రెగ్యూలేషన్ (ఎమన్డ్‌మెంట్) ఆర్డినెన్స్-2017ను తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. ఈ ఆర్డినెన్స్‌కు లోక్‌సభ మూజువాణి ఓటుతో గురువారం సమ్మతి తెలిపింది దీంతో బ్యాంకింగ్ రెగ్యూలేషన్ (ఎమండ్‌మెంట్) బిల్లు-2017 అందుబాటులోకి వచ్చింది. బ్యాంకుల నుంచి రుణాలను తీసుకొని నిధులను ఇతర అవసరాలకు మళ్లించిన వారిపై క్రిమినల్, రికవరీ చర్యలు తీసుకొనేందుకు గాను ఈ కొత్త చట్టంలో చర్యలు తీసుకోనున్నట్టుగా మంత్రి ప్రకటించారు.

చిట్‌కు ముసాయిదా తయారు..

చిట్‌ఫండ్ సంస్థల మోసాలకు చెక్ పెట్టే దిశగా తమ సర్కారు దృష్టి సారించిందని జైట్లీ తెలిపారు. ఇందులో భాగంగా తమ ప్రభుత్వం ఇప్పటికే ఒక ముసాయిదా బిల్లును రూపొందించినట్టుగా వెల్లడించారు. ఒక్క రాష్ట్రానికే పరిమితం కాకుండా వివిధ రాష్ట్రాలలో కార్యకలాపాలను నిర్వహిస్తున్న చిట్‌ఫండ్ కంపెనీల మోసాలు పెరిగిపోతున్నాయని ఆయన అన్నారు. బహుళ రాష్ట్రాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న సంస్థల మోసాలకు చెక్ చెప్పేలా ఇప్పటికే తమ సర్కారు ఒక ముసాయిదా బిల్లును రూపొందించిందని ఆయన తెలిపారు. త్వరలోనే దీనిని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నట్లుగా జైట్లీ వెల్లడించారు.

పిఎస్‌బిల్లోనే మొండి బాకీలెక్కువ..

కంపెనీలు, ఉద్యోగాలను కాపాడుకోవడంతో పాటు దివాళా కంపెనీలు బ్యాంకులకు బకాయిలను తిరిగి చెల్లించే విధంగా తగు చర్యలను చేపట్టేలా చూడడమే ఈ కొత్త బిల్లు ప్రధాన ఉద్దేశమని ఆయన వివరించారు. 2008లో ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం ఏర్పడక ముందు బ్యాంకుల జారీ చేసిన రుణాలే ఎక్కువగా మొండి బాకీల జాబితాలో ఉన్నట్టుగా తెలిపారు. ఇప్పుడు వీటిని తిరిగి వసూళు చేసేందుకే తాము పలు వినూత్న చర్యలు తీసుకుంటున్నట్టుగా తెలిపారు. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థల్లోనే ఎక్కువగా మొండి బాకీలు నమోదై ఉన్నట్టుగా మంత్రి తెలిపారు. వృద్ధికి చోదకంగా నిలిచే పరిశ్రమలకు ఆర్థిక దన్నునిచ్చేందుకే బ్యాంకులు పరిశ్రమలకు ఎక్కువగా రుణాలను మంజూరు చేస్తూ వచ్చాయని అన్నారు. ప్రయివేటు రంగ బ్యాంకులు రిటైల్ రుణాలపైనే ఎక్కువగా దృష్టి సారించినందునే ఆ బ్యాంకుల్లో మొండి బాకీల బెడద తక్కువని ఆయన విశ్లేషించారు.

బిఎస్ఇ లాభాల్లో 12 రెట్లు వృద్ధి

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం(క్యూ1)లో స్టాక్ ఎక్స్ఛేంజీ బిఎస్ఇ లాభాల్లో ఏకంగా 12 రెట్ల వృద్ధితో రూ.523.7 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.43.70 కోట్ల లాభాలు నమోదు చేసుకుంది. క్రితం క్యూ1లో సంస్థ మొత్తం ఆదాయం 11 శాతం పెరిగి రూ.158.38 కోట్లుగా ఉంది. ఇదే సమయంలో సబ్సిడరీ సంస్థ సిడిఎస్ఎల్‌లో వాటా విక్రయం ద్వారా రూ.461.75 కోట్లు సాధించింది. దీంతో బిఎస్ఇ లాభాల్లో అమాంతం పెరుగుదల చోటు చేసుకుంది.

బ్యాంకింగ్ షేర్ల విలవిల

- ఆర్‌బిఐ 'వడ్డీ రేట్ల' దెబ్బ
- భారీ నష్టాల్లో మార్కెట్లు
- సెన్సెక్స్ 239 పాయింట్ల పతనం


ముంబయి : మరోసారి వడ్డీ రేట్ల తగ్గింపునకు అవకాశాలు ఉన్నాయని రిజర్వు బ్యాంకు సంకేతాలు ఇవ్వడంతో బ్యాంకింగ్ షేర్లు భారీగా పడిపోయాయి. గత రెండేళ్లుగా దేశ వృద్ధి రేటు కూడా అంతంత మాత్రంగానే ఉందని పేర్కొనడం మదుపర్లలో విశ్వాసాన్ని దెబ్బతీసింది. బుధవారం జరిగిన ఆర్‌బిఐ ద్రవ్య పరపతి సమీక్షలో కీలక వడ్డీ రేట్లను పావు శాతం తగ్గించడంతో బ్యాంకుల లాభాలపై ప్రతికూల ప్రభావం చూపనుందన్న అంచనాలు ఆ సూచీల నష్టాలకు కారణమయ్యింది. దీంతో గురువారం బిఎస్ఇ సెన్సెక్స్ 238.86 పాయింట్లు లేదా 0.74 శాతం క్షీణించి 32,237.88కి పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ కూడా 67.85 పాయింట్లు లేదా 0.67 శాతం పతనమై 10,013.65 వద్ద ముగిసింది. నిఫ్టీలో పిఎస్‌యు బ్యాంకింగ్ సూచీ 2.89 శాతం నష్టపోయింది. వడ్డీ రేట్లపై సాగిన విశ్లేషణలతో నిఫ్టీలో బ్యాంకింగ్ సూచీ 2.2 శాతం విలువ కోల్పోయింది. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా 2 శాతం, కెనరా బ్యాంకు 2.8 శాతం, పంజాబ్ నేషనల్ బ్యాంకు 4 శాతం చొప్పున నష్టపోయాయి. యాక్సిస్ బ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకు, ఎస్‌బ్యాంకు సూచీలు 2 శాతం పైగా నష్టపోయాయి. మార్చితో ముగిసిన త్రైమాసికంలో ద్రవ్యోల్బణం సూచీ 4 శాతానికి చేరడంపై ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ ఆందోళన వ్యక్తం చేయడం మార్కెట్లను ఒత్తిడికి గురి చేసింది. అహారోత్పత్తుల ధరలు పెరిగే అవకాశం ఉందని సంకేతాలు ఇచ్చింది. జులై నుంచి కేంద్రం అమలు చేస్తోన్న వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) వల్ల పారిశ్రామికోత్పత్తి తగ్గిపోనుందన్న ప్రయివేటు ఎజెన్సీలు, విశ్లేషకుల అంచనాలు ప్రతికూలతను పెంచాయి. అంతర్జాతీయంగా చాలా వరకు ఆసియన్ స్టాక్స్ నష్టాలు చవి చూశాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో పలు కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ఫలితాలు కూడా ఆశజనకంగా లేకపోవడం మార్కెట్లలో విశ్వాసాన్ని దెబ్బతీసింది. బిఎస్ఇలో రంగాల వారిగా ఆయిల్ అండ్ గ్యాస్, కన్స్యూమర్ డ్యూరెబుల్స్ సూచీలు మినహా అన్నీ నష్టాలు చవి చూశాయి.

ఇక 'బాబా' జీన్స్

వస్త్ర వ్యాపారంలోకి రాందేవ్

న్యూఢిల్లీ : ఇప్పటి వరకు అహార, ఎఫ్ఎంసిజి ఉత్పత్తులను విక్రయిస్తూ వచ్చిన యోగా గురు, వ్యాపారవేత్త రాందేవ్ బాబా త్వరలోనే వస్త్ర వ్యాపారంలోకి అడుగు పెట్టనున్నారు. సాంప్రదాయాల గురించి గొప్పగా చెప్పుకునే రాందేవ్ పాశ్చాత్య బట్టలు జీన్స్ విభాగంలోనూ రాణించాలని లక్ష్యంగా పెట్టుకోవడం విశేషం. రాందేవ్ పతంజలి ఆయుర్వేద లిమిటెడ్ వచ్చే ఏప్రిల్ నుంచి పురుషులు, మహిళలు, పిల్లల కోసం బట్టల వ్యాపారాన్ని ఏప్రిల్‌లో ప్రారంభించనుందని ఆ కంపెనీ అధికారిక ప్రతినిధి ఎస్‌కె టిజారావాలా తెలిపారు. తొలి ఏడాదిలోనే ఈ వ్యాపారంలో రూ.5000 కోట్ల టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందుకోసం ఇప్పటికే వస్త్రాల తయారిని కూడా చేపడుతున్నారని పేర్కొన్నారు. ఊలు, కాటన్, నైట్ వేర్, మెషీన్ మేడ్, డెనిమ్ వంటి బట్టలను మార్కెట్‌లోకి తీసుకువచ్చే కసరత్తులో ఉన్నామన్నారు. ఈ బట్టల వ్యాపారానికి 'పరిదాన్' అనే పేరును పెట్టాలని భావిస్తున్నామన్నారు. 2018 ఏప్రిల్‌లో దేశ వ్యాప్తంగా ఉన్న 250 ఎక్స్‌క్లూజివ్ రిటైల్ అవుట్‌లెట్లలో ఈ వస్త్ర ఉత్పత్తులను అందుబాటులోకి తేనున్నామన్నారు. బిగ్‌బజార్ లాంటి ఇతర స్టోర్లలో విక్రయించనున్నామన్నారు. రాందేవ్ క్రితం మాసంలోనే పరాక్రమ్ సురక్ష ప్రెయివేటు లిమిటెడ్ పేరుతో ప్రైయివేటు సెక్యూరిటీ వ్యాపారాన్ని ప్రారంభించారు. మౌలిక వసతుల సదుపాయాల రంగం వ్యాపారంలోకి ప్రవేశించే పనిలో ఉన్నారు. ప్రస్తుతం ఆయన పతాంజలి కంపెనీ రూ.10వేల కోట్ల టర్నోవర్ మార్క్‌ను దాటేసింది. వచ్చే ఏడాది మార్చి కల్లా ఏకంగా రూ.20,000 నుంచి రూ.25,000 కోట్ల మధ్య టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

గ్రూప్-3 మెయిన్స్ ప్రత్యేకం





జి.సుబ్బారావు, పాలిటీ,
గుంటూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాంపిటీషన్స్
సెల్ : 94405 25635

గ్రామ పంచాయితీ ఆర్థిక వనరులు

గ్రామ పంచాయితీ ప్రాంత ప్రజల అవసరాలు నెరవేర్చడానికి, గ్రామాభివృద్ధికి పనుల నిర్వహణకు, కార్యక్రమాల అమలుకు ముఖ్యంగా కావాల్సిన నిధులు. గ్రామ పంచాయితీ నిధులు.

గ్రామ పంచాయితీ సొంత ఆదాయాన్ని సమకూర్చుకోడానికి చట్టపరంగా అవకాశాలు ఉన్నాయి. పన్నులు విధించి వసూలు చేసుకొనే అధికారం కేవలం గ్రామ పంచాయితీలకు మాత్రమే ఉంది.

గ్రామ పంచాయితీకి నిధులు నాలుగు విధాలుగా సమకూరుతున్నాయి.

1. గ్రామ పంచాయితీ సొంత ఆదాయం
2. రాష్ట్ర ప్రభుత్వ కేటాయింపులు
3. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక కమిషనుల నుంచి విడుదలయ్యే గ్రాంట్లు
4. విరాళాలు, డిపాజిట్లు

1. గ్రామ పంచాయితీ సొంత ఆదాయాలు

ఎ. తప్పనిసరిగా విధించే పన్నులు

1. ఇంటి పన్నులు
2. కోల గ్రామం లేక కాటా రుసుము
3. ప్రకటనలపై పన్ను
4. ఇళ్లపై ప్రత్యేక పన్నులు
5. లైబ్రరీ పన్ను

బి. ఐచ్ఛికంగా విధించే పన్ను

1. ప్రత్యేక కార్యక్రమాల కోసం
2. వ్యవసాయ భూములపై విధించే పన్ను
3. ఖాళీ స్థలంపై సెస్సు

సి. ఫీజులు, రుసుములు

1. లైసెన్సు ఫీజులు 2. ఆక్రమణ రుసుము
3. వారంటు, జప్తు ఫీజు 4. రహదారి రుసుము
5. లే అవుట్ ఫీజు, బిల్డింగ్ పర్మిషన్ ఫీజు
6. లైసెన్సు లేని కుక్కలు, పందులపై రుసుము
7. బందెలదొడ్డి రుసుము 8. అపరాధ రుసుము
9. నీటిపంపులపై ఫీజు 10. కేబుల్ టి.విపై ఫీజు

డి. ఆదాయాన్నిచ్చే ఆస్తులు

1. సంతల వేలం 2. సైకిల్ స్టాండు వేలం
3. కబేళాల వేలం 4. పండ్లతోటల వేలం
5. కంపోస్టు వేలం 6. చేపల చెరువులు వేలం
7. లీజుకిచ్చిన ఆస్తుల నుంచి ఆదాయం
8. ఫెర్రీల వేలం 9. ఇసుక వేలం
10. పండుగలు, ఉత్సవాల నుంచి ఆదాయం

2. రాష్ట్ర ప్రభుత్వ కేటాయింపులు

ఎ. వృత్తి పన్ను బి. లోకల్ సెస్సు
సి. నీటి తీరువా డి. స్టాంపు డ్యూటీపై సర్‌ఛార్జి
ఇ. వినోదపు పన్ను ఎఫ్. మెజిస్ట్రీరియల్ రుసుము
జి. సీనరేజీ పన్ను

3. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, ఆర్థిక సంఘాల నుంచి గ్రాంట్లు

ఎ. రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్లు

1. రూ.4 తలసరి గ్రాంటు
2. సిబ్బంది జీతాల గ్రాంటు
3. విద్యుత్ వినియోగ ఛార్జీలు
4. రాష్ట్ర ఆర్థిక సంఘం గ్రాంటు
5. ఉత్తమ పంచాయితీ గ్రాంటు
6. ఉత్తమ పన్ను వసూళ్లకు గ్రాంటు
7. సర్పంచ్ గౌరవ వేతనం

బి. కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లు

1. కేంద్ర ఆర్థిక సంఘం గ్రాంటు
2. సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన
3. ఇతర పథకాల గ్రాంట్లు
4. విరాళాలు, డిపాజిట్లు

ఎ. ప్రజా విరాళాలు
బి. పనులకు కాంట్రాక్టర్లు చెల్లించిన డిపాజిట్లు
సి. నీటి పంపు డిపాజిట్లు

గ్రామ పంచాయితీ విధించే పన్నులు, వసూలుచేసే ఫీజులు, రుసుములు ప్రభుత్వం జారీచేసిన నియమాలకు అనుగుణంగా విధించి, వసూలు చేయాలి.

★ **గ్రామ పంచాయితీ నిధి**

గ్రామ పంచాయితీకి వచ్చే ఆదాయం మొత్తాన్ని 'గ్రామ పంచాయితీ నిధి' అంటారు. ప్రత్యేక పన్నుల ద్వారా లభించే ఆదాయాన్ని 'ప్రత్యేక నిధి (స్పెషల్ ఫండ్)'గా అకౌంటు నిర్వహించాలి. ఇలాంటి నిధి రాబడి ఖర్చులు వేరుగా ఎకౌంటు చేయాలి.

★ **గ్రామ పంచాయితీ వ్యయాలు**

గ్రామ పంచాయితీ నిధిని ఈ కింది విధంగా ఖర్చు చేయాలి. గ్రామ పంచాయితీకి గ్రామ పంచాయితీలలో నిధులు ముఖ్యంగా మూడు ఎకౌంట్లలో ఖర్చు చేస్తారు.

1. సాధారణ నిధి
2. ప్రత్యేక నిధి (స్పెషల్ ఫండ్)
3. వివిధ పథకాల నిధులు

1. సాధారణ నిధి : సాధారణ నిధి ఈ కింది విధంగా ఖర్చు చేయాలి.

1. సిబ్బంది జీతభత్యాలు	- 30 శాతం
2. పారిశుధ్యం	- 15 శాతం
3. వీధి దీపాలు	- 15 శాతం
4. నీటి సరఫరా	- 15 శాతం
5. రోడ్లు, డ్రెయిన్లు	- 20 శాతం
6. ఇతర అంశాలు	- 5 శాతం
మొత్తం	-100 శాతం

ఈ వ్యయాలన్నీ ప్రతి సంవత్సరంలో బడ్జెట్‌లో పొందుపరచి, గ్రామ పంచాయితీ ఆమోదాన్ని పొందాలి.

2. ప్రత్యేక నిధి : ఏ కార్యక్రమ నిర్వహణ కోసం ఈ పన్ను విధించారో అదే కార్యక్రమాలకు ఖర్చు చేయాలి. **ఉదా :** వ్యవసాయ భూములపై పన్ను (ఈ నిధి ఖర్చు చేయడంలో ఏదైనా మార్పు అవసరమైతే జిల్లా కలెక్టరు అనుమతి పొందాలి).

3. వివిధ పథకాల నిధులు, ఆర్థిక మిషన్ నిధులు

నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన మార్గదర్శక సూత్రాలను అనుసరించి, ఖర్చు చేయాలి. గ్రామ పంచాయితీ నిధులు ఖర్చు చేయనప్పుడు పాటించాల్సిన నియమాలు



✧ ప్రభుత్వ నియమాలకు లోబడి ఖర్చు చేయాలి.
✧ అవసరం మేరకు తప్ప సాధారణ నిధుల నుంచి ఎక్కువ డబ్బు 'డ్రా' చేయకూడదు.
✧ గ్రామ పంచాయితీ బడ్జెట్ కేటాయింపులకన్నా వ్యయం మించకూడదు.
✧ ప్రతి ఖర్చు గ్రామ పంచాయితీ సర్వసభ్య సమావేశంలో ఆమోదం పొందాలి.
✧ ఎట్టిపరిస్థితులలోనూ పన్నులు, ఫీజుల వసూళ్ల కింద వచ్చిన నగదును నేరుగా ఖర్చుచేయడానికి అధికారంలేదు.
✧ గ్రామ పంచాయితీకి బ్లీచింగ్ పౌడరు, విద్యుత్ పరికరాలు, ట్యూబులు, బల్బులు మొదలైనవి కొనుగోలు చేస్తున్నప్పుడు రేటు కాంట్రాక్టు ఉంటే దాని ప్రకారం మాత్రమే కొనాలి. లేదా ప్రభుత్వ నియమాల ప్రకారం కొనుగోలు చేయాలి.
✧ ఎట్టి పరిస్థితులలోనూ మార్కెట్ ధరలకు మించి, ఎక్కువ ఖరీదుతో కొనకూడదు.
✧ పంచాయితీ కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా స్టాకు రిజిష్టరులో నమోదు చేయాలి.
✧ పనులు నిర్వహించేటప్పుడు కాంట్రాక్టర్లకు అడ్వాన్సు చెల్లించకూడదు.

★ **చెక్కులు రాసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

జి.ఒ.నెం 30 ప్రకారం పంచాయితీ ఫండుకు సంబంధించిన అన్ని చెక్కులపై సర్పంచి సంతకం చేసే అధికారం ఉంది.

గ్రామ పంచాయితీలో నిర్వహించే పనులకు, కొనుగోళ్లకు, ఆగంతక ఖర్చు (కంటెంజెన్సీ)లకు పార్ట్‌టైమ్ ఉద్యోగులకు జీతాలు మొదలైన చెల్లింపులు చెక్కుల ద్వారానే జరగాలి. ఈ చెక్కులపై సంతకం చేసేటప్పుడు సర్పంచ్ ఈ కింది జాగ్రత్తలు పాటించాలి.

1. బిల్లును సరిచూడడం

పనులకు చెల్లింపులు : గ్రామ పంచాయితీలో చేపట్టిన పనులకు చెల్లింపులు చేయాల్సి వస్తే ఈ కింది విషయాలు పరిశీలించాలి.

✧ కార్యదర్శి ఉంచిన నోట్‌ఫైల్‌లో పని వివరం, పంచాయితీ తీర్మానం, పరిపాలనా మంజూరు, సాంకేతిక మంజూరు, పని అప్పగించిన వివరాలు, నిధుల వివరాలు పరిశీలించాలి.
✧ కొలతలు మెజర్‌మెంట్ పుస్తకంలో (ఎం.బుక్) రికార్డు చేసిన విషయం.
✧ బిల్లులో కొలతల వివరాలు ఎం.బుక్‌లోని ఆబ్‌స్ట్రాక్‌లో కొలతల వివరాలు ఒకటిగా ఉన్నయా లేదో సరిచూడాలి.
✧ బిల్లులో రాసిన మొత్తం చెక్కులో రాసిన మొత్తం ఒకటిగా ఉన్న విషయాన్ని ధృవీకరించుకోవాలి.

ఈ వివరాలన్నీ పరిశీలించి తృప్తిపడిన తర్వాతనే చెక్కుపై సంతకం చేయాలి.

★ **కొనుగోళ్లకు చెల్లింపులు :** గ్రామ పంచాయితీ అవసరానికి కొనుగోళ్లు చేసిన సరుకులు, సామాగ్రి, వస్తువులు మొదలైన వాటికి చెల్లింపులు చేసేటప్పుడు ఈ కింది విషయాలు గమనించాలి.

✧ సెక్రటరీ ఉంచిన నోట్ ఫైల్‌లో కొనుగోలు చేసిన వస్తువుల వివరాలు, పంచాయితీ తీర్మానం సరుకులు పంచాయితీకి అందిన వివరాలు చూడాలి.
✧ వచ్చిన సరుకులు బిల్లు ప్రకారం స్టాకు రిజిష్టరులో నమోదుచేసిన వివరాలు సరిగా ఉన్నాయా లేదా చూడాలి.
✧ సరఫరా చేసిన సరుకు నాణ్యత పరిశీలించి,తృప్తిపడాలి.
✧ చెల్లింపు కోసం తయారుచేసిన బిల్లులో చెల్లించాల్సిన మొత్తం చెక్కులో రాసిన మొత్తం సరిపోయిందీ లేనిదీ చూడాలి.

పై వివరాలన్నీ పరిశీలించి తృప్తిపడిన తర్వాతనే చెక్కులో సంతకం చేయాలి.

★ **ఆగంతక ఖర్చులకు (కంటెంజెన్సీస్) చెల్లింపులు :** గ్రామ పంచాయితీలో అప్పుడప్పుడు వచ్చే ఖర్చులకు లేదా అనుకోకుండా వచ్చే అవసరమైన ఖర్చులకు చెల్లించేటప్పుడు ఈ కింది జాగ్రత్తలు తీసుకోవాలి.

✧ ఏ అవసరానికి ఎంత ఖర్చు చేస్తారు ? ఈ ఖర్చులు చేయాల్సిన అవసరం ఉందా? చేసిన ఖర్చుకు సరైన బిల్లులు ఉన్నాయా ?
✧ ఇలాంటి ఖర్చుకు పంచాయితీ ఆమోదం ఉందా ? లేక ధృవీకరణ ఉందా ?

ఇలాంటి విషయాలన్నీ సెక్రటరీ ఉంచిన నోట్‌ఫైల్ ద్వారా పరిశీలించి, తృప్తిపడిన తర్వాత బిల్లులు మొత్తం, చెక్కుపైన రాసిన మొత్తం ఒకటిగా ఉన్న విషయాన్ని పరిశీలించి, సంతకం చేయాలి.

★ **పార్ట్‌టైమ్ ఉద్యోగస్తుల జీతాలు చెల్లింపులు :** సెక్రటరీ ఉంచిన నోట్‌ఫైల్‌లో ఇలాంటి ఉద్యోగస్తులను పంచాయితీలో వినియోగిస్తున్నందువల్ల అనుమతి ఉన్నదా ? ప్రభుత్వ నియమాలు అనుమతిస్తున్నాయా ? నియమాల ప్రకారం ఏఏ పనికి ఎవరెవరికి ఎంతెంత చెల్లించాలి, చెల్లించడానికి నిధులు ఉన్నాయా ? అనే విషయాలన్నీ పరిశీలించాలి.

✧ బిల్లుచేసిన మొత్తం చెక్కుల్లో రాసిన మొత్తం ఒకటిగా ఉన్న విషయాన్ని సరిచూసుకుని తర్వాత సంతకం చేయాలి.

2. చెక్కు రాసేటప్పుడు, సంతకం చేసేటప్పుడు

✧ చెక్కు జారీచేయడానికి ముందుగా బ్యాంకులో/ ట్రెజరీలో తగినంత నగదు నిల్వ ఉన్నట్లుగా నిర్ధారణ చేసుకుని మాత్రమే చెక్కు జారీచేయాలి.
✧ చెక్కుపై ఉన్న అంశాలు స్పష్టంగా పెన్నుతో రాయాలి.
✧ చెక్కుపై రాసిన అంశాలతో దిద్దుళ్లు, కొట్టివేతలు చేసినట్లయితే చెక్కుపై సంతకం చేసేవారు ఆ దిద్దుళ్లను ధృవీకరిస్తూ పక్కన సంతకం చేయాలి.
✧ చెక్కు మొత్తాన్ని అంకెలలో రాసేటప్పుడు అంకెలకు ముందు ఖాళీ లేకుండా చూడాలి.
✧ చెక్కులో రాసే అంశాలన్నీ చెక్కు కౌంటర్ ఫైల్ పై రాసి, దాని వెనుకభాగంపై చెక్కు తీసుకునేవారి సంతకం తీసుకోవాలి.
✧ ఒకవేళ చెక్కు రద్దుచేయాల్సి వస్తే, ఆ చెక్కుపై అడ్డంగా గీతలు కొట్టి రద్దు చేసినది అని రాయాలి.
✧ ఖాళీ చెక్కులపై అంటే వివరాలు నింపని చెక్కుపై సంతకాలు చేయకూడదు.
✧ చెక్కు, పాసుపుస్తకాలను జాగ్రత్తగా భద్రపరచాలి.

ఉద్యోగాలు

ఆర్మీ ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్‌లో పోస్టులు

ఇండియన్ ఆర్మీ 43వ ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్ కోర్స్-ఏప్రిల్ 2018కు దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రకటన వెలువడింది. ఈ కోర్సుకు నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ), సైనిక యుద్ధ శిబిరాల (వార్డ్స్ ఆఫ్ బ్యాటిల్ క్యాజువాలిటీస్)కు చెందిన పురుషులు, అవివాహ యువతులు మాత్రమే అర్హులు.

కోర్సు పేరు : ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్ 43వ కోర్స్-ఏప్రిల్ 2018.

ఖాళీలు : 54 (పురుషులు-50, మహిళలు-4).

అర్హతలు : ఎన్‌సీసీ 'సి' సర్టిఫికెట్ అభ్యర్థులకు - 50 శాతం మార్కులతో ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ. ఫైనల్ ఇయర్ చదువుతున్న అభ్యర్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే నిర్దేశిత మార్కుల శాతం తప్పనిసరి. అలాగే ఎన్‌సీసీ సీనియర్ డివిజన్/ వింగ్‌లో రెండేళ్ల పాటు సర్వ్ చేసిన అనుభవం ఉండాలి. దీంతోపాటు ఎన్‌సీసీ 'సి' సర్టిఫికెట్ పరీక్షలో కనీసం 'బి' గ్రేడ్ పొంది ఉండాలి.

వార్డ్ ఆఫ్ బ్యాటిల్ క్యాజువాలిటీస్ అభ్యర్థులకు - ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. అలాగే సంబంధిత బ్యాటిల్ ఆఫ్ క్యాజువాలిటీ గుర్తింపు పత్రాలు తప్పనిసరి.

వయోపరిమితి : 19-25 ఏళ్ల లోపు ఉండాలి.

ఫిజికల్ స్టాండర్డ్స్ (శారీరక ప్రమాణాలు) : పురుషులు 157.5 సెం.మీ ఎత్తు, ఎత్తుకు తగిన బరువు ఉండాలి. మహిళలు 152 సెం.మీ ఎత్తు, 42 కేజీల బరువు ఉండాలి. అలాగే పరుగుపందెం, పుష్‌అప్స్, సిట్‌అప్స్ తదితర వాటిని పూర్తి చేయగలగాలి.

ఎంపిక విధానం : షార్ట్ లిస్టింగ్, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్.

దరఖాస్తు విధానం : ఎన్‌సీసీ 'సి' సర్టిఫికెట్ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వార్డ్స్ ఆఫ్ బ్యాటిల్ ఆఫ్ క్యాజువాలిటీస్ అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకొని, వివరాలు నింపాలి. దానికి సంబంధిత ధ్రువపత్రాల నకళ్ళు, ఫొటోలు జతచేసి కవరులో ఉంచి 'డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ రిక్రూటింగ్/ ఆర్‌టీజీ-ఏ, ఎన్‌సీసీ ఎంట్రీ, వెస్ట్ బ్లాక్-3, ఆర్.కె.పురం, న్యూఢిల్లీ-110066' చిరునామాకు గడువులోగా చేరేలా పోస్టులో పంపాలి.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ : ఆగస్టు 23, 2017.

దరఖాస్తు హార్డ్‌కాపీలు (వార్డ్స్ ఆఫ్ బ్యాటిల్ క్యాజువాలిటీస్ అభ్యర్థులు) చేరడానికి చివరి తేదీ : ఆగస్టు 29, 2017.

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు.

వెబ్‌సైట్ : www.joinindianarmy.nic.in

వంశధార నిర్వాసితుల
సమస్యలు పరిష్కరించకపోతే 'చలో అమరావతి'

- 2013 భూ సేకరణ చట్టం అమలు చేయాలి
- టిడిపి నాయకులు మూకుమ్మడి రాజీనామాలతోనే సమస్యకు పరిష్కారం
- సిపిఎం పోరాట ఫలితంగానే రూ.421 కోట్ల మంజూరు : పి.మధు



నిర్వాసిత గ్రామం ఇరపాడులో పర్యటిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, ఎల్ఎన్‌పేట, హిరమండలం, కొత్తూరు)

వంశధార నిర్వాసితుల సమస్యలను పరిష్కరించకుంటే రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల నిర్వాసితులు, రైతులతో కలిసి 'చలో అమరావతి' కార్యక్రమం చేపడతామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు తెలిపారు. గురువారం ఆయన వంశధార నిర్వాసిత గ్రామాలైన హిరమండలంలోని పాడలి, దుగ్గుపురం, తులగాం, కొత్తూరు మండలం ఇరపాడు ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం శ్రీకాకుళం నగరంలోని సిపిఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారిపై నిర్బంధాన్ని ప్రయోగిస్తోందన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.53 వేలు ఇస్తే చిన్న గుడిసె నిర్మాణం కూడా జరగదన్నారు. ఎకరా భూమికి రూ.1.20 లక్షల నుంచి రూ.1.30 లక్షలు మాత్రమే ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చిందని, ఈ డబ్బులకు ప్రస్తుతం ఒక్క సెంటు భూమి కూడా రాదని తెలిపారు. వంశధార ప్రాజెక్టు కాంట్రాక్టర్లకు ప్రస్తుత ధర ప్రకారం అంచనాలను సవరించి డబ్బులు చెల్లిస్తున్న ప్రభుత్వం, నిర్వాసితులకు మాత్రం పరిహారం పెంచడం లేదన్నారు. నిర్వాసితులకు పరిహారంగా ఎకరా భూమికి రూ.పది లక్షల చొప్పున చెల్లించాలని, ప్రతి కుటుంబానికీ ఐదు లక్షల ప్యాకేజీ ఇవ్వాలని, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పునరావాసం, పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

నిర్బంధాన్ని ప్రయోగిస్తే తీవ్ర ప్రతిఘటన

నిర్వాసితుల ఆందోళనలను నిర్బంధాలతో అణచివేయాలని చూస్తే తీవ్ర ప్రతిఘటన తప్పదని మధు హెచ్చరించారు. నిర్వాసిత గ్రామాల నుంచి ప్రజలను వెళ్లగొట్టే ప్రయత్నాలను ప్రభుత్వం ముమ్మరం చేస్తోందన్నారు. అందులో భాగంగా రేషన్ దుకాణాలను తరలించేందుకు సిద్ధమైందని తెలిపారు. గ్రామాలను ఉన్నపళంగా ఖాళీ చేయిస్తే నిర్వాసితులు దిక్కులేనివారవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దిగొచ్చి సమస్యలు పూర్తిగా పరిష్కరించాలంటే అన్ని పదవులకూ టిడిపి నాయకులు మూకుమ్మడి రాజీనామాలు చేయాలని మధు డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు చౌదరి తేజేశ్వరరావు పాల్గొన్నారు.

యూత్ ప్యాకేజీలో అక్రమాలు..

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు పర్యటనకు నిర్వాసిత గ్రామాల ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. తమ సమస్యలను చెప్పుకొనేందుకు పెద్ద ఎత్తున జనం గుమిగూడారు. తమ సమస్యలను పరిష్కరించకుండానే గ్రామాలను ఖాళీ చేసేయమంటున్నారని మహిళలు మొరపెట్టుకున్నారు.

యూత్ ప్యాకేజీ పంపిణీలో అక్రమాలు చోటు చేసుకున్నాయని వాపోయారు. 12 ఏళ్ల క్రితం ఇచ్చిన ప్యాకేజీ డబ్బులు ఇప్పుడు ఎలా సరిపోతాయని, ఉన్న పళంగా ఊరు ఖాళీ చేయాలని, పంటలు సాగు చేయవద్దని అంటున్నారని నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై మధు మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యలపై సిపిఎం పోరాటం వల్ల ప్రభుత్వం రూ.421 కోట్లు మంజూరు చేసిందని గుర్తు చేశారు. కడప జిల్లా గండికోట రిజర్వాయర్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా గ్రామాల్లోని రిజర్వాయర్ నీటిని వదిలేశారని, ఇక్కడా కూడా అలాంటి పరిస్థితిని తెచ్చే విధంగా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. దీన్ని గమనించి నిర్వాసితులందరూ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మీకు అండగా ఉండి సమస్యలు పరిష్కరించే వరకూ సిపిఎం పోరాడుతుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి భవిరి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సిపిఎం నేతల అరెస్టు

నిర్వాసితులతో మాట్లాడేందుకు వెళ్లిన నిర్వాసితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గంగరాపు సింహాచలం, ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు కోరాడ నారాయణరావును దుగ్గుపురంలో హిరమండలం పోలీసులు అరెస్టు చేశారు. నిర్వాసితుల సమస్యలపై పోరాడుతున్న వారిపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయడం అన్యాయమని మధు అన్నారు.

2018కి పోలవరం పూర్తి చేయడం అసాధ్యం
సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి-పోలవరం/ జంగారెడ్డిగూడెం

పోలవరం ప్రాజెక్టు 2018 నాటికి పూర్తి చేయడం అసాధ్యమని, రానున్న ఎన్నికల్లో రైతుల ఓట్ల కోసం ఉపయోగించుకోవాలని అనుకుంటున్నారని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. పోలవరం ప్రాజెక్టు ప్రాంతాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఎస్ఇ రమేష్‌బాబు ప్రాజెక్టు నమూనాను చూపి వివరాలు తెలిపారు. అనంతరం నారాయణ విలేకరులతో మాట్లాడుతూ ప్రాజెక్టు వల్ల నష్టపోయే నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయడం లేదని విమర్శించారు. ప్యాకేజీ పూర్తిగా అందించాకే పనులు చేపట్టాలన్నారు. పోలవరం ప్రాజెక్టుకు వచ్చినన్ని అడ్డంకులు మరే ఇతర ప్రాజెక్టులకు రాలేదన్నారు. సిపిఐ మొదట నుంచీ పోలవరం ప్రాజెక్టు నిర్మించాలని చెప్పుకుంటూ వచ్చిందన్నారు. ప్రాజెక్టు నిర్మాణం 2018 నాటికి పూర్తి చేయడం వీలుపడదని, మరో నాలుగేళ్లు పడుతుందని చెప్పారు. ఆయన వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి డేగా ప్రభాకర్, సీనియర్ నాయకులు నెక్కంటి సుబ్బారావు, తదితరులు ఉన్నారు.

రూ.13.5 లక్షల కోట్లు కార్పొరేట్లకు ధారాదత్తం

ప్రధాని నరేంద్రమోడీ రూ.13.5 లక్షల కోట్లను కార్పొరేట్లకు రాయితీలుగా ధారబోసి అవినీతి పాలన సాగిస్తున్నారని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పరిశీలించడానికి గురువారం వచ్చిన ఆయన పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ రిటైల్ అవినీతి పాలన చేస్తే బిజెపి హోల్‌సేల్ అవినీతి పాలన సాగిస్తుందని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు అండగా ఉంటూ గ్యాస్ రాయితీని రద్దు చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. మోడీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌ను జిఎస్‌టిలోకి ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. గోవధ నిషేధం పేరుతో తమకు ఓట్లు వేయని మైనార్టీలు, దళితుల మీద దాడులను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. అమెరికా అధ్యక్షుడితో సన్నిహితంగా ఉంటున్న మోడీ ఆ దేశ మోన్‌శాంటో విత్తన కంపెనీ ఆగడాలను అడ్డుకోలేకపోతున్నారన్నారు. తెలుగు రాష్ట్రాల్లో కమ్యూనిస్టులు మాయమవుతారని తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ వ్యాఖ్యానించడం హాస్యాస్పదమన్నారు. రాజకీయ విధానాలను పూర్తిస్థాయిలో వెల్లడించే వరకూ జనసేన గురించి మాట్లాడటం సరికాదన్నారు.

అంగన్వాడీలను వేధిస్తే ఐక్య ఉద్యమం
రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

అంగన్వాడీ కార్యకర్తలపై వేధింపులకు పాల్పడితే ఐక్య ఉద్యమం తప్పదని పలువురు వక్తలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అంగన్వాడీల న్యాయమైన పోరాటానికి అండగా ఉంటామన్నారు. అంగన్వాడీ ఉద్యోగులపై ప్రభుత్వ వేధింపులు, కక్షసాధింపులు ఆపాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన శ్రీకాకుళం నగరంలోని ఎన్‌జిఒ హోంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్యవేదిక జిల్లా చైర్మన్ హనుమంతు సాయిరాం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయన్నారు. పౌష్టికాహారం అందించే ఐసిడిఎస్ వ్యవస్థను బలోపేతం చేయాల్సింది పోయి, నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసు మాట్లాడుతూ 2017 చివరికి అంగన్వాడీ కేంద్రాల ఎత్తివేతకు ప్రభుత్వాలు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాయన్నారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, శ్రామిక మహిళా, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

డిటెన్షన్ విధానాన్ని కేంద్రం విరమించుకోవాలి: యుటిఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాలల్లో 5,8 తరగతుల్లో డిటెన్షన్ విధానాన్ని అమలు చేయాలనే నిర్ణయాన్ని కేంద్రప్రభుత్వం విరమించుకోవాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. ఈ నిర్ణయం వల్ల డ్రాపువట్స్ పెరుగుతాయని, పేద పిల్లలు, ప్రభుత్వ పాఠశాలలకే నష్టమని ఫెడరేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఐ వెంకటేశ్వరరావు, పి బాబురెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎనిమిదో తరగతి వరకు విద్యార్థులను ఫెయిల్ చేయరాదనే నిబంధన 2010 విద్యాహక్కు చట్టం సెక్షన్ 16లో ఉందని వెల్లడించారు. డిటెన్షన్ కోసం విద్యాహక్కు చట్టాన్ని కూడా మార్పు చేయాలనుకోవడం పేదలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ విద్యను దెబ్బతీయడమేనని విమర్శించారు. కేంద్రం నిర్ణయం వల్ల పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతారని, బాలికల విద్య మరింత దిగజారి బాల్య వివాహాలు పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో డ్రాపవుట్స్ పెరగడంవల్ల బాలకార్మికులుగా మారతారన్నారు. విద్యార్థి సంపూర్ణ వ్యక్తిత్వ వికాసాన్ని విద్య అభివృద్ధి చేసేదిగా ఉండాలే తప్ప కేవలం పరీక్షల్లో వచ్చే మార్కులు, గ్రేడ్‌లతో విద్యార్థుల జ్ఞానాన్ని కొలవడం సరైంది కాదన్నారు. రాష్ట్రప్రభుత్వం 2015 అక్టోబర్‌లో జరిపిన రాష్ట్రస్థాయి వర్క్‌షాపులో 95శాతం డిటెన్షన్ వద్దన్న విషయాన్ని రాష్ట్రప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు. నాన్‌డిటెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు.

ప్రజా శాస్త్రవేత్తను కోల్పోవడం బాధాకరం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(సిసిఎంబి) వ్యవస్థాపక డైరెక్టర్ ప్రొఫెసర్ పిఎం భార్గవ మృతి పట్ల జనవిజ్ఞాన వేదిక సంతాపాన్ని ప్రకటించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రగతిశీల ప్రజా శాస్త్రవేత్తను కోల్పోవడం బాధకరమని వేదిక రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్ రవికుమార్, కె శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గొప్ప అణు జీవశాస్త్రవేత్త, అణు భౌతిక శాస్త్రవేత్తే కాకుండా ఆచరణాత్మకంగా ప్రగతిశీల భావాలతో నడిచిన గొప్ప దేశభక్తుడు అని కొనియాడారు. విజ్ఞాన శాస్త్రం ప్రజల సంక్షేమానికి ఉపయోగపడాలని ఆయన కాంక్షించే వారని, విజ్ఞాన శాస్త్రానికి, శాస్త్రీయ ధోరణికి ఒక రోల్ మోడల్‌గా నిలిచారని పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక కార్యకర్తలందరికీ ఆయన ఒక గరువుగా, తత్వవేత్తగా, స్నేహితుడిగా ఉన్నారని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక అన్ని జిల్లా కమిటీలు ఈనెల 6న సంతాప సభలు నిర్వహిస్తున్నాయని, రాష్ట్రకమిటీ ఆధ్వర్యంలో ఈనెల 13న విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో సంతాప సభ నిర్వహిస్తున్నామని వారు వెల్లడించారు.

ఈస్ట్‌కోస్ట్ రైల్వేజోన్‌లో కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యాన గురువారం డివిజనల్ రైల్వే మేనేజర్ (డిఆర్ఎం) కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.
– ప్రజాశక్తి- అక్కయ్యపాలెం, విశాఖ

విద్యుత్ కోతలపై రైతుల ఆందోళన

ప్రజాశక్తి – మాడుగుల (విశాఖ)

విద్యుత్ కోతలపై విశాఖ జిల్లా వి.మాడుగుల సబ్‌స్టేషన్ వద్ద రైతులు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ ఏడాది జనవరి నుంచి వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతుందని, నీరు లేక వరి నారు ఎండి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మరమ్మతు సమయంలో విద్యుత్ సరఫరా నిలిచినా ఏదో ఒక సమయంలో ఏడు గంటల పాటు సరఫరా చేస్తున్నామని ఎఇ ప్రసాద్ చెప్పడంపై రైతులు మండిపడ్డారు. ఈ విషయాన్ని లైన్‌మెన్ సత్యనారాయణ ఎడిఇ వేణుగోపాలరావు దృష్టికి తీసుకువెళ్లారు. శుక్రవారం నుంచి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో రైతులు శాంతించారు. ఈ కార్యక్రమంలో పొలిమేర చిన్నారావు, బొడ్డేటి గంగాధరరావు పాల్గొన్నారు.

పోలవరం పనులు వేగవంతమయ్యాయి

ప్రజాశక్తి-పోలవరం

పోలవరం పనులు వేగవంతమయ్యాయని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ అన్నారు. ఆయన గురువారం పోలవరం ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలించారు. తొలుత ప్రాజెక్టు స్పిల్‌వే, స్పిల్ ఛానల్, రేడియల్‌గేట్లు తయారీ కేంద్రం పరిశీలించారు. పోలవరం ప్రాజెక్టు ఎస్ఇ రమేష్‌బాబు, ప్రాజెక్టు గుత్తేదారులు పనుల వివరాలు తెలిపారు. అనంతరం పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని, ఇటుకలకోట వద్ద ఉన్న డెలివరీ పాయింట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జెపి విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన తరువాత పోలవరం పనులు నత్తనడకన సాగినాఇప్పుడు వేగవంతమయ్యాయని చెప్పారు. అధికారులు, కాంట్రాక్టర్లు సిబ్బంది పనులు బాగా చేస్తున్నారని అన్నారు.

జెడ్‌పి చైర్మన్ ఎన్నిక చెల్లదంటూ వైసిపి ధర్నా

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

తూర్పుగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ జ్యోతుల నవీన్ కుమార్ ఎన్నిక చెల్లదంటూ వైసిపి ఆధ్వర్యాన కాకినాడ కలెక్టరేట్ వద్ద గురువారం ధర్నా చేశారు. ఈనెల 2న జరిగిన జిల్లా పరిషత్ చైర్మన్ నవీన్ కుమార్ ఎన్నిక అప్రజాస్వామికమని వైసిపి నేతలు అన్నారు. పార్టీ ఫిరాయించిన జెడ్‌పిటిసిలను, ఎంపిటిసిలను వెంటనే బహిష్కరించాలని డిమాండ్ చేశారు.

అక్రమ చెరువు తవ్వకాల అడ్డగింత

ప్రజాశక్తి – గుడివాడ (కృష్ణా)

కృష్ణాజిల్లా గుడివాడ మండలం దొండపాడులో అక్రమ చెరువు తవ్వకం పనులను మహిళలు గురువారం అడ్డుకున్నారు. చెరువు పనులు చేస్తున్న పొక్లెయిన్‌ను అడ్డుకున్న విషయాన్ని తెలుసుకున్న భూ యజమాని పొక్లెయిన్‌తో తొక్కించైనా పనులను పూర్తి చేస్తానని అనడంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాణాలు పోయినా పనులను సాగనివ్వబోమని తేల్చిచెప్పారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్.ఐ సుబ్రహ్మణ్యం తన సిబ్బందితో గొడవ జరుగుతున్న ప్రాంతానికి వెళ్లి చెరువు తవ్వకాన్ని అడ్డుకోవాలంటే అధికారుల నుంచి నిలిపివేత ఉత్తర్వులు తెచ్చుకోవాలని, లేని పక్షంలో ఆందోళనకారులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ప్రజ్ఞ

జవాబులు

1. గుజరాత్, 2. గోవా
3. రూ.89 వేల కోట్లు
4. మినుట్‌మన్-3
5. లండన్

మాతృభాషను కొనసాగించండి
జిఒ 14ను రద్దు చేయాలని ఫ్యాప్టో డిమాండ్

ప్రజాశక్తి-యంత్రాంగం

రాష్ట్రవ్యాప్తంగా వున్న అన్ని మున్సిపల్ పాఠశాలల్లో విద్యార్థులకు స్వేచ్ఛ, సృజనాత్మకత పెంపొందించే మాతృభాష తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని, తక్షణమే జిఒ 14ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫ్యాప్టో ఆధ్వర్యాన ఉపాధ్యాయులు గురువారం ఆందోళనలు చేపట్టారు. విజయవాడ ధర్నాచౌక్ వద్ద అన్ని ఉపాధ్యాయ సంఘాలూ ధర్నా నిర్వహించాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ.. ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కృష్ణాజిల్లా గుడివాడ, మచిలీపట్నం మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించారు. గుడివాడలో ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మున్సిపల్ పాఠశాలల్లో కార్పొరేట్ విద్యా విధానమంటూ తెలుగు మీడియంను రద్దు చేసి, ఇంగ్లీషు మీడియాన్ని బలవంతంగా రుద్దాలని చూడడం దారుణమన్నారు. విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన ధర్నాలో ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజ శర్మ మాట్లాడుతూ, ప్రభుత్వ విద్య పేదలకు అందకుండా చేయడం కోసం అనేక పాఠశాలలను చంద్రబాబు ప్రభుత్వం మూసివేస్తోందన్నారు. కర్నూలులో నిర్వహించిన ఆందోళనలో ఫ్యాప్టో రాష్ట్ర సెక్రెటరి జనరల్ జి.హృదయరాజు పాల్గొని మాట్లాడారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి.సర్వేశ్వరరెడ్డి అధ్యక్షతన నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎన్.నరసింహుడు మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లాలో శ్రీకాకుళం, ఇచ్ఛాపురాల్లో ధర్నాలు చేశారు. శ్రీకాకుళం నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాను యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చౌదరి రవీంద్ర ప్రారంభించారు. ఇచ్ఛాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా అనంతరం మున్సిపల్ కమిషనర్ రవిబాబుకు వినతిపత్రం అందజేశారు. విజయనగరం, పార్వతీపురం మున్సిపల్ కార్యాలయాల వద్ద జరిగిన ధర్నాల అనంతరం కమిషనర్లు కనక మహాలక్ష్మి, ఎస్.శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. సాలూరులో ధర్నానుద్దేశించి ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి మాట్లాడుతూ.. మున్సిపల్ పాఠశాలల్లో కార్పొరేట్ విద్య పేరుతో ప్రభుత్వం అనేక ప్రయోగాలు చేస్తోందన్నారు. అనంతరం కమిషనర్ జి.విజయకుమారికి వినతిపత్రాలు అందజేశారు. గుంటూరు నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇచ్చారు. మంగళగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. నెల్లూరులో నగర కార్పొరేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు అంజయ్య ఆధ్వర్యంలో మేనేజరు గిరిజకు వినతి పత్రాన్ని అందజేశారు. ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా జరిగింది. ధర్నానుద్దేశించి యుటిఎఫ్ నగర అధ్యక్షులు సిహెచ్ లక్ష్మీనారాయణ, యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు డి వీరాంజనేయులు మాట్లాడారు.



విజయవాడలో జరిగిన దర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కత్తి నర్సింహారెడ్డి

సీమ కరువు పట్టని బాబు
నంద్యాల ఉప ఎన్నికల్లో కేంద్రీకరించడం శోచనీయం
సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు ఎంఎ గఫూర్

ప్రజాశక్తి – తిరుపతి టౌన్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు రాయలసీమ కరువు గురించి పట్టించుకోకుండా, నంద్యాల ఉప ఎన్నికపైనే పూర్తిగా కేంద్రీకరించడం శోచనీయమని సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ విమర్శించారు. గురువారం తిరుపతి యశోదానగర్‌లోని ఎంబి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకూ రాయలసీమ ప్రజలు కరువు కాటకాలతో అల్లాడుతున్నారన్నారు. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించారని గుర్తు చేశారు. రాయలసీమలోని నాలుగు జిల్లాల్లోని పడమటి ప్రాంతాల్లో తీవ్ర దుర్భిక్షం నెలకొందన్నారు. కనీసం తాగడానికి మంచినీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులు వేసిన పంటలు నీరు లేక ఎండిపోయాయన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించకపోవడంతో వేలాదిమంది యువకులు వాచ్‌మెన్ ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 'గాలేరు–నగరి', 'హంద్రీనీవా' ప్రాజెక్టులకు ఏమాత్రం నిధులు కేటాయించకుండా సెప్టెంబర్‌లో, డిసెంబర్‌లో తాగునీరు ఇస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. కనీసం కాల్వలు తవ్వడానికి కూడా నిధులు ఇవ్వడం లేదన్నారు. ఈ ప్రాజెక్టులు ఎప్పటికి పూర్తవుతాయన్నారు. చిత్తూరు జిల్లాలో ప్రారంభించిన మన్నవరానికి అతీగతీ లేదన్నారు. కడప ఉక్కు ఫ్యాక్టరీని ప్రారంభించకుండా వదిలేశారన్నారు. రాయలసీమను తక్షణమే ఆదుకోవాలంటే ప్రత్యేక ప్యాకేజి ప్రకటించడమే గాకుండా, రైతులకు రుణమాఫీ చేయాలని, విద్యార్థులకు ఫీజు మాఫీ చేయాలన్నారు. ఈ సమస్యలను పట్టించుకోకపోతే మరోసారి రాయలసీమ కరువు నివారణా చర్యల కోసం ఉద్యమిస్తామని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కె.కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. రాయలసీమలో వర్షాలు లేకపోవడంతో లక్ష బోర్లు ఎండిపోయాయన్నారు. ఏ ఒక్క పంట కూడా ఎండిపోకుండా రెయిన్‌గన్లు ఏర్పాటు చేస్తామని చెప్పిన కలెక్టర్ విస్మరించారన్నారు. గతంలో రెయిన్‌గన్ ద్వారా పంటలు పండించినా ఎండిపోయాయని గుర్తు చేశారు. టిటిడిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్‌చేశారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి పాల్గొన్నారు.

విశ్లేషణాత్మక పరిశోధనలే ఇస్రో బలం
శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ డైరెక్టర్ కున్హి కృష్ణన్

ప్రజాశక్తి – ఎడ్యుకేషన్ (విజయవాడ)

ప్రతి కొత్త పరిశోధనా సామాన్య మానవునికి చేరి అందరికీ ఉపయోగపడాలనేది ఇస్రో సిద్ధాంత మని, ఈ విశ్లేషణాత్మక పరిశోధనలే ఇస్రో మూల బలమని శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ డైరెక్టర్ పి.కున్హి కృష్ణన్ అన్నారు. విజయవాడ శివార్లలోని కానూరు పివిపి సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఇండియన్ సొసైటీ ఆఫ్ సిస్టమ్స్ ఫర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ అమరావతి ఛాప్టర్ సంయుక్తంగా 'పరిమిత మూలక విశ్లేషణ' అనే అంశంపై జాతీయస్థాయి సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కున్హి కృష్ణన్ మాట్లాడుతూ.. ఏదైనా ఉన్నత అభివృద్ధి సాంకేతిక రంగంలో చూపించాలంటే ఒంటరిగా చేయలేమని, ఒక బృందంగా ఏర్పడి చేస్తే విజయం త్వరితగతిన వస్తుందని తెలిపారు. సిస్టమ్స్ ఇంజినీరింగ్ అనేది ప్రతి పరిశోధనలో ముఖ్య భాగమని, క్లిష్టతరమైన పరిశోధనలను చిన్న చిన్న భాగాలుగా విభజించి వాటిని విజయవంతంగా పరీక్షించి, చివరకు సులభతరమైన పద్ధతిలో ఎంత పెద్ద అంశానికైనా పరిష్కార మార్గం కనుగొనటమే ఈ సదస్సు ఉద్దేశ్యమన్నారు. తిరువనంతపురం విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ కె.శివన్ మాట్లాడుతూ.. ఏడేళ్లగా ఇస్రో అపజయమనేది లేకుండా ఎన్నో ఉపగ్రహాలను అంతరిక్షం లోకి పంపిందన్నారు. పరిశ్రమలు, విద్యా సంస్థలు, ఇస్రోతో కలిసి పనిచేస్తే ఎన్నో విజయాలను సాధించగలమని చెప్పారు.

గ్యాస్ సబ్సిడీ ఎత్తివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి-యంత్రాంగం

గ్యాస్ సబ్సిడీ ఎత్తివేయాలని, ప్రతి నెలా గ్యాస్ ధర రూ.4 పెంచుకుంటూ 2018 కల్లా సబ్సిడీ పూర్తిగా ఎత్తివేయాలని కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో గురువారం పలుచోట్ల ర్యాలీలు,ధర్నాలు నిర్వహించారు.

గ్యాస్ సబ్సిడీ ఎత్తివేత నిర్ణయానికి వ్యతిరేకిస్తూ కృష్ణాజిల్లా ఉయ్యూరులో సిపిఎం ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి సెంటర్ వరకూ ప్రదర్శనగా వచ్చి నిరసన తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఇచ్చే గ్యాస్, ఇతర నిత్యవసర వస్తువుల సబ్సిడీని ఎత్తివేసి బడా కంపెనీలకు సబ్సిడీ ఇచ్చే విధానం చూస్తుంటే పేదల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి లేదన్నట్లు తెలుస్తోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెట్రోలు, గ్యాస్ ధరలు తగ్గుతుంటే దేశంలో మాత్రం కేంద్రం ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచడం శోచనీయమన్నారు. కేంద్రం ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఎం, ఐద్వా ఆధ్వర్యంలో విజయవాడలో వివిధ చోట్ల స్థానికులు ధర్నా నిర్వహించారు. కడపలో సిపిఎం కార్యాలయం నుంచి పాతబస్టాండ్, ఏడురోడ్ల సర్కిల్, పాత కలెక్టరేట్, కళాక్షేత్రం మీదుగా గాంధీ విగ్రహం సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నందం గనిరాజు సెంటర్‌లో ఖాళీ గ్యాస్ బండలతో రాస్తారోకో నిర్వహించారు. ధరపెంపు నిర్ణయాన్ని తక్షణం వెనక్కి తీసుకోవాలని, సబ్సిడీని కొనసాగించాలని నినాదాలు చేశారు. జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉందని ధర్నాను నిలిపేయాలని పోలీసులు ఆదేశించారు. నాయకులను ఎక్కడికీ కదలనీయకుండా పోలీసులు చుట్టుముట్టారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలో సిపిఎం ఆధ్వర్యాన కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇరగవరంలో నిరసన తెలిపారు.

కర్నాటకలో రెండో రోజు

కొనసాగిన ఐటి దాడులు

బెంగళూరు : కర్నాటక విద్యుత్ శాఖ మంత్రి డికె శివకుమార్‌కు సంబంధించిన వివిధ ఆస్తులకు సంబంధించి ఆదాయపు పన్ను శాఖ దాడులు గురువారం కూడా కొనసాగాయి. గుజరాత్‌లో రాజ్యసభ ఎన్నికల్లో బిజెపి ప్రలోభాలకు గురవ్వకుండా రక్షించుకునేందుకు కాంగ్రెస్‌కు చెందిన 44 మంది ఎమ్మెల్యేలకు శివకుమార్ ఆతిథ్యమిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శివకుమార్ నివాసాల్లో బుధవారం ఉదయం మొదలై అదే రోజు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. మళ్లీ గురువారం ఉదయం కూడా పలు చోట్ల సోదాలు నిర్వహించాయి. బుధవారం రాత్రి వరకు 64 చోట్ల సోదాలు నిర్వహించిన ఐటి శాఖ దాదాపు 10 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్న సంగతి విదితమే.

'నోటా'తోనే గుజరాత్ రాజ్యసభ ఎన్నికలు

సుప్రీం కోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: గుజరాత్‌లో త్వరలో జరుగనున్న రాజ్యసభ ఎన్నికల్లో నోటా ఆప్షన్ కొనసాగుతుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ ఆప్షన్‌ను తొలగించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ దాఖలు చేసిన పిటిషన్‌ను తిరస్కరిస్తూ సర్వోన్నత న్యాయస్థానం గురువారం తీర్పు వెలువరించింది. నచ్చని అభ్యర్థులందరినీ తిరస్కరించాలనే ఈ నోటా ఆప్షన్‌ను ఇటు కాంగ్రెస్‌తో పాటు అటు బిజెపి కూడా వ్యతిరేకిస్తోంది. పరోక్ష ఎన్నికల ప్రక్రియలో ఈ ఆప్షన్‌ను కొనసాగించటం అన్యాయమని ఈ రెండు పార్టీలూ వాదిస్తున్నాయి. రాజ్యసభ ఎన్నికల్లో నోటా ఆప్షన్‌ను కొనసాగించాలన్న నిబంధన రాజ్యాంగంలో ఎక్కడా లేదని, దీనిపై ఎన్నికల కమిషన్ కూడా ఎటువంటి ఆదేశాలూ జారీ చేయలేదని కాంగ్రెస్ తన పిటిషన్‌లో పేర్కొంది.

ప్రవాస భారతీయులకు ఓటు హక్కు


ప్రజా ప్రాతినిధ్య చట్ట సవరణకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం

అందుబాటులోకి ప్రాక్సీ ఓటింగ్

న్యూఢిల్లీ : విదేశాల్లో ఉండటంతో ఓటు హక్కును వినియోగించలేకపోతున్న భారతీయల కోసం ఎన్నికల చట్టాలను సవరించినట్లు కేంద్ర ప్రభుత్వం గురువారం తెలిపింది. ఇకపై ప్రవాస దేశాల నుంచే భారతీయులు ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రజా ప్రాతినిధ్య చట్టానికి చేసిన సవరణలను కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. దీంతో విదేశాల్లో ఉన్నవారందరికీ 'ప్రాక్సీ ఓటింగ్' అందుబాటులోకి రానుంది. ఇన్నాళ్లూ భారత ప్రభుత్వం తరపున విదేశాల్లో సేవలందిస్తున్న అధికారులు, ప్రతినిధులకు మాత్రమే ఈ ఓటింగ్ అందుబాటులో ఉండేది. ప్రాక్సీ ఓటింగ్ ప్రకారం ఎన్ఐఆర్‌లు ముందుగానే తమ తరపున ఓటు వేయబోయే వ్యక్తి పేరును రిజిస్టర్ చేసుకోవాలి. అయితే సదరు ఎన్ఆర్ఐ ఓటు ఏ నియోజకవర్గంలో నమోదైతే అదే నియోజకవర్గానికి చెందిన వ్యక్తిని ఎంచుకోవాల్సి ఉంటుంది. ఎన్నికల సంఘం వద్ద నమోదైన వివరాల ప్రకారం ఆ వ్యక్తికి...ఎన్ఆర్ఐ ఓటును వేసేందుకు అధికారులు అనుమతినిస్తారు. గత ఎన్నికల్లో 10 వేల నుంచి 12 వేల మంది ప్రవాసీ భారతీయులు మాత్రమే స్వదేశానికి వచ్చి ఓటు వేశారు. దీంతో ఈ సంఖ్యను పెంచడానికి అవసరమైన చర్యలను అధ్యయనం చేసేందుకు ఎన్నికల సంఘం 2015లో ఓ నిపుణుల కమిటీ వేసింది. ఈ కమిటీ ఇచ్చిన సూచనలు, మార్గదర్శకాల మేరకు ప్రాక్సీ ఓటింగ్‌ను అమల్లోకి తీసుకొచ్చినట్లు ఓ అధికారి తెలిపారు.

గోవింద్ పన్సారే హత్య కేసులో నిందితుల ఆచూకీ తెలిపితే రూ.10 లక్షలు

రివార్డు ప్రకటించిన మహారాష్ట్ర ప్రభుత్వం



కొల్హాపూర్ : ప్రముఖ హేతువాది గోవింద్ పన్సారే హత్య కేసులో నిందితుల ఆచూకీ తెలిపిన వారికి మహారాష్ట్ర ప్రభుత్వం రూ. 10 లక్షల నగదు బహుమతిని ప్రకటించింది. కొల్హాపూర్‌లో ఫిబ్రవరి 16, 2015న ఓ కార్యక్రమానికి హాజరైన పన్సారే దంపతులపై వినయ్ పవార్, సరంగ్ దిలీప్ అకోల్కార్ అనే ఇద్దరు వ్యక్తులు తుపాకీతో కాల్పులు జరిపినట్లు నగర ఐజి విశ్వాస్ నంగరే పాటిల్ గతంలో ప్రకటించారు. వారిపై నాన్‌బెయిలబుల్ అరెస్టు వారెంట్ కూడా జారీ అయింది. అప్పటి నుంచీ నిందితులు పరారీలో ఉండటంతో కేసులో దర్యాప్తు నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో నిందితుల ఆచూకీ తెలిపినవారికి రూ. 5 లక్షల నగదు బహుమతిని ప్రభుత్వం గతంలో ప్రకటించింది. అయినప్పటికీ ఎవరూ ముందుకు రాకపోవడంతో ఈ రివార్డును రూ.10 లక్షలకు పెంచినట్లు ఐజి నంగరే పాటిల్ గురువారం మీడియాకు తెలిపారు. సిట్ దర్యాప్తులో నిందితులు కొల్హాపూర్‌లోనే తుపాకీని కొనుగోలు చేసినట్లు తేలిందనే సంగతి తెలిసిందే.

వందకుపైగా వంతెనలు ఎప్పుడైనా కూలిపోవచ్చు

లోక్‌సభలో వెల్లడించిన నితీశ్ గడ్కరీ

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ప్రస్తుతం వినియోగంలోవున్న వాటిలో వందకుపైగా వంతెనలు ఏ క్షణంలోనైనా కూలిపోవచ్చని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గురువారం లోక్‌సభలో వెల్లడించారు. రవాణా భద్రతా సమీక్షలో భాగంగా 1.6 లక్షల వంతెనలను సమీక్షించామని, వాటిలో సొరంగాలతో సహా 147 వంతెన మార్గాలు అధ్వాన్న స్థితిలో ఉన్నాయని గడ్కరీ చెప్పారు. ఇందులో వందేళ్ల కాలం నాటి రెండు వంతెనలు కూడా ఉన్నాయన్నారు. గతేడాది మహారాష్ట్రలోని కొంకణ్ ప్రాంతంలో సావిత్రీ నదిపై వున్న బ్రిటీష్ కాలం నాటి వంతెన కూలిన ఘటనలో సుమారు 25 మంది మరణించిన సంగతి తెలిసిందే. ఇటీవల మణిపూర్‌లోని జాతీయ రహదారిపైవున్న వంతెన కూలిన నేపథ్యంలో అధ్వాన్న స్థితిలోవున్న వంతెనల పరిస్థితిని సమీక్షించేందుకు రూ. 69 కోట్లను కేటాయించినట్లు అధికారులు తెలిపారు.

జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పులు

ఆర్మీ మేజర్, జవాన్ మృతి

శ్రీనగర్: జమ్మూ కాశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో గురువారం భద్రతా దళాలపై ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో సైన్యానికి చెందిన మేజర్ స్థాయి అధికారితో పాటు మరో జవాన్ మరణించినట్లు పోలీసులు వెల్లడించారు. గురువారం ఉదయం భద్రతా దళాలు గాలింపు చర్యలు చేపట్టిన సమయంలో ఉగ్రవాదులు వారిపై కాల్పులు జరిపారని, ఈ ఘటనలో మరోజవాన్ తీవ్రంగా గాయపడ్డారని అధికారులు వివరించారు. ఉగ్రవాదుల కదలికలపై ఇంటెలిజెన్స్ సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది బుధవారం రాత్రి నుండి షోపియాన్ జిల్లా జైపురా ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారని పోలీసు సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. ఈ గాలింపు సమయంలో ఉగ్రవాదులు సైనిక సిబ్బందిపై కాల్పులు జరపటంతో మేజర్ కమలేష్ పాండే, సిపాయిలు తంజిన్ ఛుల్తిమ్, కిర్పాల్ సింగ్ తీవ్రంగా గాయపడ్డారని, వారిని ఆస్పత్రికి తరలిస్తున్న సమయంలో మేజర్‌తో పాటు జవాను తంజిన్ ఛుల్తిమ్ మరణించాడని ఆయన వివరించారు. భద్రతా దళాలు గాలింపు చర్యలను కొనసాగిస్తున్నాయని, అయితే ఇప్పటి వరకూ ఉగ్రవాదుల జాడ తెలియలేదని అధికారులు చెప్పారు.

కేరళపై దుష్ప్రచారం మానండి

- బిజెపివి అవాస్తవ ఆరోపణలు
- స్పీకర్ పోడియం వద్ద సిపిఎం ఎంపిల నిరసన
- మాట్లాడుతుండగా మైక్ కట్ చేసిన స్పీకర్
- బిజెపి సభ్యుల దురుసు ప్రవర్తన
- స్పీకర్, బిజెపి తీరుపై సిపిఎం ఆగ్రహం
- వ్యూహంలో భాగంగానే సభ వాయిదా: కరుణాకరన్
- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు: ఎం.డి సలీం



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేరళలో సిపిఎం నేతృత్వంలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేసి, దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని, అలాంటి ప్రభుత్వంపైన, సిపిఎంపైన బిజెపి దుష్ప్రచారం చేస్తోందని సిపిఎం లోక్‌సభ పక్షనేత పి.కరుణాకరన్ ధ్వజమెత్తారు. ప్రజా ప్రభుత్వంపై దుష్ప్రచారం తగదని హితవు పలికారు. సిపిఎం పైన, కేరళ ప్రభుత్వంపైన బిజెపి చేస్తోన్న అవాస్తవ ఆరోపణలపై చర్చించాలని, కేంద్ర ప్రభుత్వం సమాధానమివ్వాలని గురువారం ఆయన వాయిదా తీర్మానం ఇచ్చారు. ఆ తీర్మానంపై చర్చకు స్పీకర్ తిరస్కరించి, జీరో అవర్‌లో మాట్లాడేందుకు అవకాశమిచ్చారు.

కేరళ పరిణామాలపై బిజెపి ఎంపిలు, నాయకులు అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారని కరుణాకరన్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి పినరయి విజయన్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి కొడియరి బాలకృష్ణన్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, ఇలాంటి దుష్ప్రచారం తగదని హెచ్చరించారు. కేరళ విద్యా, వైద్యం, హౌసింగ్ తదితర రంగాల్లో ప్రగతి పథంలో నడుస్తోందని, దేశానికే దిక్సూచిగా నిలుస్తోందని గుర్తు చేశారు. దశాబ్దాలుగా లౌకిక విలువలను కాపాడుకుంటూ కేరళ పయనిస్తోందని వివరించారు. ప్రజా రంజక పాలన అందిస్తున్న ఇటువంటి ప్రభుత్వంపై బురద జల్లడం తగదని హితవు పలికారు. పలువురు సిపిఎం కార్యకర్తలను ఆరెస్సెస్, బిజెపి పొట్టన పెట్టుకున్నాయని విమర్శించారు. పలు మార్లు పార్టీ కార్యాలయాలు, ప్రజా సంఘాల కార్యాలయాలపై దాడి జరిగిందని వివరించారు. సిపిఎంను టెరరిస్టు పార్టీ అని ఆరోపించడం హాస్యాస్పదమని, బిజెపి, కాషాయమూకల దాడులు కేరళకే పరిమితం కాదని, ఢిల్లీలోని మా పార్టీ ప్రధాన కార్యాలయంపైన రెండు మూడు సార్లు దాడి చేశారని, ఏకంగా సిపిఎం ప్రధాన కార్యదర్శిపైనే దాడికి యత్నించారని, ఇతర రాష్ట్రాల్లో కూడా దాడులు కొనసాగుతున్నాయని, దీన్నిబట్టి ఏది టెరరిస్టు పార్టీయో అర్థమవుతుందని వ్యాఖ్యానించారు. "కేరళలో రాజకీయ హింసను, రాజకీయ హత్యలను రూపు మాపేందుకు సిపిఎం విధాన రూపకల్పన చేసింది. అందులోని భాగంగానే శాంతి సభలను నిర్వహిస్తోంది. ఆరెస్సెస్, బిజెపిల రాష్ట్ర నాయకత్వంతో ముఖ్యమంత్రి విజయన్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి సమావేశాలు నిర్వహించారు. రాజకీయ హింసకు ముగింపు పలకాలని వేడుకొన్నారు. ఆ సమావేశాలు జిల్లా స్థాయిల్లో కూడా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 9న అఖిల పక్ష సమావేశం నిర్వహిస్తున్నారు. దీన్ని గమనంలో పెట్టుకొని బిజెపి నేతలైన, ఎంపిలైన మాట్లాడాలి. అభివృద్ధిలో దేశానికే ఆదర్శప్రాయంగా నిలుస్తోన్న కేరళపై బురద జల్లడం తగదు" అని హితవు పలికారు.

ఈ దశలో కరుణాకరన్ ప్రసంగాన్ని అడ్డుకునేందుకు బిజెపి ఎంపిలు అరుపులు, కేకలతో సభలో గందరగోళాన్ని సృష్టించారు. దీంతో స్పీకర్ సభను వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమైన అనంతరం కరుణాకరన్ తన ప్రసంగాన్ని కొనసాగించేందుకు స్పీకర్ అవకాశమివ్వలేదు. దీంతో కరుణాకరన్‌తో పాటు సిపిఎం సభ్యులు ఎం.డి సలీం, శ్రీమతి టీచర్, ఎం.బి రాజేష్, పి.కె బిజూ, జితేంద్ర చౌదరి, శంకర్ ప్రసాద్ దత్తు, ఎ.సంపత్, భద్రుద్దజా ఖాన్‌లు ఆందోళన చేపట్టారు. ఈ దశలో కరుణాకరన్‌కు స్పీకర్ మళ్లీ అవకాశమిచ్చినా రెండు నిమిషాలైనా మాట్లాడకుండానే మైక్ కట్ చేశారు. దీంతో స్పీకర్ సుమిత్రా మహాజన్, బిజెపి ఎంపిల తీరుపైన సిపిఎం సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే బిజెపికి చెందిన ఎంపిలు అరుపులు, కేకలు వేస్తూ సభలో గందరగోళం సృష్టించారు. కరుణాకరన్‌ను మాట్లాడనివ్వకుండా అడ్డుకునేందుకు కుటిల ప్రయత్నం చేశారు. కాని కరుణాకరన్ తన ప్రసంగాన్ని కొనసాగించారు. రెచ్చిపోయిన అధికార బిజెపి సభ్యులు గట్టిగా కేకలు వేయడం ప్రారంభించారు. సభను సజావుగా జరగనివ్వకుండా అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో సిపిఎం లోక్‌సభ పక్ష ఉపనేత ఎం.డి సలీం స్పీకర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ సభ్యులు ఎంతో సమయనం పాటిస్తోన్నారు. అయినా మాపై బురద జల్లి, మా హక్కును కాలరాస్తోన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధం" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి సభ్యుల ప్రవర్తనపై సభలోని ఇతర పార్టీల సభ్యులు నివ్వెరపోయారు. కాంగ్రెస్ ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే,ఉపనేత జ్యోతిరాధిత్య సింధియా, కాంగ్రెస్ ఎంపిలు కె.సి వేణుగోపాల్, సురేష్, స్వతంత్ర ఎంపిలు లేచి అధికార పార్టీ సభ్యుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో స్పీకర్ సభను వాయిదా వేశారు

గోవా ప్రభుత్వానికి దక్కని ఉపశమనం

బ్రిక్స్ ఆహార కుంభకోణం కేసులో 'స్టే'కు హైకోర్టు నో

పనాజీ : 2016లో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా పోలీసులకు అందించిన నాసిరకమైన భోజనానికి సంబంధించిన కుంభకోణంలో గోవా ప్రభుత్వానికి ఉపశమనం లభించలేదు. ఈ కేసు విచారణపై స్టే ఇవ్వడానికి హైకోర్టు తిరస్కరించింది. ఈ కేసు విచారణలో ప్రభుత్వ వాదనలను విచారించడాన్ని కోర్టు తోసిపుచ్చింది. 'పోలీసు ఫుడ్ స్కాం'కు సంబంధించి గోవా హ్యూమన్ రైట్స్ కమిషన్ (జిఎస్‌హెచ్‌ఆర్‌సి) జారీ చేసిన ఆదేశాలపై ఆ రాష్ట్ర ప్రభుత్వం కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. కోర్టులో న్యాయవాది ఎయిరీస్ రోడ్రిగాస్ దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు వాదనలు ఆలకించింది. రూ.51 లక్షలకు టెండర్ వేసి సాధారణమైన ఆహారం అందించారని కోర్టుకు వివరించారు. ఎయిరీస్ తన వాదనలు వినిపిస్తూ ప్రధాన కాంట్రాక్టర్ దాన్ని రోడ్డు పక్కన ఉండే సాధారణ కాంట్రాక్టర్‌కు ఇచ్చాడన్నారు. వర్ణిలోని పోలీసుశాఖ పరిధిలోని సముదాయాల్లో ఆహార పదార్థాలను సిద్ధం చేశారన్నారు. ఫుడ్ కాంట్రాక్టుకు సంబంధించి ప్రభుత్వం ఏ విధంగా కాంట్రాక్టర్‌తో చీకటి ఒప్పందం చేసుకుందో న్యాయవాది ఎయిరీస్ వివరించారు. సరైన ప్రమాణాలు పాటించకుండా పౌష్టిక విలువలు లేని ఆహారాన్ని పోలీసులకు అందించారన్నారు.

బీహార్‌లో గోగూండాల దాడి

బిజెపి అధికారంలోకి వచ్చిందనడానికి ఇది సూచన : ఏచూరి

భోపాల్/పాట్నా: బీహార్‌లో జెడి(యు)తో జతకట్టి బిజెపి అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే గోగూండాలు రెచ్చిపోయారు. బీఫ్ తీసుకెళ్తున్నారనే ఆరోపణతో గురువారం ఓ ట్రక్కుపై దాడి చేసిన ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మరో వైపు గోగూండాల దాడిపై సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్పందించారు. బిజెపి తిరిగి అధికారంలోకి వచ్చిందనడానికి సూచికగా ఈ దాడిని పరిగణించవచ్చునని వ్యాఖ్యానించారు. నితీశ్ కుమార్ సిఎంగా కొనసాగుతున్నప్పటికీ ఇకపై హిందుత్వ విధానాలే అమలౌతాయని పేర్కొన్నారు. మరోవైపు గోగూండాల దాడిలో గాయపడ్డ ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసి ట్రక్కులోని మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. భోజ్‌పూర్ జిల్లాలో అక్రమంగా నిర్వహిస్తున్న పశువధ శాల నుంచి ఆ మాంసాన్ని కొనుగోలు చేసినట్లు జిల్లా మెజిస్ట్రేట్ సంజీవ్ కుమార్ తెలిపారు. తదుపరి పరీక్షలకు ఆ మాంసాన్ని పంపించామన్నారు. అనుమతి లేకుండా నిర్వహిస్తున్న వధశాలలు మూసివేయాలని కోరుతూ 84వ జాతీయరహ దారిపై కొంతమంది నిరసనలు తెలిపారు.

మధ్యప్రదేశ్‌లో మరో ఘటన..

ఆవులను అక్రమంగా తరలిస్తున్నారన్న అనుమానంతో మధ్యప్రదేశ్‌లో నలుగురు వ్యక్తులపై గోగూండాలు దాడి చేసి గాయపర్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బేటుల్ జిల్లా మారుమూల గ్రామంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే ఆవులను తరలిస్తున్నట్లు చెబుతున్న వ్యక్తులను అరెస్ట్ చేశామని, దాడి చేసిన వారు పరారయ్యారని పోలీసులు చెబుతుండటం విశేషం. గత వారం జరిగిన ఈ వీడియో సోషల్ మీడియాలో వెలుగు చూసిన తరువాత పోలీసులు దాడి చేసిన వారిపైన, అక్రమ తరలింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై వేర్వేరుగా కేసులు నమోదు చేశారు.

'విర్జిన్' స్థానంలో 'అన్‌మ్యారిడ్'

'కన్య' స్థానంలో 'అవివాహిత'

నష్ట నివారణ చర్యలపై బీహార్ మంత్రి

పాట్నా: 'కన్య' అంటే 'వివాహం కానీ స్త్రీ' అని బీహార్ ఆరోగ్యశాఖ మంత్రి మంగళ్‌పాండే వివరణ ఇచ్చాడు. ఒక ప్రభుత్వ ఆస్పత్రి దరఖాస్తు నమూనాలో వైద్యులు, సిబ్బంది 'కన్య', 'ఎన్నిసార్లు వివాహం అయ్యింది' అనే సూచికలను నమోదు ఫారంలో పొందు పరిచారు. దీనిపై మంగళ్‌పాడే వివరణ ఇస్తూ 'విర్జిన్' పదంపై తాను నిఘంటువును చూశానని దానిలో 'కన్య', 'కుమారి' (వివాహం కాని బాలిక) అని ఉందన్నారు. దీనిపై అభ్యంతరం తెలపడానికి ఏమీ లేదన్నారు. అయితే ఈ ప్రకటనలు చేసిన కొన్ని గంటల్లోనే దీనిపై సవరణలు చేశారు. పాట్నాలోని ఇందిరాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో సిబ్బంది నియామకానికి విడుదల చేసిన దరఖాస్తు ఫారంలో 'బ్యాచులర్, వీడోవర్స్ ఆర్ వర్జిన్స్ (కన్య)' లేదా వివాహం అయ్యిందా? అని దరఖాస్తు నమోనాలో పొందుపరిచారు. పురుషులకు ఒకరికంటే ఎక్కువ మంది భార్యలున్నారా? వంటి ప్రశ్నలు అడిగారు. దీనిపై సామాజిక మాధ్యమాల్లో నెటిజెన్‌లు మంత్రిని చివాట్లు పెట్టడంతో తక్షణమే దరఖాస్తు ఫారంలో మార్పులు చేశారు. 'విర్జిన్' స్థానంలో 'అన్ మ్యారిడ్' అని మార్పులు చేశారు. ఇదే ఫారాన్ని ప్రాథమికంగా ఢిల్లీ ఎయిమ్స్‌లో ఉపయోగించినట్లు తెలిపారు.

ప్రణబ్‌కు ప్రధాని లేఖ

న్యూఢిల్లీ: భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ తనకు తండ్రితో సమానమని ప్రధాని నరేంద్రమోడీ పేర్కొన్నారు. రాష్ట్రపతి పదవికి ముఖర్జీ వీడ్కోలు పలికిన సందర్భంగా ఆఖరి రోజు మోడీ లేఖ రాశారు. ఈ లేఖలో ప్రణబ్‌పై ప్రశంసల జల్లు కురిపించారు. తామిద్దరం ఒకరితో ఒకరు కలిసి పనిచేశామన్నారు. వారి విభిన్నమైన రాజకీయ భావజాలాలు అడ్డంకి కాలేదన్నారు. ముఖర్జీకి వివిధ రంగాలపై అపారమైన అవగాహన ఉందని గొప్ప మేథో సంపత్తి అతని సొత్తని పేర్కొన్నారు. ప్రభుత్వానికి తనకు పూర్తి సహాయ సహకారాలు అందించారన్నారు. రాజకీయాలు అంటే సమాజానికి నిస్వార్థంగా సేవచేయడమే అని పేర్కొన్నారు. ముఖర్జీ జ్ఞానసంపత్తి, సూచనలు, ఆత్మీయత తనకు స్ఫూర్తి నిచ్చాయనీ, ధైర్యాన్ని కలిగించాయనీ అన్నారు.

20 మంది భారతీయుల వివరాలున్నాయి

స్విస్‌బ్యాంకు ఖాతాలపై మాజీ ఉద్యోగి

జ్యూరిచ్: స్విస్ బ్యాంకులోని ఖాతాల సమాచారాన్ని బట్టబయలు చేసిన కేసులో గత 12 ఏళ్లుగా న్యాయ పోరాటం చేస్తున్న రుడాల్ఫ్ ఎల్మర్ అనే మాజీ ఉద్యోగి మరో సంచలనానికి తెరతీశాడు. తన వద్ద 20 మంది భారతీయుల ఖాతాల సంబంధించిన సమాచారం ఉందని ఇటీవల పేర్కొన్నారు. ఆ జాబితాలో రాజకీయ నేతలు, నటులు, క్రికెటర్లు ఉన్నారని రుడాల్ఫ్ పేర్కొన్నారు. గతంలో కొంతమంది ఖాతాల వివరాలను బట్టబయలు చేయడంతో 2002లో ఆయన్ను విధుల్లోంచి స్విస్ బ్యాంకు తొలగించింది.

అమ్మ భాషకు ఆఖరి దినాలు

సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 130 కోట్లమంది ప్రజలు మాట్లాడుతున్న భాషల్లో సగం అంపశయ్యపై ఉన్నట్లుగా తాజా సర్వేలో వెల్లడైంది. వచ్చే 50 ఏళ్లలో ఈ భాషలు అంతరించిపోనున్నట్లు పీపుల్స్ లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా(పిఎస్-ఎల్ఐ)' చేసిన సర్వేలో వెల్లడైంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సుమారు 780 భాషలు వాడుకలో ఉన్నాయని, 2067 నాటికి సుమారు 400 భాషలు కనుమరుగయ్యే సూచనలు ఉన్నాయని పిఎస్ఎల్ఐ ఛైర్మన్ జిఎన్ డెవీ చెప్పారు. గత 50 ఏళ్లలో 250 భాషలు అంతరించిపోయాయన్నారు. భాషతో పాటే ఆయా సంస్కృతులు కూడా కనుమరుగౌతున్నట్లుగా ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఆదివాసీ సంస్కృతులు, భాషలు ముందుగా కనుమరుగయ్యే పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం గుర్తించిన 22 అధికార భాషల్లోనే పాఠశాలల్లో బోధన ఉండటంతో గిరిజన విద్యార్థులు తమ మాతృభాషకు దూరమవ్వనున్నారని పేర్కొంది.

తెలుగు రాష్ట్రాల్లో సర్వేల జపం

- జనం నాడి చెబుతామంటూ ముందుకొస్తున్న సర్వే సంస్థలు
- పీపుల్స్ పల్స్, సిఎస్‌డిఎస్, చాణక్య, నీల్స్‌మార్గ్ రాక
- స్వీయ సర్వేలతో చంద్రబాబు, కెసిఆర్ హల్‌చల్



వైసిపి రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో కొత్త ట్రెండ్ మొదలైంది. రాజకీయ పార్టీలు కష్టపడకుండా ప్రజల నాడిని తెలుసుకుంటామని పలు సర్వే సంస్థలు పుట్టుకొస్తున్నాయి. గతంలో మాదిరి రాజకీయ పార్టీలు, నాయకులు నిరంతరం గ్రామాల్లో ఉండాల్సిన అవసరం లేదు. ప్రజలు ఏ విషయాల్లో కోపంగా ఉన్నారు, ఎక్కడ అనుకూలంగా ఉన్నారు. వారు ఏమి కోరుకుంటున్నారు. కార్యకర్తల మధ్య చీలిక ఎందుకు వచ్చింది. వారిని ఏ రకంగా బుజ్జగించాలి. వారికి ఏమి కావాలన్నది తమ మద్దతుదారులను పంపించి అష్టకష్టాలు పడాల్సిన పనీ లేదు. ఆ పని మేమే చేస్తామంటున్నాయి సర్వేల సంస్థలు. ఏయే పార్టీకి, ఏ నాయకుడికి ఏ ప్రాంతంలో ఎలా ఉంది, ఏ సామాజికవర్గం ప్రజలు దూరంగా ఉన్నారు. వారు ఏమి కోరుకుంటున్నారు, దూరంగా ఉన్నవారిని దగ్గరకు చేర్చుకోవడానికి ఏమి చేస్తే బాగుంటుంది అన్ని వర్గాల మనోగతం ఆధారంగా పూర్తిస్థాయి నియోజక, రాష్ట్రస్థాయి నివేదికను అందిస్తామంటున్నాయి. నియోజకవర్గానికి పది లక్షలు ఖర్చు పెట్టుకోగలిగితే ఎన్నికల నాటికి పూర్తి ముఖ చిత్రాన్ని అందించి, గెలుపుబాటకు మార్గాలు వేస్తామని చెబుతున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో ప్రశాంత్‌కుమార్ (ఐ ప్యాక్ సంస్థ) వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి సలహాలు అందిస్తున్న విషయం తెలిసిందే.

తాజాగా ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ రాష్ట్రంలోనూ కేంద్రీకరించి పనిచేయడానికి పీపుల్స్ పల్స్ కూడా ముందుకొచ్చింది. ఈ సంస్థతో ఆయా రాజకీయ పార్టీల నేతలు వ్యక్తిగతంగా కలిసి చర్చించినట్లు తెలిసింది. జనం నాడిని తెలుసుకుని ఏమి చేస్తే గెలవగలరో, ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు ఓడటానికి ఎలా చేస్తే బాగుంటుందో రాజకీయ పార్టీలకు పరిణామాలను తెలియజెబుతామని పీపుల్స్‌పల్స్ సంస్థ నిర్వాహకులు బత్తుల సురేష్‌బాబు, నరసింహారెడ్డి తెలిపారు. ఇంకా సిఎస్‌డిఎస్ (లోక్‌నీతి), చాణక్య, నీల్స్‌మార్గ్ వంటి తదితర సంస్థలు కూడా పనిచేస్తున్నాయి.

తెలంగాణలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు స్వయంగా నియోజకవర్గాల వారీగా ఒక సంస్థతో సర్వే చేయించిన వివరాలు వెల్లడించారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే 106 స్థానాలు టిఆర్ఎస్ పార్టీనే గెలుస్తుందని సర్వేలో వచ్చిందని పేర్కొన్నారు.

ఏపిలో ప్రశాంత్ కిషోర్ సలహాలతోనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వచ్చే ఎన్నికలకు సిద్ధమవుతున్నది. ఎన్నికలకు రెండేళ్ల సమయం ఉండడంతో ప్రతీ నాలుగు నెలలకోసారి నియోజకవర్గ ముఖచిత్రాన్ని ఆ సంస్థ జగన్‌కు అందించనుంది. ఎన్నికల వరకు ఆ సంస్థ జగన్ పార్టీకి పూర్తిగా పనిచేయనుంది. ఆ సంస్థ సర్వేలో వచ్చిన ప్రజల నాడి ఆధారంగానే తమ నాయకుడు కార్యక్రమాలు చేపడుతున్నారని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఇటీవల జరిగిన జరిగిన ప్లీనరీలోనూ ప్రశాంత్‌కిషోర్ హాజరుకావడం, ఆయన వల్లే కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిందని జగన్ చెప్పిన విషయం తెలిసిందే. ప్రశాంత్ వల్లే నరేంద్రమోడీ ప్రధాని అయ్యారని బిజెపి నేతలు చెబుతుంటారు. బిజెపి అధికారంలోకి రావడానికి మీడియా సంస్థలను గుప్పిట్లో పెట్టుకోవడం, పెద్దపెద్ద పారిశ్రామికవేత్తలకు అనుకూల నిర్ణయాలు తీసుకోవడం, పేద, మధ్యతరగతి ప్రజలు, ఇలా అన్నివర్గాల ఓటర్ల దరిచేరడం కోసం కొన్ని హామీలు ఇవ్వడం చేసింది. నరేంద్రమోడీని సోషల్ మీడియాలో ఆకాశానికెత్తింది. అధికారంలోకి రావడానికి ఇలాంటి సంస్థలు పనిచేస్తాయి తప్ప, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ప్రభుత్వాలు ప్రజల కోసం మంచిగా పనిచేస్తాయా లేదా అన్నది మాత్రం చెప్పబోవని పలువురు నేతలు తెలిపారు. ప్రస్తుతం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఏమి చేస్తుందనేది అందరికీ తెలిసిందేనని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు అదే మార్గంలో మిగతా పార్టీలు వెళుతున్నాయి. ఏపి, తెలంగాణ రాష్ట్రాల్లో ఇద్దరు ముఖ్యమంత్రులు మూడు నెలలకోసారి ఎమ్మెల్యేల పనితీరుపై సర్వేలు చేయించుకుంటున్న విషయం తెలిసిందే.

శాస్త్రీయత ఉందా..?

అయితే సంస్థల సర్వేల్లో శాస్త్రీయత ఉండడం లేదన్న అభిప్రాయం ఉంది. ఆ సంస్థ ఎవరిని కలిసింది. ఓటర్లు ఏమి కోరుకుంటున్నారు, ఎంతమందిని కలిశారు, శాస్త్రీయబద్ధంగా జరిగిందా, శాంపిల్స్ ఏమిటి అన్న వాటిని పక్కనపెట్టేసి, తూతూమంత్రంగా సర్వే చేస్తున్నాయి. ఊర్లో ఒకరిద్దరిని కలిసి అదే ప్రామాణికం అన్నట్టుగా సర్వే రిపోర్టును వెల్లడిస్తున్నాయి. ఇతర పార్టీలకు బలంగా ఉన్నచోట్ల కూడా మరోపార్టీ బలంగా ఉందని చెప్పడమంటే ఇందులో భాగమే. ఆ పార్టీని బలహీనపరిచి, ఓటర్లలో లేనిపోని గందరగోళాన్ని గురిచేయడమే అవుతుంది. ఇప్పటివరకు ఐఎస్‌డిఎస్ (లోక్‌నీతి) సంస్థ వాస్తవానికి దగ్గరగా ప్రజల వద్దకు వెళ్లి సర్వే చేసిందని పలువురు చెబుతున్నారు. అందులో రజనీకోఠారి, యోగేంద్రయాదవ్, కేసీ సూరి, సందీప్‌శాస్త్రి, సంజయ్‌కుమార్ వంటివారు ఉన్నారు. ఆ దిశగా తమ సంస్థ ఉంటుందని పీపుల్స్‌పల్స్ నిర్వాహకులు చెబుతున్నారు. గెలిపిస్తామని చెప్పకుండా ప్రజలకు ఏమి చేస్తే గెలుస్తారన్నది మాత్రం చెప్పగలమని అంటున్నారు. సర్వేకు సంబంధించి ప్రశ్నలను కూడా రాజకీయ పార్టీలకు ముందుగానే అందించనున్నారు.

సైన్యాన్ని ఉపసంహరించుకోకపోతే తీవ్రపరిణామాలు : చైనా

న్యూఢిల్లీ: తన భూభాగాన్ని పరిరక్షించుకుంటానికి అన్ని చర్యలు తీసుకుంటుందని చైనావిదేశాంగశాఖ బుధవారం నాడువిడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేసింది. డోక్లాం వద్ద భారత్ సైన్యం తన భూభాగంలోకి ప్రవేశించిందని ఆరోపిస్తున్న చైనా భారత్ తక్షణమే తన బలగాలను ఉపసంహరించుకోవాలని, లేకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రకటనలో హెచ్చరించింది. చైనా, భూటాన్ సరిహద్దు సమస్య మా రెండు దేశాలకు సంబంధించినది. ఈ వివాదంతో భారత్‌కు సంబంధం లేదని చెప్పింది. సిక్కిం సెక్టార్‌లో భారత సైన్యాలు చైనా భూభాగంలోకి ప్రవేశించాయని ఆరోపించింది. చైనా, భూటాన్ మధ్య జరుగుతున్న సరిహద్దు చర్చల్లో జోక్యం చేసుకునే హక్కు భారతదేశానికి లేదని పేర్కొంది. ఈ వివాదం ప్రారంభమైనప్పటి నుండి చైనా పూర్తి సంయమనం పాటించిందని , సౌహార్ద్రపూరితంగా సమస్యను పరిష్కరించుకోవటానికి ప్రయత్నం చేస్తున్నామని, పరస్పర చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవటానికి ప్రయత్నం చేస్తున్నామని పేర్కొంది. గురువారం నాటికి కూడా 48 మంది భారత సైనికులు తమ భూభాగంలో ఉన్నారని, భారత సైనికులు తమ సార్వభౌమత్వాన్ని ధిక్కరించటాన్ని తాము సహించమని చైనా విదేశాంగశాఖ ప్రతినిధి పేర్కొన్నాడు.

చర్చల ద్వారా పరిష్కరించుకుంటాం: సుష్మాస్వరాజ్

చైనాతో సరిహద్దు సమస్య యుద్ధం ద్వారా పరిష్కారం కాదని, చర్చల ద్వారానే పరిష్కరించుకుంటామని విదేశాంగశాఖామంత్రి సుష్మాస్వరాజ్ రాజ్యసభలో చెప్పారు. సమస్యను పరిష్కరించటం కోసం తాము చైనాతో సంబంధాలలోనే ఉన్నామని సభ్యుల ప్రశ్నలకు సమాధానంగా సుష్మ చెప్పారు. చర్చల సందర్భంలో చైనాతో కొనసాగుతున్న ప్రతిష్ఠంభనపై సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఏ పరిస్థితి ఎదురైనా ఎదుర్కోవటానికి సైన్యం సిద్ధంగా ఉన్నదని, కాని యుద్ధం సమస్యలను పరిష్కరించదని, వివేకంతో సమస్యలను పరిష్కరించుకోవాలని ఆమె చెప్పారు. బుధవారం భారత విదేశాంగ శాఖ ప్రతినిధి మాట్లడుతూ భారత, చైనా సరిహద్దులో శాంతియుత పరిస్థితులలోనే ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపగతాయని చెప్పారు.

జెఎన్‌యులో విద్యార్థి రాజకీయాలపై ఉక్కుపాదం

క్యాంపస్‌లో భయానక వాతావరణం కల్పిస్తున్నారని విద్యార్థుల ఆందోళన

న్యూఢిల్లీ : గత ఏడాది ఫిబ్రవరి 9వ తేదీన జరిగిన ఘటనల అనంతరం హస్తినలోని జవహర్లాల్ నెహ్రూ యూనివర్శిటీలో పాలక వర్గం విద్యార్థి రాజకీయాలపై ఉక్కుపాదం మోపుతోందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యూనివర్శిటీ ఆవరణలో భద్రతా బలగాలను మోహరించటంతో పాటు ఉద్దేశపూర్వకంగానే ఐపిసి 124ఎ వంటి కఠిన నిబంధనలను అమలు చేయటం వంటి చర్యలు తమను కట్టడి చేయటానికి ఉద్దేశించినవేనని ఆరోపిస్తున్నారు. అంతేకాక విద్యార్థులు, అధ్యాపకులకు ఏకపక్షంగా నోటీసులు జారీ చేయటం, విచారణకు హాజరు కావాలనటం, భారీ మొత్తాలలో జరిమానాలు విధించటం వంటి చర్యలకు యూనివర్శిటీ పాలక వర్గం పాల్పడుతోందని విద్యార్థులు చెబుతున్నారు. బిజెపి-ఆరెస్సెస్‌కు అనుబంధంగా వున్న అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కు చెందిన సభ్యుల తప్పుడు ఫిర్యాదులపై యూనివర్శిటీ యాజమాన్యం ఈ నోటీసులు పంపుతోందంటున్నారు.

విద్యార్థి-ఉపాధ్యాయ సంబంధాలను ఛిద్రం చేసే యత్నం

యూనివర్శిటీలో విద్యార్థులు-అధ్యాపకుల మధ్య కొనసాగుతున్న సుహృద్భావ వాతావరణాన్ని, అనుబంధాన్ని విచ్ఛిన్నం చేసేందుకు యాజమాన్యం ప్రయత్నిస్తోంది. ఒక విద్యార్థికి మాత్రమే ఉద్దేశించిన నోటీసును ఐదారుగురు విద్యార్థులకు పంపటం ఇందుకు ఉదాహరణ అని విద్యార్థులు చెబుతున్నారు. వాస్తవానికి ప్రస్తుత వైస్ ఛాన్సలర్ విద్యార్థులు రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇటీవలి కాలంలో తమ సమస్యలపై గొంతెత్తుతున్న విద్యార్థులను అణచివేసేందుకు కొత్త కొత్త నిబంధనలు అమలులోకి తెస్తున్నారు. ఎక్కడ నిరసన తెలపాలి, ఎలా తెలపాలి, ఏం చర్చించాలి వంటి అంశాలపై తమను యాజమాన్యం శాసిస్తోందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మరో వైట్‌హౌస్ అధికారిపై వేటు

ఇంటెలిజెన్స్ డైరెక్టర్ ఎజ్రా కోహెన్ తొలగింపు



వాషింగ్టన్ : తాజాగా వైట్‌హౌస్‌కు చెందిన మరో వ్యక్తిపై వేటు పడింది. ప్రస్తుతం కొనసాగుతున్న వైట్‌హౌస్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఇంటెలిజెన్స్ డైరెక్టర్, ట్రంప్ జాతీయ భద్రతా సహాయకుడు ఎజ్రా కోహెన్-వాట్నిక్‌ను తొలగించారు. ఆయనను ఎందుకు తొలగించాల్సి వచ్చిందో వైట్‌హౌస్ వెల్లడించలేదు. ఎజ్రా కోహెన్ నాయకత్వంలో జాతీయ భద్రతా మండలిలోని ఇంటెలిజెన్స్ విభాగం చాలా బాగా పనిచేసిందని ట్రంప్ జాతీయ భద్రతా సలహాదారు జనరల్ మెక్‌మాస్టర్ అభినందించారు. మార్చి నెల్లో ఆందోళనలు తలెత్తినపుడు కోహెన్ వాట్నిక్ స్థానంలో మెక్‌మాస్టర్ నియమించాలని భావించారు. అయితే ఆ సమయంలో ట్రంప్‌తో మాట్లాడి తన పదవిని కాపాడాల్సిందిగా ట్రంప్ అత్యున్నత సలహాదారులను వాట్నిక్ కోరారు. 'ఎజ్రా మరో పదవిలో ఉండి జాతీయ భద్రతా విశేషాల్లో సేవలందించగలరని భావిస్తున్నట్లు జనరల్ మెక్‌మాస్టర్ విశ్వాసం వ్యక్తం చేశారని వైట్‌హౌస్ ఒక ప్రకటనలో పేర్కొంది. అయితే ఇప్పుడు కోహెన్ వాట్నిక్ కొత్తగా ఇవ్వబోయే పదవి ఏమిటనేది వివరాలు వెల్లడి కాలేదు. ట్రంప్ పరివర్తనా బృందంలో కోహెన్ సభ్యుడు.

'అనర్హత'పై సమీక్ష కోరనున్న నవాజ్ షరీఫ్ కుటుంబం

లాహోర్: మాజీ ప్రధాని నవాజ్‌షరీఫ్‌పై అనర్హత వేటు వేస్తూ వెలువరించిన తీర్పును పున:సమీక్షించాలని కోరుతూ సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయనున్నట్లు షరీఫ్ కుటుంబం తరపు న్యాయవాది ఖ్వాజా హారిస్ చెప్పారు. తీర్పు అధీకృత ప్రతి అందుకున్న 30 రోజుల్లోగా రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలన్న సుప్రీంకోర్టు నిబంధనల మేరకు తాను ఈ పిటిషన్‌ను త్వరలోనే అందజేస్తానని ఆయన వివరించారు. రాజ్యాంగంలోని 62వ అధికరణ (1)(ఎఫ్) ప్రకారం సుప్రీంకోర్టు వెలువరించిన అనర్హత తీర్పు సహేతుకమైనది కాదని తాను భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. రాజ్యాంగంలోని 184వ అధికరణ (3) ప్రకారం కూడా ఈ పిటిషన్‌ను దాఖలు చేయవచ్చని ఆయన వివరించారు. అయితే ఈ తీర్పును రద్దు చేసే అవకాశాలు స్వల్పమేనని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. అయితే షరీఫ్ తరపు న్యాయబృందంలోని మరో న్యాయవాది మాట్లాడుతూ కోర్టు విధించిన యావజ్జీవిత నిషేధాన్ని మాత్రమే షరీఫ్ కుటుంబం సవాలు చేయటానికి అవకాశం వుందన్నారు.

ఆంక్షల కన్నా... ఆర్థిక సయోధ్య మిన్న...!

ఉ.కొరియాపై అమెరికాకు నిపుణుల సూచన



వాషింగ్టన్/పాంగ్యాంగ్ : ఉత్తర కొరియాపై ఆంక్షలు విధించి కయ్యానికి కాలు దువ్వటం కన్నా ఆ దేశంతో ఆర్థిక సయోధ్య కొనసాగిస్తేనే మెరుగైన ఫలితాలుంటాయని నిపుణులు అమెరికాకు సూచిస్తున్నారు. గత కొన్నేళ్లుగా అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు దూరంగా వుంటున్న ఉ.కొరియా ప్రచ్ఛన్న యుద్ధ సమయంలో సైతం ఎటూ మొగ్గకుండా స్వతంత్ర ఆర్థిక వ్యవస్థగానే కొనసాగటమే కాక తన సొంత ఉత్పత్తుల కోసం పెట్టుబడులను పెంచిందని వారు గుర్తు చేస్తున్నారు. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థతో మమేకమైన ద.కొరియా ప్రపంచంలో ప్రముఖ ఎగుమతుల దేశంగా ఎదిగినప్పుడు సైతం ఉ.కొరియా అంత ర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు దూరంగానే వుంది. తమ ఈశాన్య ప్రాంతంలో ప్రత్యేక ఆర్థిక మండలిని ఏర్పాటు చేయటంతో పాటు విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు చట్టాలలో కూడా మార్పు చేసింది. వాణిజ్య ప్రదర్శనలు ఏర్పాటు చేసి విదేశాలకు తన ఉత్పత్తులను విక్రయించింది. చైనాతో స్నేహ సంబంధాలు కొనసాగిస్తున్నా, చైనా సూచనలను, వత్తిళ్లను పలుమార్లు పెడచెవిన పెట్టిన సందర్భాలూ ఉన్నాయి. రష్యా విషయంలో సైతం ఉ.కొరియా ఇదే వైఖరిని అనుసరించింది. తమ సార్వభౌమత్వ విషయంలో జోక్యం చేసుకునేందుకు ఏ ఇతర దేశాన్నీ అనుమతించలేదు. తాజాగా మరిన్ని ఆర్థిక ఆంక్షలు విధిస్తూ అమెరికన్ కాంగ్రెస్ ఒక బిల్లును ఆమోదించింది. ఉ.కొరియాకు వ్యతిరేకంగా విధించిన ఈ ఆంక్షల ద్వారా ఆ దేశంలోకి పెట్టుబడులను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తుంది. ఉ.కొరియా నుండి బొగ్గును దిగుమతి చేసుకుంటూ ఆర్థిక లావాదేవీలు నిర్వహించే సంస్థలు ముఖ్యంగా చైనా సంస్థలు ఈ ఆంక్షలకు టార్గెట్‌గా మారనున్నాయి. ఇదే సమయంలో ఉ.కొరియా అణ్వాయుధ, క్షిపణి కార్యక్రమాలతో సంబంధం వున్న వ్యక్తులు, సంస్థలపై తాజా ఆంక్షలు విధించేందుకు ఐరాస స్థాయిలో అమెరికా, చైనా తీవ్రంగా కృషి చేస్తోంది.. దశాబ్దాల తరబడి ఇన్ని ఆంక్షలు కొనసాగుతున్నా ఉ.కొరియా ఆర్థిక వ్యవస్థ గత ఏడాది 4 శాతం మేర మెరుగైన వృద్ధి నమోదు చేసుకోవటం గమనార్హం. అదే విధంగా విదేశీ వాణి జ్యం సైతం 5 శాతం మేర వృద్ధి నమోదు చేసుకుంది. అందువల్ల ఆంక్షలు విధించి సాధించ గలిగిందేమీ లేదన్న విషయం స్పష్టమవు తోంది. అంతకన్నా ఆ దేశంతో ఆర్థిక సయోధ్య కొనసాగిస్తేనే మంచి ఫలితా లుంటాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

అమెరికన్ల ఉ.కొరియా పర్యటనలపై నిషేధం

అమెరికన్ పౌరులు ఉత్తర కొరియాలో జరిపే పర్యటనలపై సెప్టెంబర్ 1 నుండి నిషేధం విధి .స్తున్నట్లు అమెరికా విదేశాంగశాఖ ప్రకటించింది. ఇప్పటికే ఉ.కొరియాలో వున్న తమ దేశ పౌరులు తక్షణమే స్వదేశానికి బయల్దేరాలని ఆదేశించింది. అయితే పాత్రి కేయులు, మానవతా సహాయ కార్యకర్తలు ఈ నిషేధం నుండి మినహాయింపు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని విదేశాంగశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఉ.కొరియాలో దీర్ఘకాల నిర్బంధ ప్రమాదం వున్నందున తమ దేశ పౌరులు అక్కడ పర్యటించకుండా నిషేధం విధించనున్నట్లు అమెరికాలోని ట్రంప్ సర్కారు గత నెలలో ప్రకటించిన విషయం తెలిసిందే. అమెరికన్లు పర్యటించకుండా నిషేధానికి గురైన దేశం కేవలం ఉ.కొరియా ఒక్కటే కావటం విశేషం.

తగిన రీతిలో స్పందిస్తాం : ఇరాన్

టెహరాన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం తమపై విధించిన కొత్త ఆంక్షలు అణు ఒప్పంద నిబంధనలను ఉల్లంఘించాయని, వీటిపై సరైన సమయంలో సముచితమైన రీతిలో స్పందిస్తామని ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరక్చి తెలిపారు. ఈ ఆంక్షల విషయాన్ని 2015 ఒప్పంద పర్యవేక్షక కమిటీకి ఫిర్యాదు చేయనున్నట్లు ఇరాన్ తెలిపింది. ఆంక్షల నుండి ఉపశమనం కావాలంటే అణు కార్యక్రమాన్ని నిలిపివేసేందుకు ఇరాన్ ఆనాడు అంగీకరించింది. బరాక్ ఒబామా హయాంలో కుదిరిన ఇరాన్ అణు ఒప్పందాన్ని అత్యంత అధ్వాన్నమైన ఒప్పందంగా ట్రంప్ తన ఎన్నికల ప్రచార సమయంలో పేర్కొన్నారు. ఇరాన్‌తో పాటు రష్యా, ఉత్తర కొరియాలపై కొత్త ఆంక్షలు విధిస్తూ గతవారం అమెరికన్ కాంగ్రెస్ ఆమోదించిన బిల్లుపై ట్రంప్ సంతకం చేశారు. ఇరాన్ క్షిపణి అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టిందని, మానవ హక్కుల ఉల్లం ఘనలకు పాల్పడిం దని ఆ బిల్లు పేర్కొంటోంది. తమపై విధించిన ఆంక్షలకు రష్యా ధీటుగా స్పందించి, అమెరికా దౌత్య సిబ్బందిని తగ్గించాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇరాన్‌కు అమెరికాతో నేరుగా దౌత్య, వాణిజ్య సంబంధాల్లేవు, అందువల్ల ఇరాన్ అవకాశాలు చాలా పరిమితమని అరక్చి వ్యాఖ్యానించారు. అణు ఒప్పందాన్ని పూర్తిగా రద్దు చేయాలన్నది అమెరికా లక్ష్యంగా వుందని అన్నారు.

అణు ఒప్పంద నిబంధనలకు విరుద్ధంగా ఆంక్షలు

ఇది వాణిజ్య యుద్ధమే

ట్రంప్ చర్యపై రష్యా వ్యాఖ్య

వాషింగ్టన్ : రష్యాపై కొత్త ఆంక్షలు విధిస్తున్న బిల్లుపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంతకం చేయడాన్ని "వాణిజ్య యుద్ధం"గా రష్యా అభివర్ణించింది. ఇరు దేశాల మధ్య మరింత మెరుగైన సంబంధాలు నెలకొంటాయన్న ఆశలకు స్వస్తి పలుకుతూ పూర్తి స్థాయి వాణిజ్య యుద్ధానికి ట్రంప్ తెర లేపారని రష్యా పేర్కొంది. గత వారం ఈ బిల్లును అమెరికన్ కాంగ్రెస్ అత్యధిక మెజారిటీతో ఆమోదించింది. ఈ సంతకంతో ట్రంప్ ప్రభుత్వం ఎంత బలహీనమైనదో రుజువైందని రష్యా ప్రధాని డిమిత్రి మెద్వెదెవ్ వ్యాఖ్యానించారు.

ఆఫ్ఘన్ కమాండర్ తొలగింపుపై పరిశీలన

అధికారులను ఆదేశించిన ట్రంప్

ఆఫ్ఘన్ యుద్ధంపై అసహనం



వాషింగ్టన్ : ఆఫ్ఘనిస్తాన్‌లో యుద్ధం గురించి తలెత్తిన సందేహాలతో విసిగిపోయిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఆఫ్ఘన్‌లోని అమెరికా సైనిక కమాండర్‌ను వెంటనే తొలగించాల్సిందిగా సూచించినట్లు అధికారులు తెలిపారు. ఆఫ్ఘన్‌లో గత 16ఏళ్ళుగా తాలిబన్‌పై పోరాడుతున్నా ఇంతవరకు ముగింపనేది కనుచూపు మేరలో కనిపించకపోవడానికి గల కారణాలపై సమా చారం అందించాల్సిందిగా గత నెల 19న వైట్‌హౌస్‌లో జరిగిన సమావేశంలో ట్రంప్ తన జాతీయ భద్రతా సలహాదారులను కోరారు. ఆఫ్ఘన్‌లో అమెరికా కమాండర్ జనరల్ జాన్ నికొల్సన్‌ను తొలగించే విషయాన్ని పరిశీలించాలని రక్షణ మంత్రి జేమ్స్ మాటిస్, జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్ జోసెఫ్ డన్‌ఫోర్డ్‌లను ట్రంప్ ఆదేశించారు. ఆఫ్ఘన్ యుద్ధంలో అమెరికా ఓడిపోయేలా సైన్యం వ్యవహరిస్తోందని ట్రంప్ సమావేశంలో చేసిన వ్యాఖ్యలపై దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కొంతమంది అధికారులు అక్కడనుండి వెళ్ళిపోయారు.

అమెరికన్ సైనికులు మృతి

ఆఫ్ఘనిస్తాన్‌లో బుధవారం జరిగిన ఆత్మాహుతి దాడిలో ఇద్దరు అమెరికన్ సైనికులు మృతి చెందారు. కాందహార్ విమానాశ్రయానికి సమీపంలో వారు వెళుతున్న కాన్వాయ్‌పై జరిగిన దాడిలో వారు మరణించారని అమెరికా సైనికాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దాడికి తమదే బాధ్యత అని తాలిబన్ ప్రకటించింది. ఈ దాడితో ఆఫ్ఘన్‌లో వున్న 8400మంది అమెరికా బలగాలకు మరింత ముప్పు పొంచి వుందని వెల్లడైంది. కాగా దాడి విషయాన్ని ప్రకటించిన పెంటగన్ ప్రతినిధి, నావికాదళ కెప్టెన్ జెఫ్ డేవిస్ ఇతర వివరాలు వెల్లడించలేదు.

ఉత్తర కొరియాలో ఉద్రిక్తతలు పెంచొద్దు

చైనా విజ్ఞప్తి

బీజింగ్ : కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తతలు పెంచవద్దని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి గురువారం అన్ని పక్షాలకు విజ్ఞప్తి చేశారు. ఉత్తర కొరియా తాజాగా నిర్వహించిన క్షిపణి పరీక్షను చైనా ఇప్పటికే ఖండించిందని చెప్పారు. ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ ఆయన, ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తీర్మానాలను ఉల్లంఘించి ఉత్తరకొరియా నిర్వహించిన క్షిపణి పరీక్ష పట్ల తమ తీవ్ర వ్యతిరేకతను ఇప్పటికే వెల్లడించామని తెలిపారు. అయితే ఉద్రిక్తతలు రెచ్చగొట్టేందుకు దారి తీసే ఎలాంటి చర్యలకు పాల్పడవద్దని అన్ని పక్షాలను కూడా కోరుతున్నామని తెలిపారు. ఈ వారం చివరిలో మనీలాలో ఆసియాన్ ప్రాంతీయ ఫోరం సమావేశాలు జరగనున్న నేపథ్యంలో వాంగ్ వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఉత్తర కొరియాపై కఠిన చర్యలు చేపట్టాలని చైనా, ఇతర దేశాలపై అమెరికా ఒత్తిడి తీసుకురావచ్చని భావిస్తున్నారు.

ఈ సమావేశాలకు అమెరికా విదేశాంగ మంత్రి టిల్లర్‌సన్ హాజరు కానున్నారు. శాంతియుత మార్గాల ద్వారానే ఉత్తర కొరియాను ఒప్పించడానికి అమెరికా ప్రయత్నిస్తుందని టిల్లర్‌సన్ మంగళవారం చెప్పారు. కిమ్ ప్రభుత్వాన్ని కూల్చివేసే ఉద్దేశం కూడా తమకు లేదని తేల్చి చెప్పారు. ఉత్తర కొరియాపై టిల్లర్‌సన్ వ్యాఖ్యలకు తాము ప్రాధాన్యత ఇస్తున్నామని, తామనుకున్నవన్నీ విజయవంతంగా అమలు చేయగలదని భావిస్తున్నట్లు వాంగ్ తెలిపారు. భద్రతా సమస్యలు పరిష్కారమయ్యేలా త్వరగా ఒక పరిష్కారాన్ని కనుగొనడానికి అన్ని పక్షాలు చర్చలు జరపగలవని ఆశిస్తున్నట్లు వాంగ్ తెలిపారు.

ఆరోపణల ఊబిలో బ్రెజిల్ అధ్యక్షుడు

అనుకూలంగా 263 ఓట్లు



బ్రసీలియా : అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయిన బ్రెజిల్ అధ్యక్షుడు మైఖేల్ టెమర్‌పై ఆరోపణలను తిరస్కరిస్తూ బుధవారం పార్లమెంట్ దిగువ సభ ఓటు వేసింది. దీంతో ముడుపులు తీసుకున్నారని ఆరోపణలు ఎదు ర్కొంటున్న టెమర్, సుప్రీం కోర్టు విచారణ ఎదుర్కొ నాల్సిన పరిస్థితి తప్పిపోయింది. సుప్రీం విచారణ ఎదు ర్కొనాల్సివస్తే టెమర్ పదవికి ముప్పు వచ్చే ప్రమాదం ఎదురయ్యేది. తనపై నమోదైన అవినీతి కేసు సుప్రీం కోర్టుకెళ్ళ కుండా చూసేం దుకు అవసరమైన ఓట్లను టెమర్ సంపాదించుకోగలిగారు. అయితే ఆశించిన దానికన్నా తక్కువ ఓట్లే వచ్చాయి. దాంతో ఆయన అనుసరించాలనుకున్న ఆర్థిక ఎజెండా భవితవ్యంపై సందేహాలు తలెత్తుతున్నాయి. టెమర్‌కు అనుకూలంగా 263మంది డిప్యూటీలు ఓటు చేయగా, వ్యతిరేకంగా 227మంది ఓటు చేశారు. అంతకుముందు టెమర్‌కు 300 వరకు అనుకూల ఓట్లు వస్తాయని ప్రభుత్వ డిప్యూటీ విప్ బీటో మన్సూర్ అంచనా వేశారు. ఓటింగ్ అనంతరం టెమర్ మాట్లా డుతూ దేశానికి అవసరమైన సంస్కరణలన్నీ తప్పకుండా తమ ప్రభుత్వం తీసుకు వస్తుందని ప్రకటించారు. ఇక ఇప్పుడు దేశంలో పెట్టుబడులు పెట్టే సమయం ఆసన్నమైందని అన్నారు. తిరిగి ఎదగడాన్ని ప్రారంభించేందుకు బ్రెజిల్ సిద్ధంగా వుందన్నారు.

ఆయన 'మిస్టర్ ఆర్డినెన్స్'

జైట్లీపై కాంగ్రెస్ ఎంపీ విమర్శ

న్యూఢిల్లీ: లోక్‌సభ వేదికగా కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీపై కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌధురి విమర్శలు గుప్పించారు. 'మిస్టర్ ఆర్డినెన్స్' అంటూ జైట్లీని ఉద్దేశించి గురువారం చౌధురి వ్యాఖ్యలు చేశారు. ఎప్పుడుబడితే అప్పుడు పార్లమెంటులో ఆర్డినెన్స్‌లు ప్రవేశపెట్టి వాటిని చట్టాలుగా మారుస్తున్నారని అన్నారు. బ్యాంకింగ్ నియంత్రణ నిబంధనలు, జమ్మూకాశ్మీర్‌లో జిఎస్‌టి అమలుకు సంబంధించి పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్డినెన్స్‌లను ప్రస్తావిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. చౌధురి ప్రసంగం ఆసాంతం జైట్లీ నవ్వుతూనే కనిపించారు. కొంతమంది బిజెపి ఎంపీలు మాత్రం "జైట్లీని ఉద్దేశించి వ్యక్తిగతంగా గాకుండా ఆయన హోదాను ఉద్దేశించి కాంగ్రెస్ వ్యాఖ్యలు చేయాలి" అని తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

నంద్యాలతో నాంది

నంద్యాలలోని ప్రతి వీధికి, ప్రతి గ్రామానికి వస్తానని, శిల్పా మోహన్‌రెడ్డిని తిరుగులేని మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైసిపి ఎమ్మెల్యే రోజా మాట్లాడుతూ.. రాష్ట్ర భవిష్యత్‌ను మార్చే అరుదైన అవకాశం నంద్యాల ప్రజలకు వచ్చిందన్నారు. ఇక్కడి ఓటర్లు చంద్రబాబుకు గుణపాఠం చెప్పాలన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అవినీతి కుంభకోణాల్లో మునిగిపోయి ఎక్కడా అభివృద్ధి చేయలేదని, అంతా అరాచకమే సాగుతోందన్నారు. నంద్యాల ఉప ఎన్నిక వైసిపి అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను టిడిపిలో ఉన్నప్పుడు నంద్యాల అభివృద్ధి గురించి అడిగితే నిధులు లేవన్న చంద్రబాబు, ఇప్పుడు ఉప ఎన్నికల కోసం ప్రజల ధన్నాన్ని కుమ్మరిస్తున్నారని విమర్శించారు. తనపై టిడిపి నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, నంద్యాలలో ఎవరు ఏమిటో ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. కార్యక్రమంలో బొత్సా సత్యనారాయణ, అంబటి రాంబాబు, పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి, బివై.రామయ్య , గౌరు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పదవికి 'శిల్పా' రాజీనామా

తెలుగుదేశం ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన శిల్పా చక్రపాణిరెడ్డి గురువారం శాసన మండలి సభ్యత్వానికి కూడా రాజీనామా చేశారు. నంద్యాలలో వైసిపి అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి గెలుపును కోరుతూ ఆ పార్టీ నిర్వహించిన బహిరంగ సభలో స్పీకర్ ఫార్మాట్‌లో తన రాజీనామా లేఖను వైసిపి అధ్యక్షులు వైఎస్. జగన్‌మోహన్ రెడ్డికి అందించారు. ఈ సందర్భంగా శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్సీగా గెలుపొంది 90 రోజులే అయిందని, అంతకు ముందు 18 నెలల పాటే ఎమ్మెల్సీగా ఉన్నానన్నారు. టిడిపికి రాజీనామా చేశాక వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నైతిక విలువలున్న పార్టీ మనదని, రాజీనామా చేసి రమ్మన్నారని, అందుకే తాను ఈ బహిరంగ సభ సాక్షిగా రాజీనామా చేస్తున్నానన్నారు. టిడిపిలో చేరిన వైసిపి ఎమ్మెల్యేలకు దమ్ముంటే రాజీనామా చేయాలని ఛాలెంజ్ చేశారు. ఈ సందర్భంగా శిల్పా చక్రపాణిరెడ్డి రాజీనామాపై వైఎస్ జగన్ మాట్లాడారు.సంతలో పశువులను కొనుగోలు చేసినట్లు టిడిపి ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిందని విమర్శించారు. అలాంటి రాజకీయాలకు భిన్నంగా చెడిపోయిన రాజకీయ వ్యవస్థ మార్పు కోసం నంద్యాల వేదికగా ఉండాలని శిల్పా చక్రపాణిరెడ్డితో స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేయించామన్నారు. బాబు మాదిరి నీచ రాజకీయాలు చేయలేమని, టిడిపి ద్వారా వచ్చిన పదవిని వదులుకోవాలని చెప్పగానే ఎమ్మెల్సీ పదవిని వదులుకున్న శిల్పా చక్రపాణి రెడ్డిని 2019లో తాను ఎమ్మెల్యేగా చేస్తానని చెప్పారు.

'జన్మభూమి' ప్రక్షాళన

బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని చెప్పారు. బిసి కమిషన్ నివేదిక ఆధారంగానే కాపులకుయ రిజర్వేషన్లు అమలు చేయాల్సి ఉంటుందని సిఎం తెలిపారు. కాపు రిజర్వేషన్లపై త్వరలోనే నివేదిక వస్తుందని, విద్యా, ఉద్యోగ, సంక్షేమ పథకాల్లో మాత్రమే కాపులు రిజర్వేషన్లు కోరుకుంటున్నారని సిఎం నాయకత్వం దృష్టికి తీసుకొచ్చారు. జిల్లాల్లో మంత్రులూ స్థానిక నాయకత్వాన్ని కలుపుకొనిపోవాలని తెలిపారు. ఇన్‌ఛార్జి మంత్రులు ఈ విషయంలో జోక్యం చేసుకుని జిల్లాల్లో పార్టీని బలోపేతం చేయాల్సి ఉందని పేర్కొన్నారు.

మంత్రులపై ఆగ్రహం

పరిగణించాల్సిన అంశమని, సర్దిచెప్పినా కావాలని మీడియాకెక్కి ఇబ్బందికరంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక విధానంపైనా మంత్రులు స్పందించకపోవడం వల్లే సమస్యలు వచ్చాయని, దీనిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతొచ్చిందని, దీనివల్ల పార్టీకి నష్టం వాటిల్లుతుందన్నారు.

కిరోసిన్‌కూ కోత

(మొదటిపేజీ తరువాయి)

పెట్రోలియం రంగాన్ని పూర్తిగా బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు రచించిన వ్యూహంలో భాగంగానే పెట్రో ఉత్పత్తులపై రాయితీలను ప్రభుత్వం వరుసబెట్టి రద్దు చేస్తోందని పెట్రో రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. వివాదాలు, అలక్షిత రాయితీల మూలాన కార్పొరేటట్ కంపెనీలకు ఇబ్బందులు తలెత్తకుండా చేసేందుకు ఈ చర్యలు దోహదం చేస్తాయని వారంటున్నారు.

విద్యుద్దీకరణ, వంట గ్యాస్ కనెక్షన్ల మూలాన గ్రామాలలో కిరోసిన్ డిమాండ్ బాగా తగ్గింపోతోందని, అందువల్ల అనవసరమైన రాయితీలు ఇవ్వాల్సిన పనిలేనది సర్కార్ వాదిస్తోంది. ఢిల్లీ, ఛండీగఢ్ ఇప్పటికే కిరోసిన్ రహిత నగరాలుగా మారిపోయాయనీ, సబ్సిడీ కిరోసిన్‌ను డీజిల్‌ను కల్తీ చేసేందుకు వినియోగిస్తున్నారని చెబుతోంది. అందువల్ల రాయితీలు తగ్గించిన పేదల ప్రజలకు ఇబ్బందేమీ లేదని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కార్యాలయ వర్గాలు వాదిస్తున్నాయి. ప్రధాన్ హయంలో దేశంలో కొత్తగా దాదాపు 2.5 కోట్ల కుటుంబాలకు వంట గ్యాస్ కనెక్షన్లు ఇచ్చారనీ, ఇదే సమయంలో సబ్సిడీ తగ్గించి ధర పెంచడం వల్ల ఆయిల్ కంపెనీల ఆదాయం పెరిగి మార్కెట్లో సానుకూల ఫలితాలు సాధించాయని చెబుతున్నారు. అంటే పేదల ప్రజలపై భారాలు మోపి కంపెనీలను లాభాల్లో చూపి వాటిని కార్పొరేట్ శక్తులకు 'అచ్ఛేదిన్' తీసుకురావడమే ప్రధానంగా మోడీ సర్కార్ పనిచేస్తోంది.

సరఫరా నిలిపివేసి.. కాకమ్మ కథలు

దేశంలో గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రధానంగా గిరిజన ప్రాంతాల్లో అత్యంత నిరుపేదలు, ఆదివాసీ ప్రజలు వెలుతురు కోసం, వంట కోసం కిరోసిన్‌ను విరివిగా వినియోగిస్తారు. చౌక దుకాణాల ద్వారా వీరికి కిరోసిన్ అందేది. ప్రభుత్వం వంట గ్యాస్ కనెక్షన్లు భారీగా ఇవ్వడంతోనే కిరోసిన్ వినియోగం తగ్గిందని కేంద్ర ప్రభుత్వ పెద్దలు కాకమ్మ కథలు చెబుతున్నారు.

వాస్తవంలో రాష్ట్రాలకు కేంద్రం నుంచి కిరోసిన్ నిలిపివేయడం వల్లే వినియోగం తగ్గినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. దేశంలో గతేడాది 63 లక్షల మెట్రిక్ టన్నుల కిరోసిన్‌ను వినియోగిస్తుండగా.. చౌక దుకాణాలకు కేంద్రం సరఫరా నిలిపివేయడంతో 2017 ఫిబ్రవరి నాటికి దేశంలో సబ్సిడీ కిరోసిన్ వినియోగం 50 లక్షల మెట్రిక్ టన్నులకు పడిపోయింది. గత దశాబ్ద కాలంలో కిరోసిన్ వినియోగం 4.2 శాతం తగ్గుదలతో ఒక్క అంకెకే పరిమితం కాగా 2016-17 ఒక్క ఏడాదిలోనే కిరోసిన్ వినియోగాన్ని కేంద్రం ఏకంగా 34 శాతం తగ్గించివేసింది. దీనికి ప్రధాన కారణం ప్రజలు వినియోగించకపోవడం కాదు..వారికి అందాల్సిన కిరోసిన్‌ను కేంద్ర ప్రభుత్వం బలవంతంగా నిలిపివేయడమే.

రాష్ట్రంలోనూ అత్యవసర స్పందన కమిటీలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కూడా అత్యవసర స్పందన కమిటీలు ఏర్పాటు చేస్తూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఎఆర్ అనురాధ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జాతీయ అత్యవసర స్పందన వ్యవస్థ పేరుతో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 112 టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేసింది. ఈ విధి విధానాలను కేంద్ర ప్రభుత్వం జారీ చేసింది. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కూడా ఈ వ్యవస్థ పనిచేసే విధంగా కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలకు తెలిపింది. అందులో భాగంగానే రాష్ట్ర స్థాయిలో అపెక్స్, స్టీరింగ్ కమిటీలు, జిల్లాలో మిషన్ కమిటీలు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అపెక్స్ కమిటీ చైర్‌పర్సన్‌గా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కో చైర్ పర్సన్లుగా హోంశాఖ ముఖ్యకార్యదర్శి, డిజిపి వ్యవహరిస్తారు. పోలీస్ విభాగం టెక్నికల్ సర్వీసెస్ నుంచి ఐజీ మెంబర్ కన్వీనర్‌గా, సభ్యులుగా విపత్తుల నిర్వహణ, ఫైర్ సర్వీస్ డైరెక్టర్ జనరల్, స్త్రీ, శిశుసంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి, ఐటీ కార్యదర్శి, జాతీయ సమాచార కేంద్రం నుంచి ఒకరు, హోం అఫైర్స్ మంత్రిత్వ శాఖ నుంచి ఒకరు ఉంటారు. రాష్ట్ర స్టీరింగ్ కమిటీలో చైర్‌పర్సన్ , సభ్యునిగా డిజిపి, కో చైర్మన్, కన్వీనర్‌గా పోలీస్ టెక్నికల్ సర్వీసెస్ ఐజీ, హోం శాఖ నుంచి ఒకరు కో చైర్మన్‌గా ఉంటారు. సభ్యులుగా రాష్ట్ర విపత్తుల నిర్వహణ, ఫైర్ సర్వీసెస్ నుంచి డిజి, స్త్రీ శిశుసంక్షేమ శాఖ ప్రత్యేక కమిషనర్, ఆరోగ్య శాఖ నుంచి ఒకరు, ఐటీ డిపార్ట్‌మెంట్ నుంచి ఒకరు,ఎన్‌ఐసి నుంచి ఒకరు ఉంటారు. జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ చైర్‌పర్సన్‌గా, ఎస్పీ కోచైర్మన్‌గా, అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కో చైర్మన్, కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

కుప్పకూలుతున్న బెట్టింగ్ బాబులు

- **ఆటేదైనా వీరి రూటే సెపరేటు**
- **ప్రొ కబడ్డీలోనూ కోట్లు బెట్టింగులు**
- **సమిధలవుతున్న అమాయకులు**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విజయవాడ చిట్టినగర్‌కు చెందిన నాగరాజు వడ్రంగి మేస్త్రి. అతను పనికి వెళ్తే రోజుకు రూ 800 వందలిస్తారు. వారం మొత్తం కష్టపడితే రూ.4,800 చేతికొస్తుంది. ఎలా అలవాటయ్యిందో ఏమో బెట్టింగ్ ఉచ్చులో పడ్డాడు. ప్రస్తుతం జరుగుతున్న ప్రొ కబడ్డీ పోటీల బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. వారం మొత్తం కష్టపడిన సొమ్మును గంటల వ్యవధిలో నష్టపోతున్నాడు. జూదంలో భార్య నగల్నీ పోగొట్టుకున్నాడు. కబడ్డీ పోటీలకు ముందు గతంలో జరిగిన ఐపిఎల్ క్రికెట్ బెట్టింగుల్లో కూడా ఇదేవిధంగా భారీగా నష్టపోవడంతో కుటుంబంలో మనస్పర్థలొచ్చాయి. బెట్టింగుల మోజులో కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో అతని భార్య తరచూ గొడవ పడుతుండేది. పెద్దల సమక్షంలో రాజీ జరిగింది. అనంతరం కొంతకాలం జూదానికి దూరంగా ఉన్న అతను మరలా కబడ్డీ పోటీల వేదికగా బెట్టింగులకు పాల్పడుతుండటంతో కుటుంబంలో గొడవలు పెరిగిపోయాయి. ఇదేమిటని ప్రశ్నించిన భార్యపై దాడి చేయడంతో ఆమె తూర్పు గోదావరి, తునిలోని తన పుట్టింటికి వెళ్లి పోయింది. భర్తతో కలిసి ఉండటానికి ఇష్టంలేక అక్కడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నాగరాజు పరారయ్యాడు. వీరికి 8,10 ఏళ్లున్న ఇద్దరు పిల్లలున్నారు. ప్రస్తుతం వీరి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. పశ్చిమ గోదావరి కామవరపు కోటకు చెందిన వెంకటేష్ ఏలూరులో ఉంటూ సిఆర్ రెడ్డికాలేజీలో పిజి చదువుతున్నాడు. బెట్టింగులకు బానిసైన ఇతను ఏ ఆటకైనా జూదం ఆడుతుండేవాడు. తాజాగా జరుగుతున్న ప్రొ కబడ్డీ పోటీల బెట్టింగ్ కోసమని తన సోదరి కట్నం కోసం ఇంట్లో దాచిన సుమారు రూ.3 లక్షల నగదును దొంగిలించి బెట్టింగుల్లో నష్టపోయాడు. దీనిపై ప్రశ్నిస్తే ఇంట్లోంచి వెళ్లిపోతానని బెదిరిస్తున్నాడు. పోలీసులకు చెబితే తమ పరువే పోతుందని అతని తల్లిదండ్రులు మిన్నకుండిపోయారు. కుమారుడి జూద వ్యసనాన్ని మాన్పించేందుకు ఏం చేయాలో తెలియక వారు ఆందోళన చెందుతున్నారు.

అన్ని వర్గాలూ బెట్టింగ్‌లోనే

కాదేదీ జూదానికనర్హం అన్నట్లు బెట్టింగ్ వర్గాలు రెచ్చి పోతున్నాయి. మొన్నటి వరకు ఐపిఎల్ క్రికెట్‌తో బెట్టింగ్‌లు నిర్వహించిన జూదగాళ్లు నేడు ప్రొకబడ్డీని వేదికగా చేసుకున్నారు. ఎదుటి వాడి దురాశను అవకాశంగా మలుచుకుని కోట్లు సంపాదిస్తున్నారు. జూద వ్యసనంలో పీకల్లోతు కూరుకుపోయిన అమాయకులు లక్షల రూపాయిలు నష్టపోయి తమ జీవితాలనే బలి చేసుకుంటున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, రోజు కూలీలు కూడా ఇందులో సమిధలవుతున్నారు. పరిమిత సమాచారంతో పోలీసులు చేస్తున్న దాడులతో అరకొర వ్యవహారాలు బయటకొస్తున్నా బెట్టింగ్ మాఫియా తన కార్యకలాపాలను యథేచ్ఛగా నిర్వహిస్తూనే ఉంది.

తద్వారా కోట్లాది రూపాయిలను కొల్లగొడుతూనే ఉంది. వ్యవస్థీకృతమైన ఈ బెట్టింగుల నిర్వహణలో రాజకీయ నేతలతో పాటు వ్యాపారులు, కొందరు పోలీసులకూ పాత్ర ఉందనే ఆరోపణలున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న బెట్టింగులపై పోలీస్ ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో నిఘా ఏర్పాటు చేసి నిలువరించాల్సిన అవసరం ఉంది. తమ కుటుంబాల్లా ఇతరులు బలికాకుండా ఉండేందుకు తగు చర్యలు తీసుకుకోవాలని బాధిత కుటుంబీకులు పోలీసులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆక్రమణల క్రమబద్ధీకరణ

(మొదటిపేజీ తరువాయి)

కొత్తగా ఏర్పాటు చేసిన బిసి గురుకుల పాఠశాలల్లో 13 టీచింగ్ పోస్టుల మంజూరుకు మంత్రిమండలి ఆమోద ముద్ర వేసింది. రాష్ట్రంలోని పది రెవెన్యూ డివిజన్లలో కొత్తగా ఏర్పాటైన సబ్ ట్రెజరీ కార్యాలయాలను అసిస్టెంట్ ట్రెజరీ కార్యాలయాలుగా స్థాయి పెంచాలని నిర్ణయించింది. విశాఖ, తిరుపతి, విజయవాడలోని ఎపి భూ సేకరణ, పునరావాస, రీసెటిల్‌మెంట్ అథారిటీ ప్రిసైడింగ్ అధికారి కార్యాలయాల్లో ఒకొక్క యూనిట్‌లో 13 పోస్టుల చొప్పున 39 పోస్టుల మంజూరును ఆమోదిస్తూ మంత్రి మండలి తీర్మానించింది.

తిరుపతి సైన్స్ మ్యూజియానికి 71 ఎకరాలు

తిరుపతిలో ఏర్పాటు చేస్తున్న సైన్స్ మ్యూజియం కోసం టిటిడికి చెందిన 71.11 ఎకరాలను షరతుల మేరకు లీజుకు ఇవ్వాలని నిర్ణయించింది. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం పైడిభీమవరం ఐడిఎలోని మెస్సర్స్ అనూస్ ల్యాబ్ కొనుగోలుకు, విశాఖలో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుకు ముందుకొచ్చిన విజయవాడ మౌంట్ డియోస్ ఎడ్యుకేషనల్ సొసైటీకి స్టాంప్ డ్యూటీ మినహాయింపు ఇవ్వాలన్న ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోద ముద్ర వేసింది.

ఫార్మర్స్ మేనేజ్‌మెంట్ ఆఫ్ ఇరిగేషన్ సిస్టమ్స్ చట్టం-1997 స్థానంలో సవరణ ఆర్డినెన్స్-2017 బిల్లుకు ఆమోదం తెలిపింది. ప్రకాశం జిల్లా మామిడిపాలెంలో ఎసిబి కార్యాలయ భవనానికి 14 సెంట్ల భూమిని, పెళ్లూరులో గిరిజన భవన్, ఎటిడబ్ల్యూ కార్యాలయం నిర్మాణానికి 50 సెంట్ల భూమిని కేటాయించాలని నిర్ణయించింది. పరిశ్రమల ఏర్పాటుకు పలు ప్రాంతాల్లోని భూమిని ఎపిఐఐసికి బదలాయించే ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.



దాడులు నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ ఎసిపి, ఫుడ్ సేఫ్టీ అధికారి పూర్ణచంద్రరావు

గ్లూకోజ్ రీ ప్యాకింగ్ కేంద్రంపై టాస్క్‌ఫోర్స్ దాడి

ప్రజాశక్తి - వన్‌టౌన్ (విజయవాడ)

విజయవాడలోని కొత్తపేట చేపల మార్కెట్ సమీపంలో ఓ ఇంట్లో గ్లూకోజ్ రీ ప్యాకింగ్ తయారీ కేంద్రంపై గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఎసిపి ప్రసాద్ నేతృత్వంలో జరిగిన ఈ దాడుల్లో అనుమతి లేకుండా తయారు చేస్తున్న, కాలపరిమితి ముగిసిన మందులను పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్నారు. అలాగే అముదం, గ్లూకోస్ వంటి ఉత్పత్తులనూ, అనుమతి లేకుండా మూడు బ్రాండెడ్ కంపెనీల పేరుతో రీ ప్యాక్ చేస్తుండటాన్ని గుర్తించారు. సేకరించిన వివరాల మేరకు.. శ్రీ ఆంజనేయ మెడికల్స్, స్వస్తిక్ ప్రొడక్ట్స్ పేరుతో తాడపల్లి తుకారం, అతని కుమారుడు అమర్‌కుమార్ కలిసి మందులు షాపు, గ్లూకోజ్ రీ ప్యాకింగ్ చేస్తున్నారు. గ్లూకోజ్‌ను పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి మూడు బ్రాండ్ల పేరుతో ప్యాకింగ్ చేస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడుల అనంతరం ధ్రువీకరించారు. గ్లూకోజ్ రీ ప్యాకింగ్‌తోపాటుగా ఆముదమూ తయారు చేసి సీసాల్లో పోసి విక్రయిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ అధికారులతోపాటుగా దాడుల్లో పాల్గొన్న ఫుడ్ సేఫ్టీ అధికారి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ.. గ్లూకోజ్ రీ ప్యాకింగ్‌కు ఫుడ్‌సేఫ్టీ అధికారులు, వైద్యుల నుంచి ఎలాంటి అనుమతులూ పొందకుండానే నకిలీ బ్రాండ్ల పేరుతో అమ్మకాలు చేస్తున్నారన్నారు. స్వాధీనం చేసుకున్న మందులను సేకరించి పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌కు పంపిస్తామన్నారు. నివేదికలు వచ్చిన అనంతరం చర్యలు తీసుకుంటామని వివరించారు.

కొత్తగా చెప్పాలని ట్రై చేశా

గోపీచంద్



"ఇంతకు ముందు నేను చేసిన అన్ని సినిమాల్లో కంటే కథగా నాకు ఎంతో సంతృప్తి ఇచ్చిన సినిమా 'గౌతమ్ నంద'. పాత కథే అయినా కొత్తగా చెప్పాలని ట్రై చేశాను. ఎమోషనల్ సీన్స్, ట్విస్ట్‌లు మనసుకి హత్తుకునేలా వున్నాయని చెప్తున్నారు. మౌత్ టాక్ రోజు రోజుకీ పెరుగుతోంది. ప్రతి ఒక్కళ్లూ మా సినిమా ఆదరిస్తున్నారని" దర్శకుడు సంపత్‌నంది అన్నారు. గోపీచంద్, హన్సిక, కేథరిన్ కాంబినేషన్‌లో జె.భగవాన్, జె.పుల్లారావు నిర్మించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలైంది. ఈ సందర్భంగా సక్సెస్‌మీట్‌ని నిర్వహించారు.

గోపీచంద్ మాట్లాడుతూ... నేను చేసిన అన్ని సినిమాల్లో కంటే ఎక్కువ కలెక్షన్స్ ఈ సినిమాకి వచ్చాయి. ఒక మంచి కథతో సినిమా చేశాను. చాలా రోజుల తర్వాత పెర్‌ఫార్మెన్స్‌కి స్కోప్ వున్న పాత్రల్లో నటించాను. ఫ్రెండ్స్ అందరూ ఇరగదీసావ్ రా! అని మెచ్చుకుంటున్నారు. ఎమోషన్ సీన్స్‌కి, యాక్షన్ సీన్స్‌కి ఎక్కువ రెస్పాన్స్ వస్తోందని అన్నారు.

నిర్మాతలు మాట్లాడుతూ... మా చిత్రం 6 రోజులకి 22 కోట్ల 25 లక్షల 47 వేల 433 రూపాయలు కలెక్ట్ చేసింది. ఎ.పి.లో 8 కోట్ల 88 లక్షల 28 వేల 388 రూపాయలు, సీడెడ్‌లో 3 కోట్ల 23 లక్షల 82 వేల 021 రూపాయలు, నైజాంలో 8 కోట్ల 38 లక్షల 37 వేల 024 రూపాయలు, కర్ణాటక 1 కోటి 30 లక్షలు, నార్త్ ఇండియా 20 లక్షలు ప్రపంచవ్యాప్తంగా మొత్తం 22,25,47,433 రూపాయలు కలెక్ట్ చేసిందని పేర్కొన్నారు.



కె.ఎస్. రవికుమార్, రత్నం, సి.కళ్యాణ్, అంబికా కృష్ణ, బాలకృష్ణ

బాలకృష్ణ 102 సినిమా ప్రారంభం

బాలకష్ణ 102వ చిత్రం గురువారం రామోజీఫిలింసిటీలో ప్రారంభమైంది. సి.కె.ఎంటర్‌టైన్మెంట్స్ ప్రై.లి బ్యానర్‌పై కె.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో సి.కల్యాణ్ నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి బోయపాటి శ్రీను క్లాప్ కొట్టగా, బి.గోపాల్ కెమెరా స్విచ్చాన్ చేశారు. తొలి సన్నివేశానికి క్రిష్ గౌరవ దర్శకత్వం వహించారు. అనంతరం జరిగిన పాత్రికేయుల సమావేశంలో దర్శకుడు కె.ఎస్.రవికుమార్ మాట్లాడుతూ... 18 సంవత్సరాలు తర్వాత తెలుగులో చేస్తున్న సినిమా ఇది. అది కూడా బాలకష్ణతో సినిమా చేయడం ఆనందంగా ఉంది. గతంలో రెండు, మూడు సార్లు బాలకృష్ణతో ప్రయత్నించినప్పటికీ ఇప్పటికి కుదిరింది. నాతో ఉన్న టీమ్ బాగా కుదరడంతో పాజిటివ్‌గా కనపడుతుంది. రత్నం చెప్పిన కథ నాకు, బాలకష్ణ, కల్యాణ్‌గారికి బాగా నచ్చడంతో తెరకెక్కిస్తున్నామని' అన్నారు.

సి.కల్యాణ్ మాట్లాడుతూ... బాలకష్ణ 101వ సినిమా ఇదే కావాల్సింది. కానీ రవికుమార్ బిజీగా ఉండటంతో ఆయన పూరితో 101వ సినిమా చేస్తున్నారు. కె.ఎస్.రవికుమార్ సినిమాలు ఎంత పెద్ద హిట్స్ అయ్యాయో తెలిసిందే. ముందు ఏవో కథలు అనుకున్నా, చివరకు గుర్తుండే పోయే సినిమా కావాలనిపించింది. అప్పుడు రత్నం 15 నిమిషాల్లో చెప్పిన కథ బాగా నచ్చడంతో ఆ కథతో సినిమా చేద్దామని నిర్ణయించుకున్నాం. రవికుమార్‌కి లైన్ చెప్పగానే ఆయన వెంటనే రత్నంతో మాట్లాడి కథ విని ఓకే చేశారు. తర్వాత బాలయ్యబాబుగారి దగ్గరకు వెళ్లి కథ చెప్పాం. ఆయనకు కూడా కథ నచ్చింది. సాధారణంగా బాలకష్ణ సినిమా అంటే మాస్‌తో పాటు గుండెను పిండేసే ప్రేమాభిమానాలు, సెంటిమెంట్ ఉండాలి. అలాంటి కోవకు చెందిన కథతో ముందుకెళ్తున్నాం. చిరంతన్ భట్ ఈ చిత్రానికి సంగీతం అందించాడు. అల్రెడి రెండు హిట్ చిత్రాలకు సంగీతం అందించిన చిరంతన్ భట్ ఈ సినిమాతో హ్యాట్రిక్ హిట్ కొడతాడు. ఈ రోజు నుండి నెలాఖరు వరకు రామోజీ ఫిలింసిటీలో షూటింగ్ జరుగుతుంది. వచ్చేనెల 6 నుండి కుంభకోణంలో షూటింగ్ ఉంటుంది. అనంతరం వైజాగ్, హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతుంది. తర్వాత పాటల చిత్రీకరణతో పూర్తి చేస్తాం. 2018 సంక్రాంతికి ఈ సినిమా రిలీజ్ కాబోతుంది. నయనతార హీరోయిన్ గా చేస్తున్నారు. అలాగే ఇంకా ఇద్దరు హీరోయిన్స్ ఉన్నారు. వారెవరనేది త్వరలోనే తెలుస్తుంది. ప్రకాష్ రాజ్ చాలా గొప్ప క్యారెక్టర్ చేస్తున్నారు. ఇంకా అశుతోష్ రాణా, అథర్ చీమా పవర్‌ఫుల్ క్యారెక్టర్ చేస్తున్నారు. అలాగే బ్రహ్మానందం ఎంటర్‌టైనింగ్ రోల్ చేస్తున్నారని అన్నారు.



బాలయ్య ఎమోషనల్

సినిమా ప్రారంభోత్సవం నాడే యాక్షన్ సీన్ చేస్తున్న బాలకృష్ణ షాట్ కోసం రెడీ అవుతున్న సమయంలో సమయానికి షూలు విప్పలేదని తన అసిస్టెంట్‌ను షూ విప్పమంటూ తలపై ఓ దెబ్బ వేశారు. దర్శకుడు కేయస్ రవికుమార్‌తో మాట్లడుతుండగా అసిస్టెంట్ బాలయ్య షూ విప్పాడు. అనంతరం రౌడీలను కొట్టే సన్నివేశంలో నటించాడు.

విదేశీ ప్రేమకథ



ఇటీవల ప్రేమకథలు విదేశాల్లో ప్రారంభమవుతున్నాయి. అలాంటి కోవలో నితిన్ 'లై' (లవ్ ఇంటెలిజెన్స్ ఎన్‌మిటి) వుండబోతుందని చిత్ర యూనిట్ తెలియ జేస్తుంది. వెంకట్ బోయనపల్లి సమర్ప ణలో 14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రై. లిమిటెడ్ పతాకంపై హను రాఘవపూడి దర్శకత్వంలో రామ్ ఆచంట, గోపీ ఆచంట, అనీల్ సుంకర నిర్మిస్తున్నారు. ఈనెల 11న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. కాగా, ఈ చిత్రానికి సంబం ధించి ప్రీ రిలీజ్ ఫంక్షన్‌ను ఈనెల5న హైదరాబాద్‌లో జరపనున్నారు.

నిర్మాతలు మాట్లాడుతూ.. ఈనెల 11నే ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తామని నితిన్ పుట్టినరోజైన మార్చి 30న ప్రకటించాం. దానికి తగ్గట్టుగానే అన్నీ పక్కా ప్లానింగ్‌తో చేసుకుంటూ వచ్చాం. నితిన్ కెరీర్‌లోనే హయ్యస్ట్ బడ్జెట్‌తో రూపొందు తున్న 'లై' చిత్రం పెద్ద హిట్ అయి మా హీరో నితిన్‌కి, మా బేనర్ మంచి పేరు తెస్తుందని ఆశిస్తున్నామని' అన్నారు. మేఘా ఆకాష్, యాక్షన్ కింగ్ అర్జున్, శ్రీరామ్, రవికిషన్, పథ్వీ, బ్రహ్మాజీ, తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు.



మోషన్ పోస్టర్‌కు వన్ మిలియన్ వ్యూస్

'జో'ని దర్శకుడిగా పరిచయం చేస్తూ.. పొట్లూరి స్టూడియోస్ పతాకంపై పద్వీ పొట్లూరి హీరోగా నటిస్తూ నిర్మిస్తున్న 'యువర్స్ లవింగ్లీ' మోషన్ పోస్టర్ వన్ మిలియన్ వ్యూస్ రాబట్టింది. దీని పట్ల చిత్ర బందం సంతోషం వ్యక్తం చేస్తోంది. పద్వీ పొట్లూరి సరసన సౌమ్య శెట్టి నటిస్తున్న ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలు సైతం పూర్తి చేసుకొంది. అందరూ కొత్తవాళ్లతో రూపొందిన చిత్రానికి వన్ మిలియన్ (పది లక్షల) వ్యూస్ రావడం సంతోషంగా ఉండడంతో పాటు.. ప్రాజెక్ట్ పట్ల తమ ఆత్మ విశ్వాసాన్ని ఇనుమడింపజేస్తోందని పద్వీ పొట్లూరి అన్నారు. విడుదలయ్యాక చిత్రం గురించి ప్రతి ఒక్కరూ మాట్లాడుకుంటారని.. పేరెంట్స్ అందరూ తమ పిల్లల్ని వెంటబెట్టుకొని ఈ సినిమాకు వెళ్తారని, అతి త్వరలోనే ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని దర్శకుడు జో అన్నారు.



తిరుపతిలో 'ఫిదా' యూనిట్ సందడి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ప్రముఖ హీరో వరుణ్‌తేజ్ నటించిన 'ఫిదా' చిత్ర యూనిట్ గురువారం తిరుపతిలో సందడి చేసింది. తిరుపతిలోని సంధ్య థియేటర్ వద్దకు మధ్యాహ్నం చేరుకున్న చిత్ర యూనిట్ వెండితెర వద్ద ఏర్పాటు చేసిన వేదికపై నుంచి అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్‌కు ఖుషి, బన్నీకి ఆర్య చిత్రంలా వరణ్‌తేజకు 'ఫిదా' ఓ మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. క్లాస్ సినిమా మాస్ చిత్రం తరహాలో కలెక్షన్లు వసూళ్లు చేయడం ఆనందంగా ఉందన్నారు. దర్శకులు శేఖర్ కమ్ములా మాట్లాడుతూ.. అంచనాలకు మించి ఈ చిత్రం విజయాన్ని సాధించడం ఆనందంగా ఉందన్నారు. హీరోయిన్ సాయిపల్లవి చిత్రంలో తన డైలాగ్ 'భానుమతి ఒకటే ఫేసు రెండు కులాలు, రెండు మతాలు' చెప్పడంతో ప్రేక్షకులు విజిల్స్ వేశారు. హీరో వరుణ్‌తేజ్ మాట్లాడుతూ.. తనను ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ చిత్రం విజయంతో తాను మరింత రెట్టింపు ఉత్సాహంతో తదుపరి చిత్రాలను చేస్తానని, ప్రేక్షకులను మెచ్చే చిత్రాలను తీస్తానని చెప్పారు. ఫిదా చిత్రం కుటుంబసమేతంగా చూడదగ్గ చిత్రమని, ఇందులో యువతీ యువకులను మెప్పించే అనేక సన్నివేశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వారి వెంట నిర్మాత ఎన్‌వి.ప్రసాద్, చిన్నంగారి రమణ, కమెడియన్ రాజేష్ పాల్గొన్నారు.

'లవర్స్ క్లబ్'



అనిష్ చంద్ర, పావని, అర్యన్, పూర్ణి ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'లవర్స్ క్లబ్'. ధృవ శేఖర్ దర్శకుడు. భరత్ అవ్వారి నిర్మాత. ఈనెల 25న చిత్రాన్ని విడుదల చేయనున్నారు. దర్శకుడు మాట్లాడుతూ ఐ ఫోన్ టెక్నాలజీతో తెరకెక్కించిన చిత్రమిది. సాంకేతికతతో మరిన్ని అద్భుతాలు సృష్టించొచ్చు. ప్రేమికులకు అండగా నిలబడే ఓ యువకుడి కథ ఇది' అని చెప్పారు.

ఉయ్యాలవాడలో సుదీప్?



చిరంజీవి 151వ సినిమాగా 'ఉయ్యాలవాడ నర సింహా రెడ్డి'ని తెరకెక్కించడానికి రంగం సిద్ధమవుతోంది. ఈ సినిమా కోసం నటీనటుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. అమితాబ్‌ను కన్నడ స్టార్ ఉపేంద్రను ఎంపిక చేసుకున్నారనే టాక్ వచ్చింది. తాజాగా.. ఈ సినిమాలో ఒక కీలకమైన పాత్ర కోసం కన్నడ నటుడు సుదీప్‌ను సంప్రదిస్తున్నట్టుగా తెలుస్తోంది. తెలుగువాడై వుండి.. ఆంగ్లేయులకు సహకరించే పాత్ర కోసం ఆయనని అడుగుతున్నారట. తప్పకుండా ఆయన అంగీకరించవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఉపేంద్రను వేరే రోల్ కోసం తీసుకున్నారా? ఆయన బదులుగా సుదీప్‌ను తీసుకోనున్నారా? అనే విషయంలో క్లారిటీ రావలసి వుంది.



సంతోషం అవార్డుల వేడుక

'సంతోషం' సౌత్ ఇండియన్ ఫిల్మ్ అవార్డుల 16వ వేడుక ఈ నెల 12న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు సురేష్ కొండేటి తెలియజేశారు. కర్టెన్ రైజర్‌లో భాగంగా గురువారంనాడు అవార్డులకు సంబంధించిన లోగోను 'మా' అధ్యక్షుడు శివాజీ రాజా, హీరోయిన్ రెజీనా ఆవిష్కరించారు. అలాగే 'సంతోషం' తొలి ఆహ్వాన పత్రికను శివాజీ రాజా, రెజీనాకు అందించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత కె.ఎస్ రామారావు, హీరో ఆది, హెబ్బా పటేల్, రెజీనా, ఏడిద రాజా, ఏడిద శ్రీరామ్, మహేష్ కొండేటి, లక్ష్మి కొండేటి తదితరులు పాల్గొన్నారు. సురేష్ కొండేటి మాట్లాడుతూ, ప్రతీ ఏడాది నా ప్రోగ్రాం సక్సెస్ అవుతుందంటే కారణం తెలుగు సినిమా ఇండస్ట్రీనే. అసలు అవార్డులు కార్యక్రమం ప్రారంభించ డానికి కారణం హీరో నాగార్జున. తర్వాత చిరంజీవి, బాలకష్ణ, వెంకటేష్ ఎంతగానో ప్రోత్సహిం చారు. నేను బ్రతికున్నంత కాలం అవార్డు వేడుకలను ఘనంగా నిర్వహిస్తాను. ఈ ఏడాది వేడుకలను కూడా చాలా స్పెషల్‌గా ప్లాన్ చేశామని అన్నారు.



అందుకే ఈ సినిమా చేశా : రానా

"సినిమాలపరంగా, వ్యక్తిగతంగా, జీవితపరంగా నందమూరి తారకరామారావుగారంటే నాకు దేవుడులాంటి వారు. ఎన్టీఆర్, ఎంజీఆర్ ఫిలాసఫీలు జోగేంద్ర అనే పాత్రలో ఉంటాయి. అందుకే ఈ సినిమా చేశా. ఈ సినిమా నాకు చాలా ఎమోషనల్‌గా కనెక్ట్ అయిందని" కథానాయకుడు రానా అన్నారు.

తేజ దర్శకత్వంలో ఆయన నటించిన చిత్రం 'నేనే రాజు నేనే మంత్రి'. డా.డి.రామానాయుడు సమర్పిస్తున్నారు. అనూప్ రూబెన్స్ సంగీతాన్ని అందించారు. డి. సురేశ్‌బాబు, ఎం.వి.కిరణ్ రెడ్డి, సి. భరత్ చౌదరి నిర్మాతలు. వివేక్ కూచిభొట్ల, అభిరామ్ దగ్గుబాటి ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు. కాజల్ అగర్వాల్, కేథరిన్ ట్రెసా నాయికలు. నవదీప్ కీలక పాత్రధారి. ఈ నెల 11న విడుదల కానున్న ఈ చిత్రానికి సంబంధించి 'జోగేంద్ర యువగర్జన' కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది.

రానా మాట్లాడుతూ.. ఈ సినిమా గురించి చాలా గర్వంగా ఉన్నా. ఈ సినిమాను మా తాత చూడలేకపోయారనే లోటు ఉంది. ఈ రోజు ఈ వేదిక మీద నిలబడ్డామంటే ఆయన వల్లే. ఆయనతో సినిమా చేయలేదనే బాధ ఉండేది. నాకు తెలిసి ఆయన వెళ్లిపోయాక చాలా పాజిటివ్స్ జరుగుతున్నాయి. పైనుంచి ఆయనే సెట్ చేస్తున్నారని అనిపిస్తోంది. మా నాన్నతో ఫస్ట్ టైమ్ కలిసి చేశాం. మా నాన్న రియలీ గుడ్ ప్రొడ్యూసర్. సినిమా మీద తేజగారికున్న అవగాహన చాలా ఎక్కువ. ఇది జోగేంద్ర జీవిత చరిత్ర. అది రాయాలంటే జీవితంపై అవగాహన ఉండాలి. లేకుంటే రాయలేరు. వెంకటేశ్‌గారి అభిమానులు నాకు తోడు ఉన్నారన్న ధైర్యంతోనే నేను అన్నీ చేస్తున్నా. ఇదే సపోర్ట్ ఇస్తే హాలీవుడ్ సినిమా కూడా చేస్తాను. ప్రతి సినిమా చేస్తున్నప్పుడు కొత్తగా చేయాలని ఉంటుంది. ప్రతి క్యారెక్టర్ కొత్తగా ఉండాలని అనుకుంటా. ఈ సినిమాలో చాలా సన్నగా కనిపిస్తాను. లావుగా కనిపిస్తాను. కండలు కూడా తిరిగి ఉంటాయి. త్వరలోనే యువత కోసం భారీ కార్యక్రమం చేస్తామని తెలిపారు. డి.సురేశ్ బాబు మాట్లాడుతూ "బాహుబలి అయిన తర్వాత ఈ కథని ఓకే చేశాం. కథలంటే నాకు మామూలుగా భయం, అదీ నా కొడుకుతో సినిమా అంటే చాలా భయం.

రానా ఈ కథ విని సెట్ అవుతుందనుకున్నాడు. ఆ తర్వాత ఆ కథని చాలా బాగా తయారుచేశారు. రానాకి యాక్టింగ్ బాగా వస్తుందా? రాదా? అని కూడా ఆలోచించాను. రష్ చూసిన తర్వాత నిర్మాత కిరణ్ బావుందన్నారు. తేజ అందరి చేత బాగా నటన రాబట్టుకున్నారని అన్నారు.


'ఉత్పలమాల ఉత్తరం రాసింది'



తెలుగు భాష మాధుర్యాన్ని చెప్పే కథతో 'ఉత్పలమాల ఉత్తరం రాసింది' చిత్రాన్ని తీస్తున్నానని దర్శకుడు నరసింహా నంది వెల్లడించారు. ఇటీవలే ఆయన 'బుడ్డారెడ్డిపల్లి బ్రేకింగ్ న్యూస్' తెరకెక్కించారు. ఈ శుక్రవారమే ప్రేక్షకులముందుకు వస్తోంది. ఈ చిత్రం గురించి చెబుతూ.. మూగజీవుల సంరక్షణ చట్టం ఉన్నప్పటికీ అది సక్రమంగా పనిచేయడంలేదు. ఆ మధ్య రోడ్డు ప్రమాదంలో గేదె చనిపోయింది. ఆ స్ఫూర్తితో తెరకెక్కించిన చిత్రమిది. ప్రతి చిత్రం ద్వారా మంచి చెప్పే ప్రయత్నం చేస్తాను. ఇక 'ఉత్పలమాల ఉత్తరం రాసింది' గురించి చెబుతూ.. ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసే చిత్రమిది. మూడొంతుల చిత్రీకరణ పూర్తయింది. ఆ తర్వాత సెప్టెంబర్ నుంచి 'వ్యవసాయం దండగ కాదు పండగ' అని చిత్రాన్ని ఆరంభించనున్నానని తెలిపారు.



ఖరీఫ్ పంటలకు నైరుతీ రుతుపవనాల ప్రభావంతో కురిసే వర్షాలే కీలకం. ఈ రుతు పవనాలు ఈ ఏడాది మే 30నే కేరళలో ప్రవేశించాయి. జూన్ 14 నాటికి ఆంధ్రప్రదేశ్ అంతటా విస్తరించాయి. కానీ బంగాళాఖాతంలో జులై మూడో వారంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో ఉత్తర కోస్తా జిల్లాల్లో మాత్రమే విస్తారంగా వర్షాలు పడ్డాయి. ఆశించిన విధంగా రుతుపవన వర్షాలు లేని ఫలితంగా ఈనెల 2వ తేదీ నాటికి రాష్ట్రం సగటున 3 శాతం వర్షపాతం లోటులో ఉంది.



స్వల్పకాలిక రకాలే శరణ్యం

రాజధాని జిల్లాలైన గుంటూరు, కృష్ణాల్లో మాత్రమే సాధారణం కన్నా ఎక్కువ వర్షాలున్నాయి. మిగతా జిల్లాల్లో ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో సుమారు 20 శాతం వర్షపాతం లోటు ఉంది. వీటిలోనూ అనంతపురం జిల్లా ఈ ఆగస్టు 2 వరకు రాష్ట్రంలోనే గరిష్టంగా 32.6 శాతం వర్షపాతం లోటుతో కరువు ఘంటికలు మోగిస్తోంది. వేరుశనగకు బదులు అక్కడ కంది, అపరాలు, ఆముదం, కొర్ర తదితర పంటలను శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. గోదావరి వరదల వల్ల కృష్ణా- గోదావరి డెల్టాల వరకు వరిసేద్యానికి ఢోకాలేదు. ఈ జిల్లాలోనూ రుతుపవన వర్షాలు సరిగా లేక మెట్టప్రాంతా ల్లో వరినాట్లు ఆలస్యమవుతున్నాయి. ఖరీఫ్ సీజనుకు ఇంకా రెండు నెలల వ్యవధి ఉన్నా పంటలు వేసే అదును దాటిపోయింది. ఈ నేపథ్యంలో వర్షాధారంగా మిగిలిన రెండు నెలల్లోనూ సాగుచేయదగ్గ స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటలే శరణ్యమంటున్నారు.

ఇదీ పరిస్థితి...

ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఖరీఫ్ పంటలు ఇంతవరకు 43 శాతానికే పరిమితమయ్యాయి. రాష్ట్రంలో అన్ని పంటలకు 40.47 లక్షల హెక్టార్ల సాధారణ విస్తీర్ణం ఉండగా, ఇంతవరకు 17.54 లక్షల హెక్టార్లలోనే వివిధ పంటల సాగు చేపట్టగలిగారు. వాస్తవానికి ఇప్పటికే 22 లక్షల హెకార్లలో ఖరీఫ్ పంటలు వేయాల్సి ఉంది. ఈ ఆగస్టు, వచ్చే సెప్టెంబరులో వర్షాలు సజావుగా ఉంటే, ఇతర పంటలు లేదా కరువు ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుకు వీలుంటుందని వ్యవసాయరంగ నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వర్షాధార రైతులకు సూచనలు

ఇంతవరకు ఉన్న వర్షాభావ పరిస్థితుల్లో రైతులు ఆగస్టు, సెప్టెంబరుల్లో వర్షాల ఆధారంగా వాతావరణ పరిస్థితులను బట్టి సాగు చేయాల్సిన పంటలను ఎంపిక చేసుకోవాల్సిన అవసరం ఉంటుంది. ఆ విషయంలో రైతులు వ్యవసాయాధికారులను, సమీపంలోని కృషి విజ్ఞాన కేంద్రాలను సంప్రదిస్తే మంచిది. ఎంపిక చేసుకున్న పంటల్లో కూడా స్థానికంగా ఎదురవుతున్న చీడ, పీడలను తట్టుకునే రకాలను వాడాలి. అందువల్ల సస్యరక్షణ ఖర్చులు తగ్గించుకోవచ్చు. ఆముదంలో ఎండు తెగులును తట్టుకునే రకాలు వాడాలి. అలాగే కందిని నల్లరేగడి భూములలో సాగు చేసినప్పుడు ఎండు తెగులు తట్టుకునే రకాలే వాడాలి. వర్షాధారంగా సాగు చేసేటప్పుడు స్వల్పకాలిక అపరాలను, నల్లరేగడిలో సాగు నీటి ఆధారంగానైతేనే దీర్ఘకాలిక రకాలను సాగు చేయాలి. ఈ నేపథ్యంలో కల్తీ విత్తనాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలూ వహించాలి. విత్తడానికి పది రోజుల ముందు పంటను బట్టి 10-100 విత్తనాలను మొలక కట్టి, మొలక శాతం పరీక్షించాలి. దాదాపు అన్ని పంటలలో 80 శాతం పైనే మొలక శాతం ఉండాలి. విత్తన సంచిపై నిర్దేశించిన మొలక శాతం కంటే తగ్గితే, విత్తన డీలర్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చు.

మార్కెట్‌లో సాధ్యమైనంత వరకు ధృవీకరణ విత్తనమే కొనాలి

విత్తనం సంచి లేబిల్ మీద ఏ ప్రాంతానికి లేదా రాష్ట్రాల్లో సాగుకు సరిపోతుందో ముద్రించి ఉంటుంది. వాటిని చూసి తమ ప్రాంతానికి అనుకూలమో లేదో నిర్ధరించుకోవాలి. విత్తనం కొనేటప్పుడు కచ్చితంగా రశీదు తీసుకోవాలి.

కూరగాయల పంటలు, వాణిజ్య పంటలలో హైబ్రిడ్లను కేవలం వర్షాధారంగా సాగు చేస్తే దిగుబడులు తగ్గిపోతాయి. ఎర్రనేలల్లో 120 మి.మీ. నల్లరేగడి నేలల్లో 60-80 మి.మీ. వర్షపాతం నమోదు తర్వాతే విత్తనం వేయాలి. మొలకెత్తిన తర్వాత ఎకరానికి నిర్దేశించిన మొక్కల సంఖ్య ఉండేటట్లు చూసుకోవాలి. వర్షాల మధ్య విరామం 7-15 రోజులు దాటితే మొదటి దశలో మొక్కలు చనిపోతాయి. ఎర్రనేలల్లో ఒక వారం, నల్లరేగడి నేలల్లో రెండు వారాలు విరామం ఏర్పడితే మొక్కలు చనిపోతాయి. అందువల్ల వర్షాధార పొలాల్లో కందకాలు లేదా చిన్నపాటి నీటి కుంటలు తవ్వుకోవాలి. వర్షం ఎక్కువ మోతాదులో పడినప్పుడు ఆయా కుంటలలో చేరిన నీటిని వర్ష విరామ సమయంలో వాడుకోవచ్చు.



డాక్టర్.యన్.కృష్ణప్రియ,
అసిస్టెంట్ ప్రొఫెసర్,
శ్రీబివిఆర్ అగ్రికల్చర్ కాలేజ్, బద్వేల్

రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో జూన్ నుంచి ఆగస్టు 2 వరకు జిల్లాల వారీగా వర్షపాతం వివరాలు మిల్లీమీటర్లలో..

జిల్లా	కురవాల్సింది	కురిసింది	తేడా శాతం
శ్రీకాకుళం	333.1	321.5	-3.5
విజయనగరం	316.2	256.1	-19.0
విశాఖపట్నం	333.2	342.6	2.8
తూ.గోదావరి	371.8	392.1	5.5
ప.గోదావరి	375.7	413.0	9.9
ఉత్తర కోస్తా	346.0	345.1	-0.3
కృష్ణా	315.2	383.7	21.7
గుంటూరు	234.3	282.1	20.4
ప్రకాశం	152.9	152.3	-0.4
నెల్లూరు	149.9	157.3	4.9
దక్షిణ కోస్తా	213.1	243.9	14.4
చిత్తూరు	186.3	163.0	-12.5
కడప	169.1	138.0	-18.4
అనంతపురం	134.8	90.8	-32.6
కర్నూలు	200.2	161.4	-19.4
రాయలసీమ	172.6	138.3	-19.9
ఆంధ్రప్రదేశ్	251.7	244.5	-2.9



ఖరీఫ్ వెద వరిలో కలుపు సమస్య

వరి నాటిన తర్వాత సాధారణంగా రైతులు ఎదుర్కొనే తొలి సమస్య కలుపు. ఈ సమస్య గొర్రుతో నేరుగా విత్తే (వెద వరి)లో ఎక్కువగా ఉంటుంది. వెద విధానంలో నీరు నిలగట్టడం ఉండదు. అందువల్ల కలుపు సమస్య అధికమవుతుంది.

ఏ కారణం చేతనైనా విత్తిన వెంటనే కలుపు మందులు స్ప్రే చేయ కుంటే, ఊద వంటి గడ్డి జాతి మొక్కలుంటే విత్తిన 15-20 రోజుల మధ్య, ఎకరాకు 400 మి.లీ. సైహలోఫాప్ బ్యుటైల్ 10% 200 లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేయాలి. గడ్డిజాతి, వెడల్పాకు కలుపు మొక్కలుంటే ఎకరాకు 100 మి.లీ. బిస్ పైరిబాక్ సోడియం 10% 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

నెల రోజుల తర్వాత : వెద పద్ధతిలో వరి విత్తిన నెల రోజుల తర్వాత పొలంలో వెడల్పాటి కలుపు మొక్కలు బాగా ఎక్కువగా ఉంటే, ఎకరాకు 400 గ్రా. 2, 4-డి సోడియం సాల్టు 80% 200 లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేయాలి.

ఈ మందు స్ప్రే చేసినప్పుడు పైరు కొంచెం ఎర్రబారుతుంది. అందువల్ల పైపాటుగా నత్రజని ఎరువు వేసుకోవచ్చు. లేకుంటే ఎకరాకు 50 గ్రా. ఇథాక్సి సల్ఫ్యూరాన్ 15% పొడి మందును లేదా 8.0 గ్రా. మెట్ సల్ఫ్యూరాన్ మిథైల్+ క్లోరిమ్యూరాన్ ఇథైల్ 20% 200 లీటర్ల నీటిలో కలిపి కలుపుపై పడేటట్లు పిచికారీ చేయాలి.

➲ గొర్రుతో విత్తిన పంట వరుసల్లో ఉంటుంది. ఇలా విత్తిన పైరులో అంతరకృషి ద్వారా కలుపును నియంత్రించవచ్చు.

మినుము/పెసర : మినుము, పెసర పంటలను తొలిదశలో తామరపురుగులు, తెల్లదోమ, పేనుబంక, కాండపు ఈగ ఎక్కువగా ఆశిస్తుంటాయి. వీటి నివారణకు..

కాండపు ఈగ : మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.0 గ్రా. లేదా డైమిథోయేట్ 2.0. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తామరపురుగులు : వీటి నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.0 గ్రా. లేదా ఫిప్రోనిల్ 1.5 మి.లీ. లేద స్పైనోసాడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తెల్లదోమ : ఈ పురుగు నివారణకు ఒక లీటరు నీటికి ట్రైజోఫాస్ 1.5 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా అసిటామిప్రిడ్ 0.2 గ్రా. కలిపి పిచికారీ చేయాలి.

పేనుబంక : డైమిథోయేట్ 2.0 మి.లీ. లేదా మోనో క్రోటోఫాస్ 1.6 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పత్తి

తొలిరోజుల్లో రసం పీల్చు పురుగుల నివారణకు మోనోక్రోటోఫాస్ 1:4 (ఒక భాగం మందు నాలుగు భాగాల నీరు) నిష్పత్తిలో.. 30-45 రోజుల కాండం మీద మందును పూయాలి.

మొక్కజొన్న: పైరు విత్తిన 20 రోజులకు మొదటిసారి, 35-40 రోజులకు రెండోసారి కూలీతో కలుపు తీయించాలి. లేదా అంతరకృషితో కలుపు నివారించాలి. విత్తిన వెంటనే అట్రాజిన్ 50% కలుపు మందు ఎకరానికి 800-1000 గ్రా. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే తొలిదశలోనే కలుపును నివారించవచ్చు.

మొక్కజొన్నకు ఏదశలోనూ నీరు నిల్వ ఉండకూడదు. ఈపైరు నీటి ఎద్దడినీ తట్టుకోలేదు. అందువల్ల బెట్ట పరిస్థితుల్లో నీటి తడులు తప్పనిసరి అవుతాయి.

వేరుశనగ

రాయలసీమ ప్రాంతాల్లో ఇప్పటికే వేరుశనగ పైర్లు పడాలి. కానీ వర్షాభావం వల్ల పడలేదు. అయితే ఆగస్టులో కూడా సీమలోని కొన్ని మండలాల్లో 10-15వ తేదీ వరకు వేరుశనగ వేసుకునే వీలుంటుంది.

వేరుశనగ విత్తే ముందు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలి. ఒక కేజీ విత్తనానికి 2.0 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ 17.8 ఎస్ఎల్ మందును పట్టించి, అరగంట తర్వాత 1.0 గ్రా. టెబ్యుకోనజోల్ 2 డిఎస్. 2గ్రా. లేదా 3 గ్రా. మాంకోజబ్ 75% డబ్ల్యు.పి. పొడి మందును కలిపి విత్తనాలకు పట్టించాలి. ఇలా విత్తనశుద్ధి చేయడం వల్ల 20 రోజుల వరకు రసం పీల్చే పురుగులు, వేరు పురుగులు, మొలక కుళ్లు తెగులు నుంచీ కాపాడుకోవచ్చు.

జొన్న

జొన్న విత్తిన రెండు వారాల లోపు ఒత్తు మొక్కలను తీసేయాలి. విత్తిన 20-30 రోజులకు గుంటక లేదా దంతితో అంతరకృషి చేయడం వల్ల పొలంలో తేమ నిలిచి, మొక్కలు బాగా పెరుగుతాయి.

➲ కలుపు తీసిన తర్వాత ఎకరాకు 20 కిలోల నత్రజనిని ఇచ్చే ఎరువును(నీటిపారుదల కింద), వర్షాధారమైతే ఎకరాకు 16 కిలోల నత్రజనినిచ్చే ఎరువును పైపాటుగా పైరులో వేయాలి.

➲ మొవ్వ తొలచు ఈగ లేదా కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే ఎకరాకు 4 కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలను సాళ్లలో వేయాలి.

రైతులు మరిన్ని సలహాల కోసం ఉచిత ఫోన్ **1800 425 0430** నంబరుకు కాల్ చేయవచ్చు.



డాక్టర్ కె.రాజారెడ్డి,
విస్తరణ సంచాలకులు, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం, గుంటూరు.




పొడుపు కథ

నల్లని రాజ్యానికి చల్లని రాజు, చుట్టూ మెరిసే భామలు, అది ఎవరు?

జోక్ :

రాము : రాజు మీ ఇంట్లో పిల్లి, కుక్క స్నేహంగా ఉంటాయా?
రాజు : మా ఇంట్లో నేను మా చెల్లే.. స్నేహంగా ఉండం. ఇంక అవేం ఉంటాయ్?
రాము : ఆ..??!!




గడులు నింపండి!

పిల్లలూ..! పైనున్న చిత్రంలో బొమ్మల ఆధారంగా వాటికెదురుగా ఇచ్చిన నంబర్లున్న గడులలో వాటి పేర్లతో నింపండి!

చిక్కటి ద్రవాలను స్ట్రాతో తాగవచ్చా??

పిల్లలూ మీకు తెలుసు కదా! పదార్థాలు మూడు రూపాలలో ఉంటాయి. అవి ఘన, ద్రవ, వాయు రూపాలు. వీటిలో ద్రవస్థితికి ఉండే ప్రత్యేక ధర్మమే తలతన్యత. స్నిగ్ధత, ఏదైనా ద్రవంలో ఉదాహరణకు మజ్జిగలోగానీ, కూల్‌డ్రింక్, కొబ్బరి బొండంలోగానీ స్ట్రా వేసుకొని తాగుతున్నప్పుడు ద్రవ అణువులకు, స్ట్రా అణువులకు మధ్య అసంజన బలాలు ఎక్కువగా ఉంటాయి. అందువల్ల ద్రవం తేలికగా పైకి ఎగబాకటం వలన సునాయాసంగా వాటిని తాగగలుగుతున్నాం. అదే చిక్కటి ద్రవాలైన తేనె, ఆముదం వంటి వాటిలో స్ట్రా వేసి చూడండి. వాటిని మనం పైకి పీల్చలేము. ఎందుకంటే పైకి పీల్చినపుడు అధిక స్నిగ్ధత, సమ సంజన బలాలు ఎక్కువ ఉండటం వలన అంత తేలికగా పైకి ఎగబాకలేవు. అందుకే ఇటువంటి చిక్కటి ద్రవాలను స్ట్రాతో తాగటం కష్టం. అదండీ పిల్లలూ ఇప్పుడు అర్థమైంది కదూ.. చిక్కటి ద్రవాలను స్ట్రావేసి ఎందుకు తాగలేమో! ★





నేటి నుంచి ప్రపంచ అథ్లెటిక్స్

- బోల్ట్ పోటీదారుడు డి గ్రేస్ ఔట్
- భారత్ ఆశా కిరణాలు నీరజ్, లక్ష్మణ్
- 47 స్వర్ణాలు.. 2వేల మంది అథ్లెట్లు



లండన్ : విశ్వ క్రీడలకు తొలి మెట్టుగా భావించే ప్రపంచ అథ్లెటిక్స్ సంబరానికి లండన్ ముస్తాబైంది. ఈ నెల 4వ తేదీ నుంచి 13వ తేదీ వరకు 16వ అథ్లెటిక్స్ మీట్ జరగనుంది. ఇందులో 200 దేశాల నుంచి ట్రాక్అండ్ ఫీల్డ్ ఈవెంట్‌లో 47 స్వర్ణా కోసం 2వేల మందికి పైగా అథ్లెట్లు పోరు సాగించనున్నారు. ఈ సంబరంలో కెన్యా, జమైకా, అమెరికా, బ్రిటన్ అథ్లెట్లు కొన్ని సంవత్సరాలుగా తమ హవాను కొనసాగిస్తున్నారు. ప్రపంచ వేదికలపై ఈ దేశాల అథ్లెట్లు జోరుకు కళ్లెం ఎవరు వేస్తారన్నది ప్రశ్నార్థకమే.బీజింగ్‌లో 2015లో జరిగిన 15వ ప్రపంచ అథ్లెటిక్స్ మీట్‌లో కెన్యా 16 పతకాలు(7 స్వర్ణాలు, ఆరు రజతాలు, 3 కాంస్యాలతో) అగ్రస్థానంలో నిలిచింది. జమైకా- 12 (ఏడు స్వర్ణాలు, రెండు రజతాలు, మూడు కాంస్యాలతో) రెండోస్థానంలోను, అమెరికా 18 పతకాలు(ఆరేసి స్వర్ణ, రజత,కాంస్యాలతో) మూడో స్థానంలో నిలిచాయి. ఈ మీట్‌లో భారత్ నుంచి 16 మంది పాల్గొన్నా అంతర్జాతీయ ప్రమాణాలను అందుకోలేక పోయారు. కనీసం ఒక్క పతకం రేసులోను ముందంజ వేయలేకపోయారు. ఈ సారి 24 మందితో బరిలో దిగుతున్న అథ్లెట్లపై కొంత మందిపై పతక ఆశలయితే ఉన్నాయి. అది ఎవరు తెస్తారన్నది కొంత కష్టమేనని చెప్పాలి. ప్రపంచ అథ్లెటిక్స్‌లో జమైకన్ పరుగుల రారాజు ఉసేన్ బోల్ట్ తన తుది పరుగుకు సిద్ధం అవుతున్నాడు. ఇతనికి ప్రధాన పోటీ దారుడిగా ఉన్న డి గ్రేస్ గాయం కారణంగా మీట్‌కు దూరం అయ్యాడు. దీంతో 100 మీటర్ల పరుగులో శనివారం పోరులో బోల్ట్‌పైనే పరుగుపైనే కోటాను కోట్ల అభిమానుల చూపు పడనుంది. 13 ఏళ్ల అథ్లెటిక్స్ కెరీర్‌లో బోల్ట్ 11 ప్రపంచ పతకాలతో పాటు మూడు ఒలింపిక్స్‌ల్లో వరుసగా ట్రిపుల్ స్వర్ణంతో 9 పతకాలను సాధించి తానేమిటో ప్రపంచానికి చాటాడు. 100, 200 మీటర్ల ప్రపంచ రికార్డులు అతని పేరిటే ఉన్నాయి. 31ఏళ్ల స్టీపుల్ చేజర్ సుధాసింగ్, మహిళల 1500 మీటర్ల పరుగులో అజోయ్ కుమార్ సరోజ్, పియు చిత్రాలకు డైరెక్ట్ ఎంట్రీ ద్వారా పోటీలో బరిలో దిగుతున్నారు.

భారత్ నుంచి 24 మంది... పతకం ఎవరు తెస్తారో..

భారత జట్టు నుంచి మొత్తం 24 మంది అథ్లెట్లు బరిలో దిగుతున్నారు. ఇందులో 8 ఈవెంట్లల్లో 14 మంది పురుషులు, ఆరు ఈవెంట్లలో 13 మహిళా అథ్లెట్లు పతకాల వేటకు సిద్ధం అయ్యారు. జావెలిన్ త్రో జూనియర్ జావెలిన్‌లో ప్రపంచ రికార్డును నమోదు చేసిన నీరజ్ చోప్రా మరో సంచలనం సృష్టిస్తాడా? అన్న ఉత్కంఠ నెలకొంది. ఈ ఏడాది గౌహతిలో జరిగిన ఆసియాన్ అథ్లెటిక్స్ మీట్‌లో 19 ఏళ్ల చోప్రా మీట్ రికార్డుతో స్వర్ణం సాధించాడు. పారిస్‌లో జరిగిన డైమండ్ లీగ్‌లోను 85.23 మీటర్లు దూరం విసిరి ఐదో స్థానంలో నిలిచాడు. ప్రపంచంలో 14వ ర్యాంకులో నిలిచాడు.తమిళనాడు సుదూర పరుగుల వీరుడు జి లక్ష్మణ్ ఆసియాన్ మీట్‌లో 5వేలు, 10వేల మీటర్ల పరుగులో స్వర్ణాలతో మెరిశాడు. శనివారం నాడు 10వేల మీటర్ల పరుగులో తన సత్తా చాటేందుకు పావులు కదుపుతున్నాడు.

ఖేల్‌రత్నాలు సర్దార్, దేవేంద్ర

- అర్జున అవార్డు 17 మంది
- ఆంధ్రప్రదేశ్ నుంచి జ్యోతి సురేఖ



న్యూఢిల్లీ : దేశ అత్యున్నత క్రీడా పురస్కారం ఖేల్‌రత్నకు రెండు సార్లు పారా ఒలింపిక్స్ స్వర్ణాలు సాధించిన దేవేంద్ర జజారియా, భారత మాజీ హాకీ సారథి సర్దార్ సింగ్‌లకు ఇవ్వనున్నారు. వీరిద్దరితో పాటు 17 మంది అథ్లెట్లకు అర్జున అవార్డులను ఇవ్వాలని ఖేల్‌రత్న, అర్జున అవార్డుల కమిటీ క్రీడాశాఖకు గురువారం తన ప్రతిపాదనలను పంపింది. ఇండియన్ టీమ్‌లో పరుగులతో సత్తా చాటుతున్న చటేశ్వర్ పుజారా, ఇటీవల మహిళ ప్రపంచకప్‌లో 171 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును ఫైనల్స్‌కు చేర్చిన హర్మన్ ప్రీత్ కౌర్ క్రికెట్ రంగం నుంచి ఈ పురస్కారం రేసులో ఉన్నారు.గతేడాది పారా ఒలింపిక్స్‌లో హైజంప్‌లో స్వర్ణ ,రజత పతకాలు సాధించిన మరియప్పన్ తంగవేలు, వరుణ్ భాటి, గోల్ఫ్ నుంచి చౌరాసియా, హాకీ ప్లేయర్ ఎస్‌వీ సునీల్ ఉన్నారు.

అర్జున అవార్డు ప్రతిపాదించిన ఇతర అథ్లెట్లు వివరాలిలా..

వి జ్యోతి సురేఖ (ఆర్చరీ), ఖుష్బీర్ కౌర్ (అథ్లెటిక్స్), ఆరోకిన్ రాజీవ్(అథ్లెటిక్స్) ప్రశాంతి సింగ్ (బాస్కెట్ బాల్) ఎల్ దేవేంద్రో సింగ్ (బాక్సింగ్), జస్వీర్ సింగ్ (కబడ్డీ), పి సంజప్ప ప్రకాష్(షూటింగ్), ఓయినమ్ బెంబెం దేవి(ఫుట్‌బాల్),ఎ అమల్ రాజ్ (టేబుల్ టెన్నిస్), సాకేత్ మైనేని (టెన్నిస్), సత్యవర్త్ కడియన్ (రెజ్లింగ్)లున్నారు.

ఏపికి వన్నె తెచ్చిన వెన్నం జ్యోతి



విలువిద్య క్రీడలో ఆంధ్రప్రదేశ్‌కు వన్నె తెచ్చిన వెన్నం జ్యోతి సురేఖ అర్జున అవార్డు ఎంపిక చేసిన జాబితాలో చోటు దక్కించు కోవడంపై సర్వత్రా హర్షం వ్యక్తమైవుతోంది. విజయవాడలో ఓల్గా ఆర్చరీ అకాడమీ కోచ్ చెరుకూరి సత్యనారాయణ సారథ్యంలో విలువిద్యలో రాష్ట్ర ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పింది. ప్రపంచ మహిళా ర్యాంకింగ్స్‌లో 25వ స్థానంలో ఉన్న సురేఖ అంతర్జాతీయ స్థాయిలో 17 పతకాలు, జాతీయ స్థాయిలో 50 పతకాలను సాధించింది.నాలుగేళ్ల ప్రాయంలోనే కృష్ణా నదిని ఈది లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్సుకెక్కింది. ఆ తర్వాత 13 ఏళ్ల వయస్సులో ఆర్చరీలో 2007లో ప్రవేశించింది.జాతీయ సీనియర్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న సురేఖ 2011 ఇరాన్ ఆసియా ఆర్చరీలో కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లో కాంస్యం, 2015 బ్యాంకాక్‌లో జరిగిన వ్యక్తిగత ఈవెంట్‌లో స్వర్ణం సాధించింది. 2013 చైనాలో జరిగిన మహిళా జూనియర్ కాంపౌండ్ టీమ్, వ్యక్తిగత ఈవెంట్లలో కాంస్యాలను కైవసం చేసుకుంది. ఇటీవల ఉలాన్‌బటార్‌లో జరిగిన ప్రపంచ స్టేజ్ పోటీల్లో తృటిలో కాంస్యం చేజార్చుకుంది.

పుజారా, రహానే శతక్కొట్టుడు

రెండో టెస్ట్‌లో భారత్ 344/3



కొలంబో: శ్రీలంక పర్యటనలో సిరీస్‌పై కన్నేసిన విరాట్ సేన కొలంబోలో రెండో టెస్ట్‌లో భారీ స్కోర్ దిశగా సాగుతోంది.పుజారా(128) ,రహానే(103) శతకాల నమోదుతో అజేయంగా నిలిచారు. దీంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 90 ఓవర్లలో 344/3 పరుగులను సాధించింది. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు అభేద్యమైన 211 పరుగులను సాధించడంతో భారత్ తొలిరోజే ఆధిపత్య జట్టుపై పట్టు సాధించింది. ధీర్ఘ కాలంగా గాయాలతో సతమతం అవుతున్న ఓపెనర్ కెఎల్ రాహుల్ మేనేజ్‌మెంట్ అంచనాలకు తగ్గట్టుగా రాణించి ఆరో అర్ధ సెంచరీని నమోదు చేయడం విశేషం. తొలి టెస్ట్‌లో 190 పరుగుల చేసిన శిఖర్ దావన్ 35 పరుగుల వద్ద ఎల్‌బిడబ్ల్యుగా వెనుదిరిగాడు. దిల్‌రువాన్ పెరేరా వేసిన ఆఫ్ స్టంప్ వికెట్ మీదుగా వెళ్లింది. కెప్టెన్ చండీమాల్ డీఆర్ఎస్ కోరి తొలి వికెట్‌ను సాధించాడు. అర్ధ సెంచరీ చేసిన రాహుల్ 57(82 బంతుల్లో 8 ఫోర్లు) రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. కెప్టెన్ విరాట్ కోహ్లీ 13 వద్ద హెరాత్ బౌలింగ్‌లో ఔట్ అయ్యాడు.

4వేల క్లబ్‌లో పుజారా..

కెరీర్‌లో 50 టెస్ట్ ఆడిన చటేశ్వర్ 13వ సెంచరీ నమోదుతో పాటు 4వేల పరుగుల మైలురాయికి చేరుకున్నాడు. 2015 నుంచి 2017 వరకు ఏడు సెంచరీలను నమోదు చేశాడు.

న్యూజిలాండ్ క్వార్టర్స్‌కు ప్రణయ్, సౌరభ్

కశ్యప్, సిరిల్ వర్మ ఔట్

ఆక్లాండ్ : న్యూజిలాండ్ ఓపెన్‌లో భారత్ షట్లర్ల జైత్రయాత్ర కొనసాగుతోంది. యూఎస్ ఓపెన్ విజేత హెచ్ఎస్ ప్రణయ్ ప్రి క్వార్టర్స్‌లో హంకాంగ్ షట్లర్ వుయ్ నాన్‌పై 21-18, 21-19తో కేవలం 46 నిమిషాల్లోనే విజయం సాధించాడు. మరో ప్రి క్వార్టర్స్ మ్యాచ్‌లో కామన్‌వెల్త్ ఛాంపియన్ పారుపల్లి కశ్యప్‌పై భారత్‌కే చెందిన యువ షట్లర్ సౌరభ్ వర్మ జయకేతనం ఎగరవేశాడు. ఏడో సీడ్ సౌరభ్ కశ్యప్‌పై 21-18, 13-21,21-16తో విజయం సాధించి క్వార్టర్స్‌కు ప్రవేశించాడు. మరో మ్యాచ్‌లో సిరిల్ వర్మ చైనీస్ తైపీ షట్లర్ చియా హుంగ్ లూ చేతిలో 13-21, 14-21తో ఓటమి చెందాడు.

తెలుగు టైటాన్స్ ఫ్లాప్ షో

- వరుసగా నాలుగో ఓటమి
- పాట్నాకు రెండో గెలుపు

హైదరాబాద్ : ప్రొ కబడ్డీ (పికెఎల్) ఐదో సీజన్‌లో సొంత గడ్డపై తెలుగు టైటాన్స్ ఘోరంగా ఓటమి చెందింది. ఇప్పటికే ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో కేవలం ఒక్క మ్యాచ్‌లోనే విజయం సాధించిన టైటాన్స్ గచ్చిబౌలీ స్టేడియంలో గురువారం నాటి పాట్నా పైరేట్స్ చేతిలో 43-36 పాయింట్లతో పరాజయం పాలైంది. ఆది నుంచి 10 పాయింట్ల దూరంలో నిలిచిన తెలుగు జట్టు చివరికి 7 పాయింట్ల తేడాతో ఓడింది. 11వ మ్యాచ్‌లో పాట్నా అత్యధిక స్కోర్ 43 పాయింట్లు నమోదు చేయడం విశేషం.



రాహుల్ చౌదరిని పట్టేసిన పాట్నా ఆటగాళ్లు

నేటి మ్యాచ్‌లు

- రాత్రి 8 గంటలకు బెంగళూరు బుల్స్ X తమిళ్ తైలవాస్
- రాత్రి 9 గంటలకు పుణేరి పల్టన్ X దబంగ్ ఢిల్లీ

మహిళా రిజర్వేషన్ చట్టం కోసం పోరాడాలి

- ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే బిలుపై చర్చించాలి
- ఎంపీలపై ఒత్తిడి తేవాలని తీర్మానం
- ఐద్వా రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న చెన్నుపాటి వి.్య

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈ సారి పార్లమెంట్ సమావేశాల్లోనైనా మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని తీసుకురావాలని మహిళా సంఘాలు డిమాండ్ చేశాయి. ఐద్వా ఆధ్వర్యంలో గురువారం ఎంబి విజ్ఞాన కేంద్రంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పలు ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలకు చెందిన మహిళా నాయకులు ' మహిళా రిజర్వేషన్ చట్టం ' అంశంపై చర్చించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేలా ఆయా పార్టీల ఎంపీలపై ఒత్తిడి తీసుకురావాలని పార్టీలకతీతంగా అన్ని పార్టీలకు చెందిన మహిళా నాయకులు సమావేశంలో తీర్మానించారు. ఈ బిల్లుపై పాలకుల్ని కదిలించేందుకు సంతకాలు సేకరించి ముఖ్యమంత్రి, ప్రధానికి ఇ- మెయిల్ పంపాలని నిర్ణయించారు.

మేనిఫెస్టోలో బిజెపి పేర్కొంది:డి.రమాదేవి

సమావేశానికి అధ్యక్షత వహించిన ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో మహిళా రిజర్వేషన్ చట్టాన్ని తీసుకొస్తామని బిజెపి పేర్కొందని గుర్తుచేశారు. అధికారంలో ఉన్న ఆ పార్టీకి ఈ బిల్లు తీసుకురావడం మహిళలకు ఆ పార్టీ ఎంతటి విలువ ఇస్తుందనే పరీక్షలాంటిదన్నారు. పురుషాధిక్యత, స్త్రీలు కొన్ని పనుల కోసమే ఉన్నారన్న భావజాలమే ఇప్పటివరకు ఈ చట్టం అమలుకాకపోవడానికి ప్రధాన కారణమన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి, చర్చించేందుకు టిడిపి ఎంపీలు కృషి చేయాలన్నారు. చట్టాన్ని తీసుకురాని పక్షంలో రానున్న ఎన్నికల్లో మహిళలు తమ ఓటుతోనే సరైన బుద్ధి చెప్తారన్నారు.

మహిళా ఎంపీలు కృషిచేయాలి:చెన్నుపాటి విద్య

మాజీ ఎంపి చెన్నుపాటి విద్య మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లుపై పార్లమెంట్‌లో చర్చించేలా ప్రస్తుతమున్న మహిళా ఎంపీలు కృషి చేయాలన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు కేవలం ఎగువ సభలోనే ఈ బిల్లును మద్దతిచ్చారని, స్థానిక సంస్థల వలే మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలుచేశారన్నారు. అప్పట్లో 18 మంది మహిళా ఎంపీలుండటం వల్లే పోరాడి జోగిని వ్యవస్థ రద్దయ్యేలా చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. చట్టంవస్తే మహిళలకు180 స్థానాలు :అఖిలేని వనజ ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర నాయకులు అఖిలేని వనజ మాట్లాడుతూ ఈ చట్టం అమల్లోకొస్తే 180 ఎంపీ స్థానాలు మహిళలకు దక్కుతాయనే ఇప్పటివరకు మహిళా రిజర్వేషన్ చట్టాన్ని తీసుకురాలేదన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలోనూ మహిళలెంతో మంది పాలుపంచుకున్నా ఈ రిజర్వేషన్ చట్టం ఇప్పటికీ రాకపోవడం శోచనీయమ న్నారు. స్త్రీలకు ఆర్థిక, రాజకీయ సమానత్వం ఉంటేనే మహిళా సాధికారత సాధ్యమన్నారు. ప్రతి సభలోనూ మహిళా సాధికారత అని చెప్పే ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టేలా తన పార్టీ ఎంపీలకు సూచించాలని ఆమె డిమాండ్ చేశారు. విజయవాడ మాజీ మేయర్ తాడి శకుంతల మాట్లాడుతూ చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం సమానంగా ఉండేటే వారి సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ప్రముఖ విద్యావేత్త రెజీనా మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు వారి హక్కుగా భావించి, అందుకు పోరాడాలన్నారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఎస్. పద్మశ్రీ మాట్లాడుతూ ఈ విషయంలో అన్ని పార్టీల మద్దతును కోరతామన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఎందుకంత అశ్రద్ధ:ఓ. శాంతిశ్రీ

ఏపిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర కోశాధికారి శాంతిశ్రీ మాట్లాడుతూ రాష్ట్రవిభజన చట్టం, జిఎస్‌టి, నోట్ల రద్దు వంటి నిర్ణయాలు తీసుకున్న ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లును ఎందుకు తీసుకురావడంలేదని ప్రశ్నించారు. గురజాడ చెప్పినట్టు ఆధునిక మహిళ చరిత్ర తిరగరాస్తుందన్నది నిజం కావాలంటే చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలపాలన్నారు. ఐద్వా కృష్ణా జిల్లా నాయకులు శ్రీదేవి, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కె. ధనలక్ష్మి పలు మహిళా, ప్రజా సంఘాల నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.

గుమ్మడి శ్రీనివాసులుకు భౌతిక శాస్త్రంలో పిహెచ్‌డి



ప్రజాశక్తి - హైదరాబాద్

భౌతికశాస్త్రంలో పరిశోధన చేసిన నెల్లూరుకు చెందిన గుమ్మడి శ్రీనివాసులుకు శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ (ఎస్‌కెయు) డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) ప్రకటించింది. 'డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైక్రో కంట్రోలర్ బేస్డ్ సిస్టమ్ ఫర్ ది మెజర్‌మెంట్ ఆఫ్ బోల్ట్జ్‌మెన్స్ కాన్‌స్టెంట్ అండ్ బ్యాండ్ గ్యాప్ ఇన్ ఎలిమెంటల్ సెమీకండక్టర్స్' అన్న అంశంపై ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ రామచంద్రరావు పర్యవేక్షణలో శ్రీనివాసులు పరిశోధన చేశారు. గత నెల 20న పీహెచ్‌డీకి వైవా కమిటీ సిఫారసు చేయగా, శ్రీనివాసులుకు పీహెచ్‌డీ ప్రకటిస్తూ యూనివర్సిటీ అదే నెల 29న నోటిఫికేషన్ ఇచ్చింది.

జీవో 151 అమలు కోసం ఆగస్టు నెలంతా నిరసనలు

ఏపి 104 కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చంద్రన్న చికిత్స 104 కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ జీవో 151 అమలు చేయాలని కోరుతూ ఈ నెలంతా ధర్నా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆంధ్రప్రదేశ్ 104 కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ తెలిపింది. ఆ జీవో జారీ చేసి ఏడాదవుతున్నా అమలులో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి రవిచంద్ర, జి సింహాచలం, కార్యనిర్వాహక అధ్యక్షులు విజయ్ ఫణికుమార్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఈ జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని గత మూడు నెలలుగా మంత్రులు, అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. తమ ఆందోళనకు ఇతర ఉద్యోగ, కార్మిక సంఘాలు సంఘీభావం తెలపాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సిఎంతో పాటు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి వినతి పత్రాలు, ఆగస్టు 5న ప్రజల ద్వారా ఫోన్లు, ఆగస్టు 7న చంద్రన్నకు రాఖీలు, ఆగస్టు 8న జీవో 151కు వార్షికోత్సవం, అర్థాకలితో విధుల నిర్వహణ, 9న కార్మిక శాఖ అధికారులకు వినతి పత్రాలు, ఆగస్టు 10న ఐపిఎఫ్ సమస్యపై ఐపిఎఫ్ అధికారులకు వినతి పత్రాలు, ఆగస్టు 11న రెవెన్యూ డివిజనల్ ఆఫీసుల వద్ద ధర్నాలు, ఆగస్టు 12న జిల్లా, ఏరియా, కమ్యూనిటీ ఆసుపత్రి అధికారుల ద్వారా వినతి పత్రాలు, ఆగస్టు 13,14 తేదీల్లో విజయవాడలో రిలే దీక్షలు, 16న గాంధీ విగ్రహాలకు, 17న యస్‌టీఆర్ విగ్రహాలకు, 18న అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు, ఆగస్టు 19న దున్న పోతుకు వినతి పత్రాలు, 21న డయల్ యువర్ జిల్లా కలెక్టర్, 22,23,24 తేదీలలో ప్రజల నుండి సంతకాల సేకరణ, ఆగస్టు 26న చెవిలో పువ్వులతో విధుల నిర్వహణ, 28న ఉరితాళ్లతో నిరసనల తెలుపనున్నట్లు వివరించారు.

జగన్ తీరు బాధాకరం

- ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం
- మంత్రులు చిన్నరాజప్ప, అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై జగన్ చేసిన వ్యాఖ్యల పట్ల రాష్ట్ర హోమంత్రి చిన్నరాజప్ప, రవాణా శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. నంద్యాల బహిరంగ సభలో జగన్ మాట్లాడిన తీరు బాధాకరమన్నారు. ప్రభుత్వం తరపున ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసే అంశంపై పరిశీలిస్తామన్నారు. జగన్ తండ్రి రాజశేఖర్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హుందాగా వ్యవహరించేవారన్నారు. రాష్ట్రం గురించి జగన్ ఎప్పుడైనా మాట్లాడారా అని ప్రశ్నించారు. విభజన జరిగి మూడేళ్లవుతున్నా ఇప్పటికి హైదరాబాద్‌లోనే ఉంటూ రాష్ట్రం గురించి ఎలా మాట్లాడతారన్నారు. గృహనిర్బంధాలపై పిచ్చి కూతలు కూస్తున్నారని విమర్శించారు. ఒక సామాజిక సమస్యను పవన్ కళ్యాణ్ ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తే ఆయనను కూడా విమర్శిస్తున్నారన్నారు.

ఏపిలో నిరంకుశ పాలన : గద్దర్

ముద్రగడకు సంఘీభావం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాపుల న్యాయమైన డిమాండ్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని ప్రజా గాయకుడు గద్దర్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సోమాజీగూడ 'ప్రెస్‌క్లబ్‌లో కాపునాడు ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు విహెచ్ హనుమంతరావు, మాజీ సమాచార హక్కు కమిషనర్ విజయ్‌బాబులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గద్దర్ మాట్లాడుతూ కాపుల న్యాయపరమైన హక్కుల కోసం పోరాడుతున్న ముద్రగడ పద్మనాభం పాదయాత్రను అడ్డుకోవడం సరైంది కాదన్నారు. ప్రభుత్వమే ఉద్యమాన్ని హింసాత్మకం చేసి అణచివేయాలని చూస్తోందని ఆరోపించారు. ఎన్నికలకు ముందు కాపులకు రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోమనే అడుగుతున్నారని, ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాటతప్పడం సరికాదన్నారు. ఓటు బ్యాంకుగా కాపులను చూస్తున్న చంద్రబాబు నాయుడు రిజర్వేషన్ల అమలుకోసం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అణిగేనికి సంఘ పొర్వాటోక్యాత్మకముగా ముద్ర వేస్తూ తొక్కించాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు.

పదిహేనొస్తే యూతే!

- వారికోసం ప్రత్యేక కార్యక్రమాలు
- యునిసెఫ్ నుంచి కూడా ఇవే సూచనలు
- ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు నిర్ణయం
- యూత్ పాలసీని రూపొందిస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇకపై పదిహేనేళ్లొస్తే చాలు వారిని యువతగానే పరిగణిస్తారు. యువత కోసం ప్రత్యేకంగా ఒక కార్పొరేషన్‌ను కూడా ఏర్పాటుచేయనున్నారు. ఇవీ రాష్ట్ర ప్రభుత్వం రూపొందిస్తున్న యూత్ పాలసీలోని కీలకాంశాలు. వివిధ వర్గాల నుంచి వస్తున్న సూచనలు, అభిప్రాయాలను క్రోడీకరించిన ఉన్నతాధికారులు కొత్త పాలసీలో యువతకు కొత్త నిర్వచనాన్ని సిద్ధం చేస్తున్నారు. దేశ విదేశాల్లో, వివిధ రాష్ట్రాల్లో ఇప్పటికే కౌమారదశలోని బాలురను కూడా యువతగానే పరిగణిస్తుండగా, తాజాగా రాష్ట్రంలో కూడా ఆదే కోణంలో ఆలోచన చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 18 నుంచి 34 ఏళ్ల మధ్య ఉన్న వారినే యువతగా గుర్తిస్తున్నారు. వీరికే వివిధ ప్రయోజనాలను కూడా అందిస్తున్నారు. అయితే తాజాగా ఈ పరిమితిని 15 నుంచి 34కు మార్చాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 15 నుంచి 18 సంవత్సరాల లోపు ఉన్న వారు పదో తరగతి నుంచి ఇంటర్ మధ్య చదువుతున్న వారే ఉంటారు. ఈ వయోపరిమితిలో ఉన్న వారికి ప్రభుత్వంలో ప్రత్యేకంగా ఎటువంటి గుర్తింపు లేదు. ఎటువంటి పథకాలూ వీరికి వర్తించవు. చెడు దారి పడుతున్న వారిలో ఎక్కువ శాతం ఈ మధ్య వయసున్న వారే ఎక్కువగా ఉంటున్నట్లు గుర్తించారు. యునిసెఫ్ అధ్యయనాల్లో కూడా ఇది బలపడింది. అందుకే 15 నుంచి 18 ఏళ్ల మధ్య వయసున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరముందని యునిసెఫ్ సూచిస్తోంది. ఇటీవల కొన్ని సందర్భాల్లో యునిసెఫ్ ప్రతినిధులతో భేటీ అయిన రాష్ట్ర అధికారులకు కూడా ఇవే సలహాలు అందడం విశేషం. అందుకే కొత్తగా తయారు చేస్తున్న యూత్ పాలసీలో యువత పరిమితిపై ప్రత్యేక నిర్ణయం తీసుకోవాలని యువజన సంక్షేమ శాఖ అధికారులు ప్రతిపాదించారు. ఇలా గుర్తించిన కౌమార దశ యువతకు వివిధ రంగాల్లో, సామాజిక బాధ్యత, నడవడిక, వృత్తి నైపుణ్యం వంటి అంశాలపై శిక్షణివ్వాలని ప్రతిపాదిస్తున్నారు. రాష్ట్ర జనాభాలో 15 నుంచి 34 సంవత్సరాల మధ్య ఉన్న వారు 1.86 కోట్ల మంది(35.9శాతం) వరకు ఉంటారని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. అలాగే 2011 జనాభా ప్రాతిపదికన కౌమార దశలోని బాలురు 9.83 శాతం, బాలికలు 9.08 శాతం ఉంటారని కూడా అంచనా వేశారు. కొత్త పాలసీ అమల్లోకొస్తే వీరంతా కౌమార దశ నుంచి యువతగా మారుతారు. తాజా లెక్కలమేరకు వీరి సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుందని అధికారులంటున్నారు. కాగా, అమెరికాలో ఇప్పటికే 15 నుంచి 24 సంవత్సరాల మధ్య వారిని యువతగా గుర్తిస్తుండగా, దేశంలో 15 నుంచి 29 సంవత్సరాల వారిని యువతగానే భావిస్తున్నారు. కర్నాటకలో 16 నుంచి 30, కేరళలో 18 నుంచి 40, ఒడిషాలో 13 నుంచి 35 సంవత్సరాల మధ్య వారిని యువతగా భావిస్తుండగా, జార్ఖండ్‌లో ఏకంగా పదేళ్ల వయసున్న వారి నుంచి 30 ఏళ్ల వరకు యువతగానే పరిగణిస్తుండడం గమనార్హం. యువత కోసం ప్రత్యేకంగా ఒక కార్పొరేషన్‌ను కూడా ఏర్పాటుచేయాలని ప్రతిపాదిస్తున్నారు. దీనిద్వారా యువతకోసం ప్రత్యేక కార్యక్రమాల్ని తీసుకురావాలని యోచిస్తున్నారు. ఎటువంటి కార్యక్రమాలు, పథకాలు అమలు చేయాలన్నదానిపై కసరత్తు చేయనున్నట్లు సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68